ఆంధ్రప్రబోధినీగ్రంథనిలయము.

తృతీయముద్రణము.

వైదర్భీపరిణయము.

గ్రంథకర్త

శ్రీ. రాజా. కమదన వేంకటరావు బహద్దరు జమీందారువారు.

సంపాదకుఁడు

విద్వాన్ భమిడిపాటి. అయ్యప్పశాస్త్రి, శతావధాని.

ప్రకాశకుఁడు.

అడ్డేపల్లి సత్యనారాయ

కాకినాడ.

కె. సుబ్బారాయుడు బ్రదర్సువారి స్కేప్ అండు కంపెనీ
ముద్రాక్షరశాలయందు ముద్రింపఁబడి అద్దేపల్లి
సత్యనారాయణగారిచేఁ బ్రకటింపఁబడినది.

1924

[వెల రు 1-0-0

అభివందనము.

మా గ్రంథాలయముపై శ్రీవారికిఁగల యభిమానాసమానమైన జ సుహృద్భావపరిపూరిత ప్రేమాయతిశయమనర్గళముగా వెలిఁబుచ్చుట యేగాక శ్రీవారిచే రచింపఁబడి మైలవరం బాలభారతి సమాజమువారిచే పెక్కుసారులు ప్రదర్శింపఁబడి మిక్కిలి పేరెన్నికఁ గాంచిన "బెబ్బులి" అను అముద్రిత గ్రంథరాజమును మా గ్రంథనిలయమునకొసంగిన శ్రీరాజా కోటగిరి వేంకటకృష్ణారావు బహద్దరు జమీందారు వారికి మా కృతజ్ఞతాభివందనములర్పించుచున్నాము. ఇట్టి నిష్కళంక దేశహితైక కార్యాచరణదీక్షితులకుఁ బరమేశ్వరుఁడిష్టైశ్వర్యములను నాయురున్నతులనుఁ గూర్చుఁగాత"

ప్రకాశకుఁడు,

సహాయోద్ధారకులు

మ॥ రా॥ శ్రీ॥ శ్రీ రాజా కమదన వేంకటహనుమంత జగన్నాథరావు బహద్దరు జమిందారు వారు

,, శ్రీరాజా కమదన వేంకటరామారావు బహద్దరు జమీందారు వారు

,, శ్రీరాజా కమదన వేంకటరావు బహద్దరు జమీందారు వారు

,, శ్రీరాజా కమదన శోభనాద్రిరావు బహద్దరు జమీందారు వారు

గౌరవపోషకులు.

మ.రా.రా. శ్రీ దళపతిరావు నరసింహారావు పంతులుగారు ల్యాండు లార్డు బెజవాడ.

మ.రా.రా. శ్రీ చిల్లర వేంకటేశ్వరకవిగారు అష్టావధాని వెల్లలూరు.

సంవత్సరపోషకులు.

మ.రా.రా. శ్రీ అంకరాజు గంగరాజు పంతులుగారు యీనాందారు మండవల్లి.

" శ్రీ మట్టా సుబ్బయ్యగారు వెల్లలూరు.

" శ్రీ అద్దంకి వీరయాచారిగారు వెల్లలూరు.

" శ్రీ గూడపాటి వీరరాఘవయ్యగారు వెల్లలూరు.

" శ్రీ వరికూటి వేంకటసుబ్బయ్యగారు వెల్లలూరు.

" శ్రీ కొత్తపల్లి వెంకటసుబ్బారావుగారు పుట్లచెరువు.

" శ్రీ కొల్లిపర వీరరాఘవయ్యగారు మర్చెంటు పెదకెగూడెం

" శ్రీ చెలపాక అప్పలాచార్యులుగారు యీనాందారు మండవల్లి.

" శ్రీ తుర్లపాటి ఆంజనేయులు పంతులుగారు గుడ్లవల్లేరులాకు

" శ్రీ పాలకోడేటి సత్యనారాయణమూర్తి పంతులుగారు మండవల్లి.

" శ్రీ పావరాల అంజయ్యగారు ల్యాండులార్డు విలేజిమునసబు తాలూకాబోర్డుమెంబరు. అయ్యవారిరుద్రవరము.

కవిజీవితము.

శ్రీయుతులును, పద్మనాయక వంశసంభూతులును, శ్రీచార్ మహల్ సంస్థానపాలనాదక్షులును, శ్రీకమదనవంశదుగ్ధార్ణవోద్దీపిత రాకాశశాంకులును మన యీగ్రంథకర్తలునగు మహారాజరాజశ్రీ రాజా కమదన వేంకటరావు బహద్దరు జమీందారువారు సర్వధారి నామసంవత్సరమందు జననమొందిరి. వీరివంశక్రమంబీవెనుకపుటయందు జూడుడు.

సీ. విప్పర్ణగోత్రాభి విఖ్యాతచరితుండు
        కమదనవంశసంకలితయశుండు
వేంకటరాయాఖ్య విబుధవిధేయుండు
        భారతీపదపద్మ భక్తియుతుండు
సాహిత్యమొకకొంత చవిగొన్నదక్షుండు
        సత్యంబుబాటించు సజ్జనుండు
బీదసాదలపట్ల సాదరహృదయుండు
        ధర్మంబువిడువని ధార్మికుండు
కరములనుమోడ్చి నుతభక్తి కౌశలముగ
సత్కవీంద్రులసేవించి సరసమైన
కైతరచియింపనేర్చిన కవివరుండు
వ్రాసెనీనాటకము జనరంజకముగ

ఇట్టిసద్గుణగరిష్ఠులును, మాతృభాషాభివర్ధనులును, నిరతసత్యవ్రతాచార పరాయణులును నగు శ్రీవారికి కరుణాసముద్రుడగు పరమేశ్వరుడు శాశ్వతాయురారోగ్య భోగభాగ్యములఁ బ్రసాదించుఁగాత.

ఇట్లు
ఇక్కుర్తి తిరుపతిరాయుడు
(బాలకవి.)

(శ్రీచార్ మహాల్ సంస్థానము, 1 చిన్నకోట పరగణా 2 గుడివాడ పరగణా 3 కల్దిండిపరగణా 4 జల్లిపరగణా (కృష్ణాజిల్లా బా5 జిల్లీ)

కమదనమువారి ప్రభుత్వము)

శ్రీరాజా కమదన కోధవాద్రిరాయణము గారు వీరు సంపూర్ణ ప్రభుత్వాధికారులు.

కాయమ్మ గారు — సీతమ్మ గారు

శ్రీతాపయ్యాగ్ర రాయణము గారు వీరును జాతిపరకు ప్రభుత్వము జేసినవారలే

పిచ్చమ్మ గారు

శ్రీజగన్నాధ రాయణము గారు

శ్రీనరసింహ రాయణము గారు

శ్రీబుచ్చిపాపా రాయణము గారు

శ్రీలక్ష్మీ రాయణము గారు

శ్రీరాయన్నా రాయణము గారు

శ్రీవెంకట రామా రాయణము గారు

శ్రీరామా రాయణము గారు

సూరమ్మ గారు

శ్రీపద్మనాభ వెంకటనరసింహా రావు గారు

చల్లయ్యమ్మ గారు

సుబ్బయ్యమ్మ గారు

శ్రీవెంకటపానుమంగజగన్నాధ రావు గారు

సీతయ్యమ్మా రావు గారు

శ్రీకోధవాద్రి రావు గారు

రంగనాయకమ్మ గారు

మధదిమ్మ గారు

చల్లయ్యమ్మా రావు గారు

వేదవల్లి తాయారమ్మ గారు

శ్రీవెంకటరామా రావు గారు

చిన్నయ్యమ్మా రావు గారు

శ్రీపార్థసారధి రావు గారు

చల్లయ్యమ్మా రావు గారు

రామాయమ్మా రావు గారు

తాయారమ్మ గారు

వైదిక్ష్మిపరిణయగ్రంధకర్త శ్రీవెంకట రావు గారు

గోపయ్యమ్మా రావు గారు

శ్రీసత్యనారాయణ రావు గారు

చల్లయ్యమ్మా రావు గారు

రామాయమ్మా రావు గారు

పీఠిక.

సోదరులారా !

ఉభయభాషాకోవిదులగు బుధశ్రోత్తములకు నాయీగ్రంథ మొకవేళ నంతగా రుచింపకపోయినఁబోవునేమో యను సంశయమే నెలకొంగియుండియు శ్రీకృష్ణునికథాసుధారసముఁ గ్రోలుటకన్న మోక్షప్రాప్తికి సులభమగు వేఱొకయుత్తమమార్గము లేదని నేతద్గ్రంథరచనా రూపమునైన శ్రీరమాకాంతుని సహస్రనామోచ్చారణముగా వింపవచ్చునని కౌతూహలముచేతను నిక్కాలమునఁ బోషణభూషణాలంకారములు లేక కడుఁ బేదరాలై దీనవదనముతో దిగులొందియున్న యాంధ్రభాషామతల్లినిఁ దమతమ విద్యాధనంబుల వెచ్చించి సత్కరించుట కవికుల సాంప్రదాయకమగుటచేతను మహాపురుషుల వాగమృతధారలచే జాతిభేదంబులకును మతవైషమ్యములకును విద్యావివాదంబులకును దావులేక సకల సౌభ్రాతృప్రేమ భారతావనిని బొంగి పొరలుచుండుటచేఁ బాఠకమహాశయులు ప్రథమప్రయత్నమగు నాయీగ్రంథములో నేవేని స్వల్పదోషంబులు గాన్పించిన నవి రచ్చకీడ్చి విపరీతవ్యాఖ్యానములు గావింపక సోదరభావముతో నాకెఱింగించెదరను నమ్మికచేతను నాకవితాసమర్థత నెనఁదలపోయక యీగ్రంథరచనకుఁ బూనుకొని యెట్లో ముగించితిని.

మ. వరజంధ్యాలసువంశసంభవుఁడు సద్వ్యాపారశీలుండు దు
స్తరధీసాధ్య శతావధానరచనా సామ్రాజ్యలోలుండు భా
సురమాధుర్యరసప్రబంధ కవితా శోభాయమానుండు శ్రీ
వరుఁ డుర్వీ సత్కవిపూజ్యుఁడై యెసఁగు సుబ్రహ్మణ్యధీమంతుఁ డుర్వి

సీ. ఉభయభాషాధిక విభవాభిరాముఁడై
పండితుండను పేర బరగునెవఁడు.
శతవధానవిధాన సామ్రాజ్యలోలుఁడై
కుకవిసంఘంబులఁ గూల్చునెవఁడు
బంధప్రబంధాది బహువిధకవితల
రచియింపఁగల కవి రాజెవండు
కన్నబిడ్డలకన్నఁ గడుఁ బ్రేమతో శిష్య
సంతతిఁ బ్రోచిన సరసుఁడెవఁడు

అట్టిమంచివిద్వాంసుండు ననఘుఁడైన
భమిడిపాటి వరాన్వయ పావనుండు
ఘనుఁడు నయ్యప్పశాస్త్రియౌ కవివరుండు
విద్యఁగఱపిన దేశిక విబుధవరులు,

మహనీయులగు నీగురుద్వయములో నాయెడలఁ గల శిష్య వాత్సల్యముచే నాగ్రంథమంతయు సావధానముగఁ బరికించిన మదీయ శ్రేయోభిలాషియగు బ్రహ్మశ్రీ విద్వాన్ భమిడిపాటి అయ్యప్పశాస్త్రి శతావధానిగారికెంతయుఁ గృతజ్ఞుఁడను. శ్రీయాంధ్ర ప్రబోధినీ గ్రంథనిలయమును స్థాపించి మహాకవి విరచితములగు సద్గ్రంథముల నింక నెన్నియో ప్రచురింపఁదలఁచిన భాషాసేవకుఁడగు శ్రీ అద్దేపల్లి సత్యనారాయణునకు మనకథానాయకుఁడగు శ్రీకృష్ణభగవానుని కృపావిశేషమున సంపూర్ణాయురారోగ్యైశ్వర్యములు గలిగి యతనివంశమాచంద్ర తారార్కముగ వర్ధిలుఁగాత.

ఇట్లు
బుధజనవిధేయుఁడు
శ్రీ. రాజా. కమదన వేంకటరావు
బహద్దూర్ జమీందారు

1-8-24
గురజ

విజ్ఞప్తి

పాఠకమహాశయులారా!

ఆంధ్రప్రబోధినీగ్రంథనిలయమునకు ద్వితీయభూషణముగ నీచిన్నపొత్తము నలంకరించి తమకందఁజేసికొంటిమి. ఇతరగ్రంథములను కొన్నిటి నిప్పుడే ప్రకటింపవలసిన యవసరము తటస్థమగుట వలన నీగ్రంథము సకాలమునఁ బ్రకటించి తమకందఁజేయఁ జాలనందుకు సుహృదయులగు తాము మన్నింతురని నమ్మెదము.

నాటకములు, నవలలు, ప్రబంధములు క్రమముగఁ బ్రకటించుట విధియైయున్నను, కారణాంతరములచే నీసారియు నాటకమునే ప్రకటింపవలసివచ్చినది. అయినను మాగ్రంథ నిలయమున కనుబంధముగా "చంపకమాలినీపరిణయము" అనునొక చిన్నప్రబంధమును బ్రకటించి సాధ్యమైనంతవఱకు మాకొఱంతను దీర్చుకొంటిమి. మున్ముందింక నత్యద్భుతములగు నవలలు ప్రబంధములు మొదలగునుద్గ్రంథములు సకాలమందు ప్రకటించి తమకందఁజేయుచుందుము.

ఇకమీఁద మాగ్రంథనిలయమునకు శ్రీ విద్వాన్ భమిడిపాటి ఆయ్యప్పశాస్త్రి శతావధానిగారు సంపాదకులుగ నుండుటకు దయతో నంగీకరించినందున సర్వవిధముల నింక శోభస్కరముగనుండునని తలంచెదము.

కొన్ని అమూల్యగ్రంథములే కాలమున రచింపఁబడినవియు నెవరిచే రచింపఁబడినదియు నింతవఱకును దెలియకుండుటవలన నింతటినుంచి మాప్రకటితగ్రంథములందు కవి జీవితములను క్లుప్తముగ వ్రాయనెంచితిమి.

ఇట్లు
ప్రకాశకులు.

పండితాభిప్రాయములు

కింకవీంద్రఘటాపంచానన బిరుదాంకితులలో నొకరును. దిగ్విజయ శతావధానులును అగు మ॥ రా॥ శ్రీ చెళ్లపిళ్ల వేంకటశాస్త్రి గారు.

వైదర్భీపరిణయము

అనుసీదృశ్యప్రబంధమును నేను స్థాలీపులాక న్యాయమున వింటిని. అనేక విధముల రమణీయముగానున్నది. గ్రంథకర్త గారికింకను నిట్టిగ్రంథములు రచించుపూనిక నొసఁగ భగవంతుఁడా యురారోగ్యైశ్వర్యప్రదాతయగుఁగాక.

చెళ్లపిళ్ల, వేంకటశాస్త్రి. శతావధాని.

గీతమాలిక.

భావగర్భిత కవితాప్రపంచమందు
సరసనాటకనూత్న వసంతమందు
సాంఘికోద్యానమాకందశాఖలందుఁ
బదములను లేఁజివుళ్ళ జొంపములు మెక్కి
చెవులకింపుఘటించుమచ్చికపుఁబిల్ల
కోయిలలతీయనౌముద్దుకూఁతలట్టు
లస్ఫుటావ్యక్త మధురసాయత్తగరిమ
సర్వజనతాభిహృద్యమౌ సరణినవ్య
కవితలంగూర్చునేర్పు గౌరవముఁ బెంపఁ
గమదనాన్వయవార్ధిరాకావిధుండు
రమ్యగుణహారి వేంకటరాయసూరి
విరచితంబయి వైదర్భిపరిణయాఖ్యఁ
దనరురూపకమాచంద్రతారకముగ
వెలయుఁగావుత శ్రీకృష్ణువిపులకరుణ.

గుడివాడ.
16-11-23.

ఇట్లు.
బ్రహ్మభట్ల పట్టాభిరామశర్మ.

వైదర్భీ పరిణయమును సాంగముగ చదివితిని. తొంటిసాంస్కృతికకవులు తమ యనర్గళ పాండితీ పటిమ సర్వస్వంబుగా నాటకము రచించినట్లు కన్పట్టెడిని.

ఆంధ్రకవులలో నన్నయార్యుని దొట్టి చిరకాలము ఆంధ్రనాటకనిర్మాణమునకు దొరకొనరైరి. ఆంధ్రనాటకరచన అనువాదముతో ప్రారంభమైనది. కావుటం జేసి ఆంధ్రనాటకలక్షణ మిదమిద్ధమని నిర్ణయింపఁజాలము. కాని సంస్కృతాంధ్రముల కవినాభావసంబంధమగుట దెనుఁగునంగూడ నాలక్షణమనుకరణీయము. దానం జేసియే ఆంధ్రనాటకకర్తలాయాయాలక్షణముల నవలంబించిరి. కాని కవిత్వారంభములోనే మన యాంధ్రులు నాటకరచనకు దొరకొను సాంప్రదాయమును నీకవియనుల్లంఘనీయముగ నేఁచె.

ఈవైదర్భీపరిణయనాటకగ్రంథకర్త పద్మనాయకకుటుంబములోనివారు తొల్లియొకప్పుడు వీరి పూర్వులు మాప్రాంతమంతయుఁ బరిపాలించిరి.

ఈనాటకమున రంగస్థల నిర్మాణమును గాంచ, కవి నూతనాశయములు గలట్టిడని కన్పట్టెడి శైలి నాతికఠినమై దీర్ఘసమాసవర్జితమై వైదర్భీరీతిని వేనోళ్ళఁజాటుచున్నది.

వైదర్భీపరిణయము వైదర్భీరీతిని వ్రాయఁబడుటయు నాటకము యొక్క గొప్ప చెప్పకయ చెప్పెడిని.

స్వైరవిహారధీరులగు ప్రభువంశీకుల కరంబువట్టి ఆంధ్రభాషావధూటి సర్వలక్షణ సమన్వితయగుటకు సందియము లేదు.

అంగలూరు
28-11-1923

నందగిరి వేంకటప్పారావు.
ప్రబంధకవిపంచానన.

ఇందలిపాత్రలు

పురుషులు

శ్రీకృష్ణుఁడు	అం 3 4 5
బలరాముఁడు	3 5
సాత్యకి	3 5
కృతవర్మ	3 4
అక్రూరుఁడు	3
కౌశికుఁడు	3 4 5
వసుదేవుఁడు	5
భీష్ముఁడు	1 5
రుక్మి	1 4
విజయశర్మ	1
అహోబలపండితుఁడు	2

స్త్రీలు.

రుక్మిణి	అం 2 4
సుగుణమతి	1 5
హేమలత	2 4
మంజువాణి	[illegible] 4
భారతి	4
దేవకీదేవి	5
శచీదేవి	5

ఇంకను సందర్భానుసారముగ ఇంద్రుఁడు, బ్రహ్మ, అష్టదిక్పాలకులు, మాగధులు, బ్రాహ్మణులు. మొదలగువారు వత్తురు.

శ్రీ మత్పరదేవతాయైనమః

వైదర్భీపరిణయము.

నాంది.

మ. సకలోర్వీతలనాయకుల్ చెదర స్వేచ్ఛావృత్తి మైఁబూని మ
త్తకరీంద్రప్రతిభాతిరేకజిత సిస్తుంద్రప్రతాపాఢ్యులౌ
మెకిమీడుల్ మఱికొందఱడ్డుజనఁగా నేకాసతం ద్రుంచి భీ
ష్మకకన్యం గయికొన్న కృష్ణుఁడిడుతన్ సౌభాగ్యముల్ మీకిలన్

మ. యదువంశంబున జన్మమంది రిపులోకానీక మల్లాడ స
మ్మదమొప్పన్ రణకేళిసల్పి జయమున్ప్రాణ్ణేందు బింబాస్యతో
మదిరంజిల్లగఁ సర్వసౌఖ్యములు సన్మానంబుతోఁ గొన్న యా
యదువంశాగ్రణి కృష్ణుఁడీవుత నశేషైశ్వర్యముల్ మాకిలన్.

(నాంద్యంతమున సూత్రధారుఁడు ప్రవేశించి.)

సూ——సఖీ! యేలయింత యాలసించితివి? నీయొడలిసింగారమింకను ముగియనేలేదా?

స——(ప్రవేశించి) ఆర్యపుత్రా! యిదేవచ్చితి. నేఁడు భూషణములు ధరించుకొనుట యించుకాలస్యమైనది. క్షమింపుఁడు.

సూ——సహజసౌందర్యశ్రీగల నీకోటి బోటికింక వేఱొక భూషణాలంకారము కూడఁ గావలయునా?

న—సహజ సౌందర్యోపేతలగు నింతులకే కాక యెట్టి కురూపాంగనలకైన భూషణపోషణాలంకారములు మఱియొక వన్నెఁ దెచ్చుననెడి యార్యోక్తి తమకెఱుంగని విషయమా?

సూ—చెలీ! యీ యప్రస్తుత ప్రశంసకేమిగాని సకల జనాహ్లాద కరమగు వసంతమును గూర్చి నీమృదుమధురస్వరంబుతో నొక్క గీతమును బాడినాటక సందర్శనాయత్తచిత్తులగు నీసభాసదుల నానందింపఁజేయుము.

న—చిత్తము.

సీ. ఆమ్రఫలాదిర సాస్వాదనాదృతిఁ
జిలుకలుముద్దుగాఁ బలుకఁ దొడఁగె
కిసలయఖాదనవ్యసన సంప్రాప్తములై
కోయిలల్ హాయిగాఁ గూయఁదొడఁగె
వికసితనవపుష్ప మకరందమునుగ్రోలి
షట్పదాళిరవంబు సలుపఁదొడఁగెఁ
బరిపక్వఫలములఁ బరిపూర్ణముగ మెక్కి
శారికల్ నినదంబు జరుపఁదొడఁగెఁ

గీ. బుష్పసంతతులెల్లను బూసిమించెఁ
బిల్ల తెమ్మెరలెల్లెడ వీవసాగె
మీనకేతునికృత్యముల్ మీరమీఱె
నఖిలసౌఖ్యంబులిడు వసంతాగమమున.

సూ—కడుఁజక్కఁగావర్ణించి నీసామర్థ్యమును జూపినందున వేఱొకటి వినఁగుతూహలమగుచున్నది; కాని నాటకసందర్శనాభిలాషులగు నీసభాసదులు కాలాతీతమున కోర్వరని విరమింపవలసివచ్చె.

న—అయ్యో! నేడు ప్రదర్శింపఁబోవు నాటకమెద్దియో వచియింపకయే పాత్రలనాయత్త పఱచిన నదియెట్లు కొనసాగఁగలదు.

సూ—ఆహాహా! యెంతచక్కఁగా నాలోచించితివి. పురాణప్రసిద్ధంబును. నీతిదాయకంబు నైన వైదర్భీపరిణయమని వేఱుగఁ జెప్పవలయునా? ఇంచుక నాంది నొకసారి స్మరింపుము.

న—(ఇంచుక స్మృతి నభినయించి) ఔనౌను. వైదర్భీపరిణయమే నేఁడు ప్రదర్శించుటకుఁ జాలననుకూలముగా నున్నది. నేనేగి యిప్పుడే పాత్రల నాయత్తపఱచెదఁగాని వేఱొకటి యడుగ మఱచితి.

సూ—ఏమది?

న—ఈనాటకకర్త లెవరు?

సూ—శ్రీరాజా కమదన వేంకటరావు బహద్దరు జమీందారువారు.

న—మనోహరా! గ్రంథకర్త నామంబు వచించి నన్నానందింపఁజేసితిరి; అట్లైన నితని కవితాసామర్థ్యమెటులున్నను మన ప్రదర్శనాసామర్థ్యముచే నీనాటకమున కెట్టి లోపములేకుండఁ జేయవలయును.

సూ—చెలీ! ఈప్రసంగముచే మనము ప్రస్తుతాంశమును మఱచితిమి. అదుగో, భీష్మక మహారాజుగారు రుక్మిణీ కళ్యాణమును గూర్చి మంత్రులతో నాలోచించుటకు సభామంటపమున కరుదెంచుచున్నారు. అవిగో, వందిమాగధులస్తోత్రపాఠకధ్వానములు వినవచ్చుచున్నవి. మనమిచ్చోటఁ దడయరాదు. నిష్క్రమింతము రమ్ము.

(నిష్క్రమింతురు.)

ఇది ప్రస్తావన.

వైదర్భీ పరిణయము

ప్రథమాంకము.

(భీష్మకుఁడు రుక్మి విజయశర్మ సుగుణమతి ప్రవేశము)

భీ—విజయశర్మా! మనరుక్మిణి రూపరేఖాలావణ్యాదులను విని యెందఱెందఱో రాజకుమారులు తమతమ చిత్రపటములతోఁ దమతమ చరిత్రములఁగూడ నాయొద్దకుఁ బంపుచున్నారు. ఇందు నీ యభిప్రాయ మేమి?

వి—దేవా! ఇందు నాయభిప్రాయ మేమున్నది? దేవరవారి యాజ్ఞ నతిక్రమించి యిందువర్తించు వారెవరు?

భీ—విద్యాబుద్ధులొకరి సొమ్ములు కావు. అందునను వైవాహికాధికార్యముల సంబంధించిన సమస్యలఁ బరిష్కరించునప్పుడు పూర్తిగా నాలోచింపవలసియే యుండును.

వి—గీ. తామువచియించు వాక్యముల్ తథ్యమయ్య
కష్టసుఖములు సంతతి కలిమియశము
నుండు ననుకూలదాంపత్యమున్నచోట
లేనిచోటనునుండునా? లేశమైన.

భీ—ఇప్పుడే యనన్యసామాన్యలావణ్యరాశియగు మన రుక్మిణికిఁ దగినవరుని నొక్కని నీచిత్రపటముల నవలోకించి వచియింపుము.

వి—చిత్తము. (చిత్రపటములఁ బుచ్చుకొని దీర్ఘాలోచనఁ జేయుచు) దేవా!

గీ. కులముతక్కువ మణులొకకోటియేల?
జాతిగల వజ్రమొక్కటి చాలదొక్కొ?
యనెడులోకోక్తిఁ బట్టి నా మనవియొకటి
చిత్తగింపుము వీరిలో శ్రేష్ఠుఁ డెవరు?

సు—అదేమి విజయశర్మా! అఖండసామ్రాజ్య వైభవోపేతులగు నీరాకొమరుల పటములంబట్టి యిట్లనెదవు?

వి—అమ్మా! యీ రాజకుమారుల బలపరాక్రమాదులు నేనెఱుంగనివి కావు.

సు—అట్లైన వీర లెవ్వ రెవ్వరో, వీరిగుణాగుణము లెట్టివో మాకు వేఱువేఱుగా నిరూపించి వచియింపుము.

వి—చిత్తగింపుఁడు.

సీ. శంకరు నర్చింప సతతంబు నరహత్య
సల్పుచుండెడి జరాసంధుఁ డొకఁడు
గురుజనంబుల మాట నిరసించి ధర్మంబుఁ
బాటిసేయని శిశుపాలుఁ డొకఁడు
మత్తుపదార్థముల్ సత్తుగాఁ గ్రోలెడు
సత్పథశూన్యుఁ డౌ సాల్వుఁ డొకఁడు
పరులకాంతల మాతృభావంబు విడనాడి
వేఱుగాఁ జూచు కుంభీలుఁ డొకఁడు.

గీ. ఊరుపేరును లేని యిస్సారులైన
యొండదెండలో రాజులీ యిందువదన
కరముఁ బట్టఁగ మితిలేని కాంక్షతోడఁ
బంపియున్నార లీ చిత్రపటములమ్మ.

భీ— విజయశర్మా! లెస్సగావచించితివి "జగమెఱిఁగిన బ్రాహ్మణునకు జందెమేటి" కన్నట్లు లీరాజన్యుల చరిత్రములు మనమెఱుంగనివి కావు.

సు— నాథా! అదేమి తామిల్లనారి నిట్లు నిరసించి పలికిన మనకనుకూల బాంధవ్య మెచటలభ్యమగును?

వి— అమ్మా! కాకేమి? నామనవి యొకటి చిత్తగింపుము.

మ. వరధీరుండయి, సద్బలాఢ్యుఁడయి, విద్వత్పోషకుండై, రమా
వరుఁడై, సంగరశూరుఁడై, రిపుజనప్రాగల్భ్యసంహారుఁడై,
కరమొప్పారుచుఁ బాండునందనులకుం గళ్యాణసంధాయియై
పరగన్ జాలెడు దేవకీసుతునితో బాంధవ్యముం జెల్లదే.

ఇదియునుం గాక.

గీ. ఆదిలక్ష్మియె రుక్మిణి యనఁగ వినమొ?
విష్ణువే యల్ల గోపాలకృష్ణుఁడనఁగ
వినమొ? వారల దాంపత్యమునకు నింక
సందియంబేల నుడువుమో సార్వభౌమ!

భీ—

గీ. సంశయం బేటికి విజయశర్మనాకు
వాసుదేవుని కన్న నీ వసుధయందు
మేటి వీరుండు ధీరుండు కోటి కొకఁడు
గానవచ్చునె? వెదకినఁ గల్లగాదె?

అమ్మహాత్మునికన్న నింకమనకు ముఖ్యులెవరు? అదియునుం గాక నేనును.

ఉ. మున్నొకసారివింటి మునిముఖ్యుఁడు నారదమౌనిచేత లో
కోన్నతిఁ జేయ శ్రీహరియె యుద్భవమందినవాఁడు ద్వారకన్
జెన్నలలార కృష్ణుఁడన శ్రీసతిరుక్మిణి నామ మందియు
త్యున్నత కుండినావనికి నుత్తమకీర్తి ఘటించు వృత్తిచేన్.

వి—ఆమాట వాస్తవము వారిరువురు పురాణదంపతులు జగత్ప్రసిద్ధులు లోకకళ్యాణకరులు దుష్టులఁనునుమాడి శిష్టులఁగాపాడఁ బెక్కుయుగంబులఁ బెక్కవతారంబులు దాల్చి భూభారమును బాపుటయే కాక యిప్పుడీద్వాపరయుగంబునఁగూడ రుక్మిణీ శ్రీకృష్ణ రూపంబులఁ గ్రమంబుగఁ గుండిన ద్వారకాపురమ్ముల జన్మించిరి.

సు—విజయశర్మా! బుద్ధియందున బృహస్పతి యంతవాఁడవని యిదివఱకు నీకున్న గౌరవము సార్థకమగునట్లుగా నావాసుదేవుని నామమంత్రము మాచేజపియింపఁజేసి మమ్ము ధన్యులఁజేసితివి.

భీ—దేవీ! ఆనందనందనుఁ డల్లుఁడగుటకన్న మనకు వేఱొక భాగ్యమేమున్నది ?

సు—నాథా! గోపాలదేవుఁడల్లుఁడే యయిన మనమిహపరంబులనెనలేని కళ్యాణపరంపరలనొంది తీరుదుము. కాన వేగమే రుక్మిణీ శ్రీకృష్ణుల కళ్యాణమును గుఱించి యాలోచింపవలెను.

భీ—ఎట్టికార్యమైన "ఆలస్యాదమృతంవిషం" బనునట్లు లేకజాగు చేయఁదగదు విజయశర్మా! శ్రీకృష్ణుని యొద్దకుఁ గళ్యాణ నిశ్చయమునకుఁగాను మనపురోహితుఁడైన జోగిశాస్త్రిగారిని ద్వారకాపురమ్మునకుఁ బంపి నివీఁకఁ దత్ప్రయత్నమున నుందుము.

వి—చిత్తము.

సు—నాయనా! మీచెల్లెలి వివాహమును గుఱించి మేమింతదనుక మాట్లాడుచుండఁగా నాకార్యముగాదన్నట్లు నీవట్లేయూరకుంటివేమి?

రు—(కోపముతో) అమ్మా! మీరును అపరబృహస్పతియని ప్రఖ్యాతిఁగాంచిన మనవిజయశర్మయును నాలోచించినది చాలదా?

సు—అదే మట్లనెదవు? నీయభిప్రాయ మేమో వచింపుము?

రు—అమ్మా!

శా. మాన్యుండంచును నీచునొక్కనికి సన్మానంబుతో మీరలీ
కన్యారత్నము నీయనెంచి జనలోకంబందు విఖ్యాతిచే
మాన్యత్వంబును జెంది పూజ్యమగు నస్మద్వంశమున్ గంగపా
ల న్యాయంబుగ నేల చేసెదరు? కార్యాకార్యము లూన్పడమిన్

వి—యువరాజా! సాక్షాద్విష్ణుస్వరూపుఁడగు వాసుదేవుని నీచుఁడని నిందసేయఁదగునా?

రు—విజయశర్మా!

మ. కులమా? గోత్రమ? రాజ్యమా? పరువ? మాకున్ వానికిన్ సాటియా
తలపన్ వియ్యము, చెల్మి, కయ్యములనందున్ సాటికిన్ సాటివా
రలె యుందంబుగ నుండ్రుగాని మఱి మర్యాదాప్రహూన్యైకనీ
చులంగోఁ జేసిననేరు శోభయగునాత్మున్ బ్రశంసింతురే?

సు—పుత్రా! ఏమినీకీవెఱ్ఱి? భక్తజనమందారమగు నందనందనుని కులగోత్రములు లేనివాఁడవనియును నీచుఁడనియును నిందించుచుంటివి ఇట్లామహాత్ముని నిందించువారలిహపరలోకంబుల రెంటియందును వెలిగాకపోరు.

ఆ. వె. విష్ణుదేవుఁడంచు వినియుండి కృష్ణునిం
దాపసాళివల్ల దనయనీవు

మోసపోయెదల? మూర్ఖునిచందాన
మానుమాను మిట్టి మాటలింక.

అమ్మా!

ఆ. వె. గొల్లపిల్లఁడన్న గోడెఱుంగఁగ లేక
విష్ణుదేవుఁడంగు వెఱ్ఱిమునులు
నమ్మినారుగాని నావంటివారెట్లు
నమ్మఁగలరొ? నిజమునాకుఁ జెపుమ.

వి.—యువరాజా! గోపాలదేవుఁడెవ్వరైనను నీజననీజనకులు రుక్మిణి నతనికేయిచ్చి పరిణయమొనరింప నిశ్చయించియుండ నీవేల దానికిమధ్యనంతరాయములఁ గల్పించెదవు అయిన నీవంటి విద్యానిధి జననీజనకుల యాజ్ఞనుల్లంఘింపరాదు.

రు.—ఏమేమీ! తరతరములనుండి మావంశమువారార్జించిన యశోధనమంతయు జననీజనకు లొకవేళ నధోగతిపాలై నట్టేటఁ గలుపుచుండ నావంటివాఁ డుహితాహితములఁ జెప్పుటనీకది యొకగొప్ప తప్పుగాఁ దోఁచుచున్నదా?

ఉ. చాలునుజాలు లెమ్ము బుధసత్తము లెల్లరు విన్నభీష్మభూ
పాలునినవ్విపోరె? సరివారలు మెత్తురె? యొక్క వెఱ్ఱి గో
పాలునకిచ్చెఁ గన్యనని భావ్యముకాదిది తప్ప కేను భూ
పాలుఁడుఁ బూజ్యుఁడైన శిశుపాలునకిచ్చెద మత్సహోదరిఁ.

వి.—యువరాజా! మేమెల్లరమెంత చెప్పినను వినక "నక్కయెక్కడ దేవలోకమెక్కడ" యన్నట్లు సర్వలోకారాధ్యుఁడైన వాసుదేవుని నిందించుచు శిశుపాలునకు నాసహోదరి నొసంగెదనని చెప్పుచుంటివి అయిన నీవింతదనుక నిందించుచున్న వాసుదేవుఁడెవరనుకొనుచుంటివి?

సీ. పాలుపారఁ బదునాల్గు భువనముల్ సేసిన
సృష్టికర్తనుగన్న శిష్టుఁడతఁడు
సుందరియై సురాసురులపోరును మాన్ప
నమృతంబుఁ బంచిన యనఘుఁడతఁడు
సప్తవార్థులనీరు తెప్మోతలంబునఁ బాగ
మఱ్ఱియాకుననున్న కుఱ్ఱఁడతఁడు
పదియవతారముల్ ముదము పెంపునఁ బూని
భూభారమణఁచిన పుణ్యుఁడతఁడు
గీ. భక్తజనములముంగొంగు పసిఁడియాతఁ
డబ్ధినాథుని ముద్దులయల్లుఁడతఁడు
ధన్యతమమగు వైకుంఠధాముఁడతఁడు
సమ్మదోపేతుఁడగు శేషశాయియతఁడు

రు—విజయశర్మా! ఏటికినీకింత కంఠశోష, వైకుంఠవాసియగు నాపద్మనాభుని నేనెఱుంగననియా? నీవెంతసమర్థించినను" గుక్కగుఱ్ఱము గునా, యన్నట్లు నీచకులోద్భవుండైన కృష్ణుఁడా భక్తవత్సలుండగు విష్ణువగునా?

ఉ. కాయలుఁజాపిపండ్లనుచు గన్నులుమూసిజనంబు నెల్లన
న్యాయముసేసియుమ్మ్కొను నంగడివాని విధాన నెంతయుఁ
మాయలమారి కృష్ణుఁడను మాటనుదాచినఁ గానియాతఁడా
తోయజనేత్రుఁడౌనె? యిఁకతొంబదిజన్మములెత్తెనేనియుఁ

సు—కుమారా! యేమినీయాగడము లంతకంతకునతిశయించుచున్నవి?

మ. తనయా! యేటికినింత వెఱ్ఱి? తగ నాధన్యాత్ముఁడా, ధీరుఁడా,
జననాథార్చితద్వారకానిలయుఁడా, శస్త్రాస్త్రసంవేదియా,

సనకాదుల్ నిరతంబుగొల్చుదొరయా, త్వన్మూర్తియౌ కృష్ణునిన్
ఘనమే? నీవిటుతిట్టిపోయఁగనులంగాపాడికొమ్మో తియున్

రు—అమ్మా! నీకింతకష్టమేల? ఇందు వాకనులను గాపాడుకొన వలసినంత యవసరమేమున్నది?

ఆ. వె. ఉన్నమాటయన్న నులుక్కుఁడనుమాట
వాస్తవమ్ముసుమ్ము వసుధయందు
తల్లి! దీనికింత తగవేల? కృష్ణుండు
మాధవుఁడను మాటమానుమమ్మ

గీ. కృష్ణుఁడే దైవమైనచోఁ బృథ్వియెల్ల
నేలఁజాలఁడొ? రాజయి, యేటికింత
యున్నదా? చెప్పుమొక్కింత యుర్వియున్న
మూఢుఁడై యేటికిటు లోకమూలనుండ

సు—ఆహాహా ఏమికుమారా! పతితపావనుఁడైన పద్మనాభునినోటికి వచ్చినట్లెల్ల దూఱుచుఁ బూజ్యమగు మనవంశమును గలుషీభూతముగాఁ జేయుచున్నావు. ఏదియెట్లున్నను నిరపరాధులను నిందించిన వాగుతప్పక తత్ఫలము చిరకాలమున ననుభవింపక పోరు.

రు—నాయనా! ఏటికీదమ కంతయాగ్రహము? వెఱ్ఱి గొల్లయగు గోపాలకృష్ణుని విష్ణువనిమీరెల్ల మోసపోవుచుండ, నేనట్లు కాదని చెప్పితినే కాని నేనిందుఁబరులను నిందించి మనవంశమున కపఖ్యాతిఁ గూర్చిన దేమున్నది?

వి—ఆ. వె. మాటిమాటికిట్టి మాటలాడెదవేల?
విష్ణుమూర్తి కాఁడె కృష్ణమూర్తి
యతఁడుగొల్లయైన ననఘులునుతియింతు
వర్తనంబుతోడ వరలునెక్కొ?

రు.—విజయశర్మా!

శా. పోనిమ్మంతటివాఁడమేల నతఁడే పుణ్యోత్తమజ్ఞాని యేఁ
హీనుండై యొక హీనగర్భమునఁ దానేరీతిజన్మించె భూ
జానుల్ లేరొ? ద్విజాతి లేదొ? వసుధన్ జన్మింప దానంతలోఁ
కానందంబుగ, నేటిమాటలివియయ్యా! చాలునీవాక్యముల్

ముఱికిగుడ్డలలో ముత్యాలసరమట్లు పరమదరిద్రుఁడగు దేవకీవసుదేవుల కుఁ బద్మనాభుండు జన్మించెఁగాబోలు ఇట్టి ముసలమ్మ మాటలను లౌకికజ్ఞాన శూన్యులై శుద్ధచ్ఛాంద సవృత్తితోఁ జరియించు వెఱ్ఱిము నులు వచియింప నీవంటి మతిలేని వారు నమ్మవలసినదే కాని నావంటి వాఁడు నమ్మఁజాలఁడు

భీ.—కుమారా!

శా. విద్యాబుద్ధులు లేనిమూఢునటు గోవిందుండు గొల్లంచుని
యాద్యంతంబులు లేని వాదమున మా కాయాసముం గూర్చుచి
యుద్యోగంబుఁ బరిత్యజించి యిఁక వంశోద్ధారకుల్ ద్రొక్కునా
పోద్యన్మార్గము సంజరింతువని నేఁబుత్రా! తలంతున్మదిన్

రు.—నాయనా! తామెంత యాగ్రహించినను నందనందనుం డు సర్వలోకారాధ్యుండగు నాచక్రహస్తుఁడనుటకు నేనొప్పుకొనను.

సీ. మాగధుచేఁబలునూరవమానంబు
నొందునా? యతఁడుగోవిందుఁడైన
నన్నదమ్ములలోన నసమాన కలహముల్
వెట్టునా? యతఁడు శ్రీవిష్ణువైనఁ
బరసతీ గమనంబు పాపహేతుకమంచు
నాఁగఁడా యతఁడంబుజాక్షుఁడైన
మేనత్తతోఁ బొందు మేలంచుఁదలఁచునా?
ద్విజరాజవాహనదేవుఁడైన

గీ. గారడీ వానివిధముగాఁ గరమునందుఁ
జక్రమొక దానిఁ బూనిభూచక్రమెల్లఁ
జక్రపాణిని నేనని చాటుచున్న
మాయకాఁడయ్య కృష్ణుండు మాన్యచరిత!

వి—యువరాజా! లీలామానుషవిగ్రహుఁడగు నా వాసుదేవుని లీలలల్పజ్ఞానచేతస్కులగు మనబోంట్లకవి యొకింత దుర్గ్రాహ్యములుగాఁ గనుపించినను, బరమతపోనిష్ఠాగరిష్ఠులగు తాపసోత్తములదెస నవి ముక్తిదాయకములై వరలుచుండును. వేయేల? యతని యాత్మశక్తిఁ గనుంగొన శతాశ్వమేధము లొనర్చిన పురుహూతాదులకేని శక్యముగాదు.

రు—విజయశర్మా! నీవెంత పక్షపాతమూనివచించిన నేనతనినొక గణనీయుఁడని భావింపను. ఆతడింత వఱ కేమంతఘనకార్యములొనర్చియీపొగడ్తలకు ధామమయ్యె?

వి—రాజకుమారా! నిర్వక్రపరాక్రమ పారీణుఁడగు నందనందనుఁ డొనర్చిన సాహసకార్యము లెన్నియో యున్నవి. వానినెల్లఁ గ్రమంబునవర్ణించుటకు ద్విసహస్రజిహ్వలుగల యాదిశేషునికైన నశక్యమైన నాకు దోచినంత వరకతని బాల్యదశలో నొనర్చిన కొన్ని మహాఘన కార్యములు వచింతు శ్రద్ధాళుఁడవైవినుము.

సీ. పాలిచ్చుసమయించు పనిఁగొని వచ్చిన
యసురకాంతమదంబు నణఁచలేదో
సుడిగాలి నెపమున వడిఁదన్నుఁగొనిపోవు
మాయ రక్కసు మచ్చుమాపలేదో
సద్దుసేయక యేగి మద్దులరెంటిని
వేల్పులను శ్రియింపఁ గూల్పలేదో
గోబృందమును గావఁగొనగోట గ్రక్కున
నెనలేని యొకకొండ నెత్తలేదో

గీ. భయదఫూత్కారభరిత సంభ్రమధురీణ
పన్నగాధీశు దుర్వారఫణములందుఁ
దత్తధిమియంచు సల్పఁడే? తాండవంబుఁ
గాన కృష్ణుండు సామాన్య మానవుం డె?

సీ. కాననంబులఁ గొల్చు గార్చిచ్చు కెరు రేగి
మిసిమిముద్దవిధాన మ్రింగ లేదొ?
మాయచేఁ గ్రేపయి మందలో దిరుగాడు
వత్సాసురునిఁ ద్రుంచి వరల లేదొ?
పటుదర్పమున నేగి బకరూపయుతుఁడగు
కుటిలరాక్షసుఁ బట్టి కూల్ప లేదొ?
కఠినాత్ముఁడైనట్టి కంసుని హింసించి
మాతాపితల చెఱ మాన్ప లేదొ?

గీ. ఘోరవీరారిగళరక్త ధారలనెసు
కుంభవృష్టినిఁ గురిపించి కువలయమున
వెల్లి బాఱ దురంబుఁ గావింప లేదొ?
కాన కృష్ణుండు సామాన్య మానవుం డె?

రు.—విజయశర్మా! చాలుఁ జాలు నీయుపన్యాస మింకఁ గట్టిపెట్టుము నిర్వక్రపరాక్రమపారీణుఁడనగు నామ్రోలఁ గల్లబొల్లి మాటలు వ్రాల్గుకల్పించి యతఁడొక యున్నతవిక్రముఁడనియు మహానుభావుఁడనియు గంభీరోపన్యాసముఁ జేయుచుంటివి. ఇట్టి వెడగుపల్కులనిప్పుడు చెప్పినఁ జెప్పితివి; కాని మఱియొక్కసారి మాత్రము రానియ్యఁబోకుము.

సీ. దావాగ్ని మ్రింగిన ధన్యాత్ముఁడే యైనఁ
గూరగొల్లలయిండ్లఁ బుట్టనేల?
దనుజులఁ ద్రుంచిన దర్పోన్నతుండైనఁ
గానన ఘనబసు ల్గాయనేల?

కొండనేయెత్తు నుద్దండబలుండైనఁ
బాలకైయుట్లకుఁ బ్రాకనేల?
మద్దులం గూల్చినఁ మగఁటిమి యేయున్న
నబలచేఁ ఱోటఁ గట్టఁబడ నేల?

గీ. క్రూరకర్ముండు కుటిలుండు జారచోరుఁ
డైనమాయావి శ్రీకృష్ణుఁడన్న నీకు
నున్న యభిమాన మొక యింత యున్నరీతి
నుంచవలెఁగాని యీరీతి నెంచదగునె?

తండ్రీ! నీయవివేకమునకు మేమెంతయని చెప్పుదుము "దారిపోవునాబ్దికమా మాగృహముదనుకవచ్చి పో" మ్మనువానివిధానఁ బరిపంథిరాజ ఘోర దుర్వారగర్వకాననదవానలుండగు శ్రీకృష్ణునితో నకారణవైరము నుఁదెచ్చిపెట్టుకొని యమ్మహాత్ముని యనివార్యశౌర్యజ్వాలకీలలకాహుతిరై మమ్మెల్ల నధోగతిపాలు సేసెదవు?

రు—అమ్మా! తామెల్ల రాకృష్ణుఁ డొక యహీనవిక్రమక్రమపారీణుండని నుతింపుచుండ నేను గాదన నేల? అతఁడంతటి మేటి యే యైన నట్టి వీరాధివీరునితో నావంటి యఖండకోదండపాండిత్య విద్యావిశారదుండగువాఁడు వియ్యమందుటకన్నఁ గయ్యమందిన నెంతశోభగా నుండును?

సు—కుమారా! నీవెంతకోదండైక పాండిత్య విద్యావిశారదుండవైనను నిష్కారణముగా నమ్మహాత్మునితో నేల కలహించి కయ్యమునకియ్యకొని యెదవు? అయినను శూలికైననుఁ దమ్మిచూలికైనను సైరింపశక్యముగాని యతని యనివార్య ఘోరచక్రాగ్నిజ్వాలల నీ వెట్లు సైరింతువు?

రు—అమ్మా! యతనితో నిష్కారణముగా నేలకలహింతువని నన్ను మందలింపుచుంటివిగదా! లోకాపకారులు నాకపకారులు లో

కోపకారులు నాకుపకారులు. గానం గృష్ణునియంత లోకాపకారి యీత్రిజగంబులం ద్రినేత్రంబులతో వెదకినను గానరాండు.

భీ—కుమారా! రానురాను నీవిద్యాబుద్ధులు నేటికీతీరునం బరిణమించినవా?

గీ. సకలభూభారమును బాపం జక్రపాణి
మానవాకారమునుదాల్చి మహినిబొడమె
ననుచుం బ్రాజ్ఞులుదలంతు రీవట్లుగాక
జగతికపకారియనువిధిం జాటుమయ్య.

కుమారా! నాయనగారుసెలవిచ్చినట్లు కృష్ణుడంతలోకాపకారి లేడని ప్రజలకు బోధింప నేటినుండి మొదలుపెట్టుము. అప్పుడు నీయుపన్యాసములు చాలసమంజసములుగా నున్నవని ప్రాజ్ఞలోకమెంతయు సంతసిల్లు.

రు—నిజమాడిననిష్ఠురముగాని వానిరంకుతనమును బొంకుమాటలునుగ్రూరకృత్యములును విచారించిననిక్కముగా నెవ్వనియందు గలవు. అట్టిమాయావి లోకాపకారిగాని లోకోపకారియెట్లగును? అట్టి లోకకంటకులతోం గయ్యమొనరించి సమయించి లోకములనుద్ధరింపవలయును గాని వియ్యమందందగునా?

సు—తండ్రీ!

ఉ. కయ్యముగయ్యమంచుం గొడుకా యిటులేటికిం గోరెదీవు నే
వెయ్యవచించిన న్వినక వెఱ్ఱివె? కన్నులువిచ్చిచూడు బా
బయ్యరో! నందనందనుని బాహుబలంబనివార్యమయ్య! మా
యయ్య! విరోధమూనం దగదా దనుజారిపయిం గుమారకా!

ఆ. వె. కన్నకడుపుగాన గంసారితోం బోరు
కూడదనుచునిన్నుం గూర్చిమిగులం
జెప్పుచున్నంగాని చెవిం బెట్టవదియేమి

చేతునింక నేను జెప్పుమయ్యా!

వి—యువరాజా! ఏదియెటులున్ననుఁ బూజనీయులగు నిజజనకుల యాజ్ఞనుల్లంఘింపరాదు

రు—విజయశర్మా! ఏటికింతగా నీవాదప్రతివాదములు. నా మనోనిశ్చయ మెఱుంగుము.

ఉ. ప్రాణము వోయినన్ గులము వాసిన రాజ్యము సర్వమూడి నేఁ
గానలకేగినన్ హితులుగాదని దూఱినఁ దమ్మిచూలియున్
స్థాణుఁడుఁ గూడివచ్చి పలుసారులు చెప్పిన మత్సహోదరిన్
హీనతనందనందనునకిత్తునె? గొంతునఁ బ్రాణముండఁగాన్

సు—అయ్యయ్యో! తండ్రీ! మామాటలెల్ల నిరాకరించినను మీ నాయనగారిమాటఁగూడ నతిక్రమింప నీకు ధర్మమా?

వి—అమ్మా! అధర్మములు కృతయుగ త్రేతాయుగములలోఁడనే నశించినవి. ఇప్పుడీ ద్వాపరమున నాధర్మము లెక్కడ?


భీ—దేవీ! ఏటికినీవంత దీనాలాపములాడెదవు? మనము చెప్పవలసినదంతయుఁ జెప్పితిమి. తరువాత యుక్తాయుక్తములాలోచించుకొను బాధ్యత యతనియందే గలదు. నాకిప్పటికే దేవీపూజవేళ యతిక్రమించినది. ఇఁక మనమిచ్చట నాలసింపరాదు. నిష్క్రమింతము రమ్మా!

సు—కుమారా! నాయీచిన్ని వాక్యమైన మన్నింపుము. సాటి రాకాలములో భీష్మకమహారాజుకూఁతురిజేతి యుంటఁబడి యున్నదనెడు నపఖ్యాతి యఖండ యశోవిరాజితులగు మీనాయనగారికి మాత్రము రానీయక కకుశీఘ్రకాలములోనే నీసోదరివివాహముంగూర్చి ప్రయత్నింపుము.

రు—అమ్మా! మీకంతసందియమేల? నేను మీతనయుఁడను గానా? మీకువచ్చినయపవాదము నాకువచ్చినట్లు కాదా? రుక్మిణి నా సోదరి కాదా? దానికష్టసుఖములు విచారింపవలసినబాధ్యత నాది కాదా? కాన సాధ్యమైనంతత్వరలోనే రుక్మిణీకళ్యాణమునుగుఱించి యాలోచించెదను.

(అందఱు నిష్క్రమింతురు)

ఇది ప్రథమాంకము.



వైదర్భీపరిణయము.

ద్వితీయాంకము.

కుండినపుర రాజవీధి.

(హేమలత మెల్లఁగా నడుచుచుఁ బ్రవేశించును.)

సీ. తల్లిదండ్రులుగల్గఁ దగుబాంధవులుగల్గఁ
 దనకేలయింత వృథాప్రయాస
మేనమామలుగల్గ మేనత్తలునుగల్గఁ
 దనకేలయింతవృథాప్రయాస
సచివాగ్రణులుగల్గ సజ్జనావళిగల్గ
 దనకేలయింతవృథాప్రయాస
సేవకాళియుఁగల్గ స్నేహితులునుగల్గఁ
 దనకేలయింతవృథాప్రయాస

గీ. తగుమనని సర్వకార్యముల్ దానెపూని
సంచరించుటెకాక యీసమయమందుఁ
గూడబెద్దగ రుక్మిణిగొంతుఁగోసి
శివశివా యేమిరుక్మి దుశ్చేష్టితములు.

అది యేమి? అయ్యయ్యో! విపరీతముగాదా? మనోవాక్కా-
యకర్మల గోపాలదేవుని వరించియున్న మాచెలి మోహాలతను దనకర

ములార ఖండించి యెవఁడో యొక రాక్షసాంశసంభూతుఁడగు రాజాధ మునకుఁ గట్టిపెట్టనెంచియున్న పుత్రిని మూఢత్వమును మరలింపలేక తాముగూడ నాయజ్ఞానాంధకారమునఁబడిపోవుచున్న రాజదంప తుల యవివేకమేమని చెప్పుకొనవలెను? పోనిమ్ము! ఆగతానాగతము లెఱింగిన విజయశర్మయైన నీవిషయమున యువరాజుగారికో నేలగట్టి గాఁ జెప్పఁగూడదు? అయ్యయ్యో! ఏమినా వెఱ్ఱి? చెప్పఁగూడదా య ని యూనింద నిష్కారణముగా వారిపై నే నేల వేయవలయును? చెప్పఁ దగినవారెల్లఁ జెప్పఁదగినంత యిదివఱకే చెప్పియుండలేదా? ఎంత చెప్పి నను ప్రజాపరిపాలనాసత్వసమోపేతుఁడగు యువరాజుగారు వీరిమా టల సరకుఁ జేసిరా? నే నెట్లీవిపత్తునుండి మా రాజపుత్రికను దప్పింపఁగ లను? అక్కడికి నా యోపినకొలఁది యూరడిలఁబలికి యిట్టిసమయమున బెద్దలయాజ్ఞనుల్లంఘింపరాదనియు శిశుపాలునే వరింపుమనియు నందనం దనునిపై హత్తియున్న నీమనసు మరలించుకొనుమనియు నేనెంత చెప్పిన ను వినక ఈజన్మనేకాదు ఇంక బదియాఱు జన్మములకేని నా దేవకీసుతు ని చెట్టపట్టి తీఱుదును; గాని దుర్మార్గుఁడగు శిశుపాలుని యుత్తమాంగ ముపై మదీయవామపాదకనిష్ఠికాంగుళమునైన మోపఁజాలనని ప్రతిజ్ఞఁ జేసి అన్నపానీయముల నైతమును గైకొనక కసుంగడుఁ గృశించిపోవు చున్నది. పాపమీమె నీవిపత్సముద్రమునుండి రక్షించువారెవరు? స కలభాషాపరిజ్ఞానురాలగు మంజువాణియు నీసమయమున నే దగ్గఱలేక పోవుటతటస్థమయ్యె. అయ్యో! ఏమినా వెఱ్ఱి? ఎవరున్న నేమి ప్రయోజ నము? విధివ్రాఁతఁ దప్పింపనెవరితరము? ఇంతకు నేదియెట్లున్నదో య ట్లు కాకపోదు అదిగో. యెవరో నన్ను బిలుచుచున్నట్లున్నది. (వెనుకకుఁది రిగిచూచును. మంజువాణి ప్రవేశించును;)

మం—ఏమే! హేమలతా! నేనెంతపిలుచుచున్నను దిరిగియైనఁ జూడక తదేకవిధముగాఁ దలవంచుకొని వెళ్ళుచుంటివి నీకీమధ్య బధిరత్వముకూడ సంభవించినదా యేమి?

హే—(కౌఁగిలించుకొని సంతోషముతో) అక్కా. నేను నీ వనుకోలేదు క్షమింపుము.

మం—క్షమాపణల కేమిగాని మన రాజపుత్రికకు క్షేమమే కదా!

హే—ఆహా; క్షేమమే? కాని, యీమధ్య నీవెచ్చటికి వెళ్లితివి? ఇంతకాల మెచ్చటనుంటివి?

మం—నాఁకు నీసమక్షముననే కదా! నాసోదరుని వివాహమనియు వెళ్లివచ్చెదననియు నమ్మగారిని సెలవడిగి వెళ్లినది.

హే—ఔనౌను. నాకేజ్ఞాపకము లేదు సంబంధమెచ్చటనే?

మం—హస్తినాపురము.

హే—హస్తినాపురమా? సరే వారెవరు?

మం—వారెవ్వరన, నచ్చటనున్న వారినెల్ల నీ వెఱుంగుదువఁటే నేనెవ్వరని చెప్పను?

హే—నేనెఱింగినను నెఱుంగకపోయినను ఫలానివారని చెప్పరాదఁటే?

మం—అట్లైన వినుము. యుధిష్ఠిర మహారాజుగారి ప్రియసేవకుఁడగు వసంతుని ద్వితీయపుత్రిక.

హే—ఆలాగా! వసంతుని ద్వితీయపుత్రికా? దానిని నేనెఱుంగ కేమి? అదిచాల గుణవంతురాలు.

మ—దీని కేమిగాని మనదివాణములోని విశేషములు చెప్పనైతివి.

హే—విశేషములకేమిగాని సమయమునకు నీవువచ్చుటయే గొప్ప విశేషము.

మం—ఏమేయట్లనెదవు? నేనురాకున్న నిచ్చట దిగబడున దేమున్నది?

హే—ఈమధ్య మనయమ్మాయిగారి వివాహమునుగూర్చిన సమస్య యొకటివచ్చినది.

మం—ఏమేమీ? మనయమ్మాయిగారి వివాహ మీసంవత్సరము జరుగునా? నేనువెళ్లినప్పుడా ప్రశంసయే లేదే? ఈమధ్య నదియెట్లువచ్చెను? సంబంధ మెచ్చట?

హే—ఏమే యెఱుంగనిదానివలె మాటాడెదవు?

మం—హేమలతా! అట్లనెద వేల? ఈమధ్య నేను గ్రామాంతరము వెళ్ళుటఁ బట్టి యిచ్చట జరుగుచున్న విశేషములు నాకెట్లు తెలియును?

హే—పోనిమ్ము మన రాజపుత్రి గోపాలదేవుని వరించియున్నదనెడి యంశమైన నెఱుంగుదువుగదా!

మం—ఏమో అది మాత్రము నాకెట్లు తెలియును? నేను వివాహమునకు వెళ్ళునాఁటి దినాంతసమయమున వన విహారమునకై యారామ సీమకేగియచ్చటఁగలనొకలతానికుంజాంతర్భాగమున మేమిద్దర మాసీనులమై యేవియో సమయోచితవాక్యము లాడుకొనుచున్న సమయమున నన్నుఁగాంచి యామె సవిచార భాషణముల మెల్లఁగా నిట్లనియె.

హే—ఏమని?

మం—చెలీ! మంజువాణీ! నీవు వివాహకార్యమునకై హస్తినాపురమునకరుగుచుంటివికదా! అచ్చట దొరకినచో గోపాలదేవుని చిత్రపటమొకదానిని. సంపాదించి తెచ్చెదవా?" అనియె.

హే—నీవప్పుడైనను నాయమ యుద్దేశము గ్రహింపలేక పోతివా?

మం—గ్రహింపలేకపోవు టేమి? యామెముఖ విలాసమునుబట్టియు వాక్య నిగుంభనమునుబట్టియు నాకప్పుడే యొకింత యనుమానము గలిగినది; కాని నాకున్న ప్రయాణావసరమునుబట్టి నేనప్పుడే యామె సంపూర్ణ మనోగతాభిప్రాయమును దెలిసికొన వీలుచిక్కినదికాదు.

హే—నీవామె మనోనిశ్చయమెఱింగినను నెఱుఁగకున్నను పోనిమ్మా చిత్రపటమునైనఁ దెచ్చితివా?

మం—ఆహా! వివాహమైన మరునటి దినమే మావారు కొందఱు మాకన్న ముందు వచ్చుచుండ వారిచేత నేనేయా చిత్రపటముం పించితిని.

హే—పోనిమ్మా చిత్రపటమును జూచికొనియైన మనరాజపుత్రి కొంత మనశ్శాంతి నొందును.

మం—ఏమే హేమలతా! నీభావగర్భితమైన వచోవిలాసమును జూడఁగా నాకేమియుఁ దెలియరాకున్నది. ఇంక నీవూరక యిట్టి సోదెమాటలతోఁ గాలయాపనము సేయక జరిగినదేమో వచియింపవే?

హే—ఏమున్నది! నీవరిగిన రెండవదినముననే మనయమ్మాయిగారి యుద్దేశానుగతముగా రాజదంపతులును విజయశర్మ మొదలుగాగల మంత్రివర్గము వారును తక్కుంగల రాజబంధువులును కొల్వుకూటమునఁ గూడి యదువంశసుధానిధియగు నాగోపాలకృష్ణున కేమన రాజపుత్రినీయవలయునని తీర్మానించుచుండ నింతలో యువరాజుగారు నడుమఁ జిచ్చుఱపిడుగువలె లేచి యాగోపాలదేవు ననరాని దుర్భాషలాడి

తనకంతమునఁ బ్రాణమున్నంతదనుక నట్లెన్నటికి జరుగుటకువీలు లేదనియుఁ దమప్రియస్నేహితుఁడగు శిశుపాలునకిచ్చునట్లు తీర్మానింపుమనియు నాసభవారినిగోరుచు గంభీరోపన్యాసముసేసె.

మం—అప్పుడేమైనది తక్కుంగలవారెల్ల రందులకామోదించిరా?

హే—విజయశర్మ మొదలగు కొందఱనుభవజ్ఞులు శిశుపాలనందనందన గుణాగుణములలోని తారతమ్యములను సయుక్తి సహేతుకముగా నచ్చునట్లెంత చెప్పినను వినక చివరకుఁ దనవాదమునే నిలువఁబెట్టి దానినెల్లరిచే నామోదింపఁజేసె.

మం—యుక్తాయుక్త పరిజ్ఞానములేని యువరాజుగారితీర్మానమును ద్విగుణీకృతబుద్ధిప్రాబల్యముగల విజయశర్మ మున్నగువారెట్లామోదింపఁ గలిగిరి.

హే—మంజువాణీ! నీవెఱుఁగనికొత్తదానివలె మాట్లాడెదవేమే? ఆతనిదుష్టత్వమునీవెఱుంగనిదియా? అతనికెదురాడి యిటనుండి బ్రతికి బయటఁబడఁజాలమని యెంచి చివరకు విధిలేకయొప్పికొనిరి.

మం—ఔనౌను. మొదటినుండియు యువరాజుగారి దుష్టత్వమట్టిదే.

హే—నిజము. ఆమాట మొదటనుండియు నతని దుర్నివార్యపరిపాలనా పారావారమున కట్టుకట్టలేక ప్రవహించుచుండుటచేతనే యిసుంకు మనరాజపుత్రికకు నింతచేటు మూడినది.

మం—ఏమే! మనరాజపుత్రికకు శిశుపాలుని కరగ్రహణమొనర్చుట కిష్టముగానున్నదా?

హే—ఇష్టమో? ఇష్టము కాదో! ముందామెజీవించినగదా! తరువాతిసంగతి.

మం—(సంభ్రమముతో) ఏమే! అమ్మాయిగారి కేమైన రుగ్ణ చేసినదా?

హే—వేఱేరుగ్ణత యేమున్నది? తానువలచిన ప్రియుని విడచి యన్యునివరింపుమని పెద్దలిచ్చిన యాజ్ఞయే పెద్దరుగ్ణత యగుటచే నామె నేటికి బదునైదు దినములనుండి యన్నపానముల విసర్జించి పట్టినగోపాల దేవుని జెట్టఁబట్టవలయు లేకున్న నన వ్రేలనున్న వజ్రపుటుంగరముతో విముక్తినొందవలయుంగాని శిశుపాలుని మాత్రము వరింపనని గట్టిపట్టు పట్టి యెంతేని గృశించిపోవుచున్నది.

మం—అయ్యయ్యో! ఎంతవిషమసమస్యవచ్చినది! దీని నివారణోపాయ మెట్లు? నాకీసంగతి నీవు మొదటనే చెప్పిన నీపాటికి దివాణము లోనికి వెళ్లి యుండెడిదాననేకదా.

హే—పోనిమ్మింక నాలస్యమెందుకు? నీవుసత్వరమరుగుము.

మం—నేను వెళ్లెదఁగాని నీవిప్పు డెచ్చటి కరుగుచుంటివి?

హే—నేనేగు కార్యము పరమగోప్యము. బహిరంగముగాఁ జెప్పఁగూడదు. దగ్గరకురమ్మా చెవిలోఁ జెప్పెద. (సమీపమునకువెళ్లి చెవిలోఁ జెప్పెను.)

మం—(విని) సరియే మంచిదియే కాని నీవుమాత్రము నాలసింపక సాధ్యమైనంత త్వరలోరమ్మా. నేనిదే దివాణములోనికి వెళ్లుచున్నదాన. (నిష్క్రమించును)

ఇదివిష్కంభము.

ద్వితీయాంకము.

రుక్మిణీ యంతఃపురము.

(కుసుమశయ్యపైఁ బరుండియున్న రుక్మిణి ప్రవేశము.)

రు—అయ్యయ్యో! ఏమి? తానుదలఁచిన దొకటియైన దైవ మింకొకటి దలఁచునను లోకోక్తి నేఁడు నాయం దేసార్థకమయ్యెనే? భువనైకమోహనాకారుఁడగు యదువంశసుధానిధిఁ జెట్టఁబట్టి భూలోకస్వర్గసుఖమనుభవించెదనను కొంటిని; గాని యింతలోనే యిట్టి కట్టిడిసేతలకుఁ బాల్పడుదునని కలలోనైనఁ దలంచియుండలేదు. కాని యిప్పు మానవప్రయత్నమునకు దైవముతోడ్పాటుకూడ నాకింతయున్న నది చరితార్థమగును; గాని లేకున్నచో నేస్వల్పకార్యమైన నెట్లుసాఫల్యముగాఁగలదు? ఇది యేమి? హేమలతమదీయగురువరేణ్యుఁడగు నహోబలపండితుని కొఱకై వెళ్లి యెంతసేపైనది? ఇంతదనుక రాకయుండుటకుఁ గతంబెయ్యది? అతఁడొకవేళ నెద్దియేని కార్యావసరముపై నెటకేని నేగియుండుటఁబట్టి నాచెలియింతయాలసించెనా? లేక ఇది మరియొక కార్యమును జక్కబెట్టుకొనుచుండెనా? కాకున్న నొకతెప్పపాటు కాలములో వచ్చెదనని వెళ్లి యింతదనుక రాకయుండుటకుఁ గారణం బేమి? నాకేమియుఁ దోఁచకున్నది. చూడంజూడ నేనూహించిన రెండు కార్యములంతసమంజసముగా లేవు. హేమలత తనప్రాణప్రాయ సమయమందైన మదీయకార్యోల్లంఘనముఁ గావించి తదీయకార్యనిర్వాహణోపాయముఁ జూచుకొనునని నేనుగలలోనైన నెంచుటకు వలనుపడదు. అట్లెన్నటికిని జరుగదు. అతఁడొకవేళ నింటియొద్ద లేకున్ననుసింతయాలసింపదు. అతఁడు గృహమువదలి యిప్పుడేవచ్చెద ననుటంబట్టి యేయింతయాలసించినది. పోనిమ్మెవరువచ్చి మాత్రమేమిచేయ గలరు? విధివ్రాలు దప్పింప నెవరితరము!

సీ. సకలసంపదఁ బాసి చంద్రమతీదేవి
 యడవులందిడుమలఁ గుడువ లేదె?
మోహనాకారుఁడౌ ముద్దుబిడ్డను బాసి
 సిలుగులు దమయంతి చెందలేదె?
పతిఁ బాసి భూపుత్రి పాపిష్ఠిలంకలోఁ
 బడరానికష్టముల్ పడయ లేదె?
స్వర్గసంపదఁ బాసి పౌలోమి పలుసార్లు
 మేరుగహ్వరముల మెలఁగ లేదె?
గీ. అంతటి త్రిలోకమాతలైనట్టివారె
 విధికివశులయి మెలఁగ భావింప లేదె?
 కాన నావంటి యొకరాజకన్య విధిని
 దాఁటి వర్తిల నెంచ వృథాప్రయాస.

ఇంక నే నెట్టిప్రయత్న మొనరించినను గలలోని సంపదవలె నిష్ప్రయోజనము కదా! అన్నా! రుక్మీ! నీవు సోదరునివలె జన్మించి నాకుఁ బ్రత్యక్ష క్రూరరాక్షసునివలె వర్తించితివి కానిమ్ము నీ వెట్లింక నీపంతము నెగ్గించుకొందువో చూచెదఁగాక.

శా॥ లోకానీకములెల్ల నేకమయినీలోఁ జేరియా కార్యముల్
 సాకల్యంబొనరింప నెంచిన నెటుల్ సాధించునో నన్ను మా
 రాకారుండు సహీనవిక్రమకళాభ్యాసాఢ్యుఁడైనట్టి శ్రీ
 లోకేశుండగు నందనందన కృపాలోలాక్షుఁడై యుండఁగాన్.

అయ్యయ్యో! ఏమి నాభ్రాంతి? ఆలోకేశుని కృపాకటాక్షవీక్షణము లేమేని నాపైని బ్రసరించియున్నచో నే నిట్టికష్టములపాలుగా నేల? నా కాయాస గగనకుసుమంబయ్యో? నింక నే నేమి సేతు? నెవ్వరిని బ్రార్థింతు? నెవరిని బ్రార్థించిన నేమి ప్రయోజనము? కన్న జననీజనకులకే నాపైఁ గరుణ లేనప్పుడిక బరులెవ్వరు రక్షింతురు?

ఆ॥ వె॥ తల్లిదండ్రులార! తనయునిమాటపైఁ
గన్నబిడ్డగొంతుఁ గరములారఁ
గోయఁబూనఁదగునె? కౌమరిత, కౌమరుఁడు
నొక్కపోల్కి కాదె? సిక్కమరయ.

ఉత్తమలోకసద్గతి ప్రాప్తి కాధారభూతులగు తనయులపైనున్న ప్రేమ జననీజనకులకు పుత్రికలపై నేలయుండును? ఇదియు ప్రపంచధర్మమే కదా! యింక నాకీ ధర్మములతో నేమిపని? తల్లిదండ్రులతో నేమిపని? ఈ వరకీప్రపంచముతో నేమిపని? నాకీజన్మమధ్యమున నాపద్మనేత్రుని పాదారవిందముల సేవించు భాగ్యము గల్గుటకల్ల. పెద్దలు నిశ్చయించిన వివాహ ముహూర్తమా కడుసమీపమయ్యె. నేనింక జీవించియున్న నెట్లయిన నాపాపాత్ముఁడగు శిశుపాలుని మోముచూడకతప్పదు. కాన నావ్రేలినున్న ముద్దుటుంగరములోని వజ్రముచే మదీయ కార్యసాఫల్యము గావించుకొని పరలోకముననైన నమ్మహాత్ముని పాదపద్మముల గొలిచి చరితార్థురాలనయ్యెద. (అనిశయ్యపైనుండి దిగ్గున లేచికూర్చుండి యంగుళీయకముదీసి కన్నులకద్దుకొని) ఓ నాప్రియమైన యంగుళీయకమా!

కం. చిన్నతనంబుననుండియు
నిన్నెడఁ బాయకయె నేను నిరుపమవాంఛన్
మన్నించుచున్న నాకీ
బన్నం బెడఁబాపుమనుచుఁ బ్రార్థింతుమదిన్.

అయిన నాకిప్పుడే యాతొందర పాటేల? రోగియున్నంతవరకు రోగనివారణకై యౌషధసేవ యవసరమన్నట్టు లాముహూర్తకాలమువరకు నేఁ జేయవలసిన ప్రయత్నమంతయుఁ జేసికొనవచ్చు నింక మదీయ గురువరేణ్యు కొఱకు వెళ్లిన హేమలతసైతము రాలేదు. వారువచ్చు

లోపల నా చెలి మంజువాణి పంపిన గోపాలదేవుని చిత్రపటమొకసారి కన్నులారఁగాంచి యానందించెద.

(అని తలగడక్రిందనుండి చిత్రపటము దీసి యచ్చెరుపాటుతోఁ గేలని ర్దేశించుచు.) ఆహాహా! ఏమి యీజగన్మోహనాకారుని చక్కఁదనము?

సీ. నిద్దంపునీలాల నిగనిగల్ నిరసించు
        దేదీప్యమానమీ దేహకాంతి
పూర్ణచంద్రుని డాలుఁబురుడించి హసియించు
        ముద్దుల మురియు నీమోముగోము
కైరవదళ పంక్తి కౌతుకంబునడంచుఁ
        గమనీయమైన నీ కన్నుదోయి
మదబంభర శ్రేణి నదలించి బెదరింపఁ
        జాలు నీకోరమీసాలతీవ
చెఱకువిలుకాని పీఠంబు సరకుఁగొనని
డంబుమీఱిన పృథులవక్షంబు పౌరు
కలుగఁబోదెట్టి మోహనాకారునకును.
భళిర! యిది యేమి? రూపసౌభాగ్యగరిమ?

అయ్యారే! యేమి యీసౌందర్య విశేషము? ఇట్టి స్వరూపవంతులీ చతుర్దశభువనములలో నెచ్చటనైనఁగలరా?

సీ. అలనలకూబరుం డందగాఁ డందుమా?
        కఱుఁ దపశ్శాలియై కాంతిచెడియె
అలజయంతకుమారుఁ డందగాఁడందుమా?
        యనిమిషత్వములోప మతనికుండె
అలమీనకేతుని నందగాఁ డందుమా?
        యంగవిహీనుఁడై యతఁడువోయె

అల్ల సౌమిత్రియే యందగాఁడందుమా?
వనములవసియించి వన్నెతగ్గి.
కంచు దివిటీని దేవతాగణము నెల్ల
వేయినూరాఱుసారులు వెదకిచూడఁ
గానవచ్చునె? యిటువంటి ఘనుఁడొకండు
లేరు లేరిట్టి మోహనాకారులెచట.

ఔరా! యితని నాశ్రయించియున్న యీవస్తుజాలమెంత యొప్పారుచున్నది?

సీ. కాఁబోలునిద్దియా గజరాజుకొఱకునై
నక్రమ్ము ద్రుంచిన చక్రమహహ
కాఁబోలునది లోకకంటకులైన ని
శాటులంబోరిగొన్న శార్ఙ్గమహహ!
కాఁబోలు నిదిభక్తగణమును బ్రోవఁగా
సముచితమైయొప్పు శంఖమహహ!
కాఁబోలునిది రవి-కాంతుల నిరసించు
మహనీయకౌస్తుభమణియె యహహ!
అహహ! కాఁబోలునిది కనకాంబరంబు
భూరిమందారమాల కాఁబోలునిద్ది
భళిర! యీవస్తుచయము సౌభాగ్యమేమొ?
యెన్న డెడఁబాయఁజాల వీవన్నెకాని.

సీ. ఊహింపనీతని యూర్జితవిక్రమం
బుగ్గులోఁ జూసియే యుండవచ్చుఁ
బరికింపనీతని బాహుబలోన్నతి
కనుచిన్నతనమందె కానవచ్చెఁ

జూడఁగానీతని సుందరాకారంబ
　　　　దెల్లలోకముల మోహింపఁజేయు
నరయఁగానీతని శరణాగతత్రాణ
　　　　బిరుదంబునద్దెసల్ వరలుచుండె.
నిట్టిసుగుణైకసోముని జెట్టవట్టి
యపరభూలోకస్వర్గమ్ము ననుభవించు
చంచలాక్షి దే స్త్రీజన్మ సార్థకంబు
గాక నావంటి దౌర్భాగ్య కన్యకగునె?

సీ. ఈచక్రికేల్వట్టి యేయింతిముదముతో
　　　　లీలనై భర్మడోలికలనూఁగు?
నీకృష్ణుతోఁగూడి యేరామయారామ
　　　　సరసులజలకేళి సలుపఁగలదు?
ఈవిష్ణుదండచే నేకంజదళనేత్రి
　　　　సైకతస్థలములసంచరించు
ఈవిష్ణునెడఁబాయ కేసఖనిరతంబు
　　　　మేరుసౌధంబుల మెలఁగఁగలదు.
ఎవతె యాతఁడు మురళివాయించువేళ
సరసనేయుండి తద్గాన సారరసము
తనివిదీరఁగఁగ్రోలునో? ధాత యేమి
చేయునున్నాఁడో? యదిపరుల్ చెప్పుటెట్లు?

సీ. శరణాగతత్రాణబిరుదాంకుఁడనుటకు
　　　　గజరాజునేలిన కరణిసాక్షి
భక్తులముంగొంగు బంగార మనుటకు
　　　　బదరికాశ్రమపుఁ దాపసులుసాక్షి

సింహవిక్రముఁడని చెప్పంగాఁగాళీయ
        ఫణి ఫణాద్భుతతాండవంబుసాక్షి
భూరిబలుండని పొగడంగఁ బడుటకా
        శూరుఁడౌ మామకంసుండుసాక్షి
దీనమందారమనుటకు దీనుఁడైన
యాలసుదామునికిచ్చిన యందమైన
సంపదలుసాక్షి వేఱేమి సాక్ష్యమింకఁ
గావలయు? నీతనిచరిత్రఁ గాంచిచూడ

ఔరా! మోహమెంత దుస్సహమైనది? ఉత్తమరాజకుల సంజనితనగు నేనొక రాకొమరుని చిత్రపటమును గొని మోహపాశనిబద్ధమానసోపేతురాలనై, పరపురుషుఁడని శంకింపక, యేవో నోటి కొలంది నతని రూపరేఖాలావణ్య బలవిక్రమాదులను గుణించి ప్రశంసఁ జేయుచుంటిని. ఇది నావంటి యవివాహితలగు కన్యలకెంతయుఁ దగనివిషయము.

చ. పగులెవరేని విన్ననగుబాటగుఁ, దల్లియుఁ దండ్రివిన్న దు
    ర్భరమగు కష్టముల్ గలుగు, భ్రాతలువిన్నమనుంగుఁబుట్టె, యు
    బ్బురముగఁ జెప్పికొందురు పుప్పుంబోఁడులు విన్న ననేక భంగు లీ
    వరుసదదేకదృష్టి నొక ప్రాజ్ఞునిగూర్చి తపించుచుండినన్.

అయ్యో! దైవమా? నేనేమిచేతును? నామనస్సునకు నేనెంత సమాధానము చెప్పికొందమన్నను మనంబు కుదురుపడక యున్నది. ఔరింక నామనంబునకు శాంతియెక్కడ? మనోవాక్కాయకర్మల దాను వరించిన ప్రియుల విడనాడి హేయంబుగా మూఢాధముల కరగ్రహణమొనర్చుటకన్న దుర్భరమగు కష్టమిా స్త్రీజన్మకు వేఱొండుగలదా? ఇంతకును గారణంబు స్త్రీలస్వాతంత్ర్యలైన యబలలగుటచేత నే కదా? మగవారు తాతలమనియుఁ, దండ్రులమనియు, నన్నలమనియు

కలకష్టసుఖముల కాకరమైన వైవాహికాది కార్యముల సందర్భమున లేనిపోని పెత్తనముల బైని వేసికొని తమ యిచ్చవచ్చినవారి కిచ్చవచ్చి నట్లెల్లఁ గన్యలఁ గట్టిపెట్టుచున్నారు. ఇది యెంతయు కార్యము! ఇట్టి దారుణకార్యముల మాని స్త్రీలోకమునకు స్వాతంత్ర్యమొసంగిననాఁడే యధోగతిపాలైయున్న యీభరతఖండమున సంపూర్ణ స్వేచ్ఛావాయువులు వీచి సాటిదేశములతోఁ బాటు దానుకూడ మనోరథ సిద్ధిని బొంది యీ బాలగోపాల మహైశ్వర్యముల నోలలాడింపఁగలదు.

ఉ. సోదరులార! మీరిటులఁ జూడక యూరక నేఁటినుండి యా
మోదముతోడ మాకు నిఁక ముందు స్వతంత్ర్యమొసంగి దేశసౌ
భాగ్యోదయమార్గముం గని శుభోన్నతి భారతమాత కొంతయుఁ
బాదరమొప్పఁగూర్పు బుధసత్తములార! నుతించి మ్రొక్కెదన్.

మీస్వాతంత్ర్యమెటులున్నను నిరాకులంబున స్వయంవర స్వాతంత్ర్యాధికారము మాత్రము కన్యలకుఁ గల్గియుండ నాదేశసదియు సోదరునికతంబున సిద్ధక మేయయ్యె.

గీ. పరులనిందింప నిందిత భావ్యమగునె?
తాను దలఁచిన దొకటైన దైవమొకటి
తలఁచు నను సామ్య మిప్పుడు తథ్యమయ్యెఁ
గర్మగతి యెట్టులో? యది కాకపోదు.

కాని యేదోవిధమున వైరాగ్యమూని యిప్పటికీసంగతి విరమించుదమనుకొన్నను దురాచారుఁడగు మామఁడీది యుదనుగాఁగొని ఘోరహింసాజనములపైఁగల పగనంతయు నాపైఁ దీర్పసమకట్టె. నేనెట్లింక నాతనిబారినుండి తప్పించుకొని జీవింపఁగలను? నన్ను రక్షించువారలెవ్వరు? సురయక్ష గరుడ కిన్నర కింపురుష సిద్ధ సాధ్యులెల్లరతని సమ్మోహనాస్త్రమునకు వశులైయుండ వేఱుగా నాకాశ్రయ మిచ్చుటనుండను లేదులేదు. నే జీవించుటకల్ల.

చ. కులమును గోత్రముం గలిగి గొప్పకులంబునఁ బుట్టినంత నే
గలుగునె సత్ప్రవర్తనము? గాంచఁగఁ జందన మేఁటి? దాని కే
కులమును గోత్రముం గలవు? కోరి వరింతురు దాని నెల్లరుం
దలఁచిన నన్నిటన్ గుణము దద్దయుఁ బెద్దని యొప్పికొందగుౕ

కావనో సూనశరా! గుణము లేని నీకులగోత్రములతో నేమి ప్రయోజనము? నీవే కాదు నీసాంప్రదాయమంతయు లోక మెఱుంగనిది కాదు.

చ. జననిని నెంతుమా? నిలువఁజాలదు తిన్నఁగ నొక్కచోట నీ
జనకునిఁ జూడఁగా నతఁడు జారుఁడుఁ జోరుఁడుఁ గాదె?
మేనమామను బరికించినన్ గురుసిమానుష మానడిగంగఁ గల్పన
వ్వను గనుగొన్న నాతనికి నాలుగు నాలుకలుండె నెంతయుౕ

గీ. అట్టినీచాలుసాంప్రదాయంబు లెల్ల
నెఱిఁగియుండియు సిగ్గిల కేల నీవు?
తగుదునంచును దొరలాగు దాడివెడలి
విరహిణీకాంతలను నిటు వ్రేఁచ నేల?

ఛీ ఛీ పంచబాణా! నీ వింతకఠినాత్ముఁడ వగుటచేత నే

చ. అళులుఁ బికంబులు న్శుకములాదిగ నీబలగంబు గూడి పూ
విలుగొని తీవి మైనడచి వేలుపుమూఁకలు దద్దరిల్ల ని
స్తులమగు శంభుకంటిసెగతో నయి బూదిగ భార్యయౌ రతి
జలరుహపాణిచేఁ బ్రతుకఁజాలియు దేహము భంగ మొందవా?

క. ముక్కంటి కంటిసెగలో
నిక్కముగా బూదె యైన నీవప్పుడు మే
మిక్కరణి బాధ గాంతుమె?
యక్కట! నీబ్రతుకు మమ్ము నాఱడి వెట్టౕ

ఔరా! యేమి నీచాతుర్యము? నిమిషమాత్రములో నా యాకునుమాళ
కదా విమలిప్తమగు కంటకభూయిష్టముగాఁ జేసి నన్నలయింపఁ జేసితివి.

కానిమ్మా శయ్య విడిచి నన్ను నీవింకేమి చేయఁగలవో చూచెద, (శయ్యఁదిగి గవాక్షమునుండి పశ్చిమదిక్కు పరికించి) ఆహా! దైవ మహిమ!

సీ. చదలేటియుపరంజి జలరుహంబులతోండ్ల
　　　　ననుభవించుచునున్న హంసయనఁగఁ
　బాలోమిసౌధాగ్రి భాగమ్మునందునఁ
　　　　జెల్వారు హేమంపు శిఖగమనఁగఁ
　ప్రాగ్దిశాకామిని పాణితలంబునఁ
　　　　గోమరారు గేదంగికుసుమమనఁగ
　గగనకన్యామణి సొగసుగాజడలోన
　　　　ముడిచిన చేమంతి పువ్వనంగ
　నబ్జభవుఁడనిమిషుల కాహారమిడఁగఁ
　జెలఁగి త్రిప్పిన యమృతఁపు జలమయనఁగ
　దొంగలకుఁ గోడిదొంగయా తోయజారి
　యుదయగిరిశిఖరాగ్రమం దుద్భవించె.

ఓరీ! నీరజారీ! నీగమనసామర్థ్యమేమి? యచిరకాలములోనే షోడశకళా పరిపూర్ణుఁడవై వ్యోమమధ్యభాగ మలంకరించి విరహిణీజనముల వేటాడుచున్న మేనల్లుని కంతయు సాయమొనర్చుచు సంతసింపుచుంటివా?

సీ. భక్తవత్సలుఁడగు పరమేశుశిరముపై
　　　　నమరియుంటి వహించు నదరబోకు
　శరణాగతులఁబ్రోచు కరిరాజవరదుని
　　　　బావనం నునుమాదిఁ బదరఁబోకు
　సిరులకు ధామమౌ శ్రీమహాలక్ష్మికిఁ
　　　　దమ్ముఁడననటంచుఁ దలఁకఁబోకు

గ్రిహరాజునాను సంగడికాడటంచును
దలఁచియిల్లింతయుఁ గులుకఁబోకు
కాలవశమున వారిఁ గలిగెనీకు
స్నేహబాంధవ్యమొక కొంత చెనటియింత
దోసకారివెయసిమున్నుఁ దోఁచియున్నఁ
జేరనిత్తురెనినువారు నిరజారి!

క. చల్లనిదొరవనిలోకము
నెల్లనునినుఁ జెప్పికొనుట యేలొకో? నివా
చల్లనిరాజువు తండ్రిని
గల్లోలము పాలు సేయఁ గలనుండవె గా?

చ. కలిగెనఁగాదె నీకుఁజిరకాలముకిందటఁ బాండురోగమా
పలతుయసంభవించె గురుపత్నిఁ బిగూడినదోస మెట్టి వ్యా
ధులకు నివాసమైనిలువదో? బహుభంగుల వచ్చి బాధలం
దులువ! యిఁకెట్టుల న్మదికిఁదోఁచదురా! కనరా! పిశాచరా!
నీవిట్టి జ్ఞానశూన్యుఁడవగు దురాత్ముఁడవగుట చేతనే.

చ. సుర లతిదారుణాస్త్రములఁ జూర్ణముసేసి త్వదీయ దేహ మా
గురుని పరాభవంబునకుఁ గోరుచునుండఁగ నంతలోన శ్రీ
పరుని కృపాకటాక్షమున బ్రహ్మయటంచను దెంచి సంధి నా
వను సను జేయకున్న నినుఁ బ్రాణముతో నిలనిల్వనిత్తురా?

క. "పాపీనిరాయ" వనుటను
రూపింపఁగ లోకమందు రూఢిగ నిన్నే
చూపించె బ్రహ్మదేవుఁడు
చీ పాపీ! నీకుఁగలదె సిగ్గు న్నెగ్గున్

(అంతఃబంజరమ్ములనున్న పక్షులు కలకలధ్వని చేయుచుండఁ బంజరమ్ములదిక్కు మొగంబై)

సీ. హంసమా! నీవైన హరిని సందర్శించి
చెలఁగి యీనా వెత తెల్పవమ్మ
కీరమా! నీవైన నీరజాక్షునిఁ జేరి
చెలఁగి యీనా వెత తెల్పవమ్మ
పికమ! నీవైన నావిభుని చెంతకు నేగి
చెలఁగి నాయీ వెత తెల్పవమ్మ
శారికా! నీవైనఁ జక్రిసన్నిధి కేగి
చెలఁగి నాయీ వెత తెల్పవమ్మ
బర్హి! నీవైన నేగి నా బాములెల్లఁ
జెలఁగి శ్రీకృష్ణుతోడనుఁ జెప్పరాదె?
యింతమాత్రంబు సాయంబు నేల మీరు
చేయఁజాలరొ? చెప్పరే చెలియలారా

అయ్యో! యేమి నా భ్రాంతి? మీ గుణగణంబుల నెల్ల నెఱిఁగియుండియు నిమ్మేల యిట్లు ప్రార్థింపవలయు? మీరు మాత్రము మామారహంతకుని కన్న గొప్పవారా!

సీ. కలకంఠి! నీకంత కనికర మేయున్న
నడవులలోఁ బడి యడల నేల?
కీరమా! నీకంత కృపయున్న నీరీతి
రక్తాక్షివై కుంఠ వ్రాంత యేల?
హంసమా! నీకంత యాదర మేయున్న
బ్రహ్మవాహనమవై పరగ నేల?
శారికా! నీకంత సానుభూతి యేయున్నఁ
జెఱుగీటకముల భక్షింప నేల?
పికమ! నీకింక నంత యోపిక యేయున్నఁ
బరులవంచ నీబిడ్డలు బ్రతుక నేల?

ఔర! మీరింతగ శ్లాఘ్యు లగుటగాదె?

పంజరంబులఁ బడికుంద వలసివచ్చె.

యుక్తాయుక్త పరిజ్ఞానము లేని యీ పక్షులం దిట్టిన నేమి ప్రయోజనము? సుర యక్ష గరుడ కిన్నర కింపురుష సిద్ధ సాధ్యులలో నొక్కరైన నా యీ మొరనాలకించి నన్నీ ముప్పునుండి తప్పించి రక్షించువారు లేనప్పుడు నేనెంత విలపించినఁ బ్రయోజన మేమి? ఆయువు సన్నగిల్లిన వానికాహారము చేదగునట్లు నాకీలోకమంతయుఁ బచ్చగాఁ గానిపించుచున్నది. దేహమా, అతికంప మొందుచున్నది. నాలుకయా పిడుచుకొని పోవుచున్నది కాళ్ళుతడఁబడుచున్నవి. నా యీయవస్థ మరణావస్థను సూచింపుచున్నది; కానిమ్ము. ఇంక జీవించి పాపాత్మురాలగు శిశుపాలుని కరగ్రహణమ్మొనరించి కష్టమ్ము లనుభవించుటకన్నఁ బవిత్రములగు నారాయణుని పదపద్మముల స్మరించుకొనుచు నుత్తమలోకమున కేగి సద్గతి నొందెదను జననీజనకులారా! నా యీస్వల్పజీవితకాలములో నేనొరించిన యపరాధముల క్షమింపుఁడని మీకిదే యొకసారి నమస్కారమునుఁ జేయుచున్నాను. ఓయీశ్వరా! పరమేశ్వరా! జగద్రక్షకా! యిఁకముందు నేనెట్టి స్త్రీజన్మము లెన్ని యెత్తిన నన్నంట నావాసుదేవనందనుండగు గోపాలకృష్ణునే పతిగా నొనర్పుమని సభక్తిగా నీకిదే పదివేలనమస్కారములఁ జేయుచున్నదానను (మూర్ఛిల్లును. తలుపుచాటునఁ బొంచియున్న మంజువాణి యొమ్మొమోదుకొనుచుఁ దటాలునవచ్చి రుక్మిణిపయిఁబడి చింతిల్లుచుఁ దనయంకపీఠంబున రుక్మిణితలనిడికొని గద్గదస్వరమున) అహా! దైవమహిమ! ఎంతలో నెంతఘోరవిపత్తు సంభవించినది. ఓమూలదైవమా! ఘటనాఘటనసమర్థుండవగు నీచెయిదములకసాధ్యమెద్దియు లేదుకదా! క్షణములో జోగిని భోగిగను భోగిని జోగిగను సురూపవంతుని కురూపిగను కురూపిని సురూపవంతునిగనుఁ జేయఁజాలెడు నీసామర్థ్యమున కెంతేని

వారైన వశులైపోవుచుండ నబలలము నసహాయులమునైన మీ మొఱ లెక్కయా? అమ్మా! రుక్మిణీ! నీవు యింతదనుక యానుధారలోఁ జేయుచున్న పరిసంగము పరిబంధ శైలిని మించియుండుటబట్టి నీకుఁగల కవితాసామర్థ్యమున కచ్చెరువందుచు ముద్దులొలుకు నీ ముఖమునుండి యింక నేమేమి వెలువడునోయని మనుకుతూహలముతో నట్లు తెలుపుచాటునఁ బొంచియుంటిని? కాని లేకున్న నప్పుడే నేను నీ మెనుటఁ బడిన నీకిట్టి ముప్పువాటిల్లియుండదు కదా!

సీ. ఆకొన్న వారల నప్పుడే కనిపెట్టి
యన్నంబుఁ బెట్టెడు నతిథి నీకు
వస్త్రహీనులఁ జూచి వస్త్రంబు లిప్పించి
యాదరింపఁగఁ జాలు నబల నీకుఁ
బరుల బాధలఁ గాంచి భరియింపఁజాలక
కన్నీరు పెట్టెడు కాంత నీకుఁ
గలలోన నైన నవ్వుల కైన నొకసారి
పలికి బొంకని యట్టి పడతి నీకుఁ
తెలిఁగి చెలిక త్రైలోకతప్పు చేసియున్నఁ
గోపమనుమాట నెప్పుడుఁ జూపనట్టి
నరసమతురాల! రుక్మిణీ! సఖియ! నీకుఁ
బూర్తి యయ్యెనె? నూరేండ్లుఁ బుడమియందు.

సీ. తొలఁగెఁగాయాయింటి తొగ తేనిచల్లెలు
మాసెఁగాయాయింటి మలయుకీర్తి
చల్లెఁగాయాయింటి చిన్నారి యాటలు
సమసెఁగాయాయింటి సరస మెల్లఁ
బోయెఁగాయాయింటి పుణ్యంపునోములు
వెడలెఁగాయాయింటి విద్య లెల్ల

దరలోఁగాయాయింటి దానంబు ధర్మంబు,
గుర్రింగెంగాయాయింటి గొప్పదనము
అమ్మనీవిట్లు రుక్మిణీ! యస్తమింప
నస్తమింపని దేని? యీయవనియందు
బ్రతికియుండిన నేనింక ఫలము దేమి?
నన్నుఁ గోల్పోమ్ము మాయమ్మ! కన్నతల్లి!

అమ్మా!

క. పదునాలుగు వత్సరములుఁ
నుద ముట్టెను? లేదో? నీకుఁ దోయజముఖి మా
హృదయములు వగుల స్వర్గపుఁ
బదవిని జేకొనుట కేగ బాలా! తగునా?

తల్లీ! నీచెలియగు సుంజావాణిని నిచట దిక్కులేని యొంటియనాధనుగాఁ జేసి నీవొకర్తవే స్వర్గమున కరుగందగునా? అచ్చటి సుఖములు నీతోఁబాటు నేనుగూడ ననుభవింపఁదగనా?

సీ. పౌలోమిమహారాముంజి పాన్పుపైఁబవళించి
నిద్రింపుచుంటివా? నీరజాక్షి!
వేల్పుకన్నియలతో విందారగింపఁగాఁ
బనిపూనియుంటివా? పద్మగంధి
శ్రీజయంతకుమారు చెలిశోడఁ గుసుమముల్
గూర్చుచు నుంటివా? కోమలాంగి!
అలబృహస్పతియొద్ద నఖిలవిద్యలు నేర్వఁ
దలఁపుమైనుంటివా? తలిరుఁబోఁడి!
నందనోద్యానవీధు లానంద మొదవ
సంచరింపుచు నుంటివా? జలజనయన.

కాక యుండినఁ బిలిచిన గన్నులెత్తి
చూడకుందువె? నన్నిట్లు సుందరాంగి!

సీ. జలధరాచ్ఛాదిత చంద్రబింబముభాతి,
మారుతాహతిరాలు తారయట్లు,
వేడిగాడ్పులు తాఁకి వాడినలతవోలె,
నాకలిచేస్రుక్కు హంసపోల్కి,
నగ్నిచేఁ గమలిన యపరంజివిధమున,
నంబుచేఁ గూలిన హారిణి కరణిఁ,
గత్తితాఁకునబడ్డ కదళికభంగిని,
వలఁబడ్డకీరంబు వైఖరిగను
చిక్కి, సగమయి, స్మృతిఁదప్పి చెన్నుఁదఱిఁగి
భళిర! కఠినంపుత్రాసేలఁ బవ్వళించి
యున్న నిన్నుఁజూచి నేనింక నోర్చుటెట్లు?
వచ్చుచుంటిని నీతోడ వనితయిపుడె.

ఉ. కన్యలు లేరె? యింకఁ బ్రియకాంతుని నొక్కనిఁ గోరి రుక్మిణీ
కన్యవిధాన వారలిటు కంజశరార్తిని దెల్పవీడిరే?
యన్యులమోహము నేనెటులహో! యిఁకఁ జూచెద నేను గూడ నీ
కన్యను జేర్పఁబోయెదను గాలము జాలము సేయకేటికిన్

చి.·చి. అస్థిరమగు నీయస్థిపంజరముపై నాసగలిగి నేనింక జీవించుట కన్న సంగరాంగణముల శాత్రవాళిశిరఃప్రకరంబులఁ బూలచెండ్లవలె భూదేవికి బలియొసంగిన నాయాకృపాణముతో నేనిప్పుడే విముక్తి నొంది నాచెలిని గనిసికొనిన స్నేహలతనించుక పోషించిన దానవగుదును. ముందు రాఁబోవు తరంబులవారికిఁ గొంతమార్గదర్శినయ్యెదఁ గాక!

(ఒడ్డాణమునకు మర్చియున్న కృపాణము జరాలున దీయుచుండ తెరలోగలకలము.)

గీ. అంతసాహసమేల? యోయబ్జవదన!
మరణమదిగాదు మూర్ఛ యోయిందరుణికిపుడు
జరుపుమా! వేగ శైత్యోపచారములను
బాలస్మృతిగొను నింక నీ జాలమేల?

వు—ఆహాహా! కరుణారసపరిపూరితములైన నీసాదరవాక్యములు పలికి మమ్ముద్ధరింపసమకట్టిన మహానుభావు లెవరు? (దిక్కులు పరికించి) ఎవ్వరునిచ్చోటఁ గాన్పించుట లేదే? ఈశబ్దమెచ్చటనుండి వెలువడినది? ఇదియంతయు నీశ్వరమాయగానున్నది. నాకేమియుఁదోఁచకున్నది.

(మఱల తెరలో)

చ. సరసిజనేత్రి! నీవిటుల జాలముఁ జేసెదవేల? యింకనీ
తరుణి మనోభవానల నితాంతమురంత విదీప్తకాంతుల
చ్చెరువుగ సోకి మూర్ఛవడి చెన్నొకయింత దొరంగియుండె స
త్వరముగ దుఃఖమాటగు బాగుగఁ బ్రక్రియఁ జేయఁ జూడుమా!

మ—ఓహోహో! సర్వలోకైకపరిపూజ్యయగు భవానీదేవియే మమ్ముద్ధరింపసమకట్టి యీసాదరవాక్యములఁ బలుకుచున్నది. (కరములు మోడ్చి యాకసమువంకఁ జూచుచు.) అమ్మా!

మ. సరసీజోద్భవు రాణివై, విమలభాస్వత్కీర్తి సచ్చంద్రికల్
పరపంజాలియు నాల్గులోకములు విద్యత్ప్రీతలై సత్కవీ
శ్వరులామోదమునొంద వారిపయి నవ్యాజానురాగంబుతో
గరముం బ్రోచెడు భారతీ! భగవతీ! కళ్యాణి! నిన్నుంచెదన్.

ఔరా! దుఃఖాతిశయమున నేనెంతయజ్ఞానాంధకారమునఁబడిపోతిని నిజముగా నాచెవినిబడినరీతిగా నీయమకు మూర్ఛగాని మరణావస్థగా

దిదిగో! యుచ్ఛ్వాసనిశ్వాసములాడుచున్నవి. దేహమత్యుష్ణముగా నున్నది. ఈలక్షణములను బట్టి చూడఁగా నీమె మనోభవానలజ్వాల కాహుతియై స్మృతిఁదప్పియున్నది. కాన నిక్కముగా శైత్యోపచారములు సత్వరముగాఁ జేయవలయును. (తనయంకతలమునందున్న రుక్మిణి శిరస్సు మెల్లఁగాఁ దలగడపైనిడి స్వర్ణకలశమునఁ గల పన్నీరు ముఖముపైఁ బ్రిసరింపఁజేసి చందనము మేననలందుచుండును.)

రు—(కొంచెము సేదఁదేఱి) చెలీ! హేమలతా! హా! హేమలతా!!

మం—ఇప్పటికీయమకుఁ గొంచెము స్వల్పజ్ఞానము మాత్రము గలిగి హేమలతాయని కలువరించుచున్నది.

రు—హేమలతా! యేటికే? ఇట్లు నాముఖముపై జలముఁజల్లుచుంటివి? దేహమున కేమో వ్రాయుచుంటివి?

మం—అమ్మా! నేను హేమలతనుగాను మంజువాణిని. నీముఖముపైఁ జల్లునది జలముగాదు పన్నీరు. నీదేహమున కలఁదునది చందనము. ఇంక నీవెంతి సేపిటులఁబండి యుండెదవు? నీభోజనమున కిప్పటికే వేళయతిక్రమించినది లెమ్ము (మెల్లఁగాఁ జేయిలెట్టును.

రు—అమ్మా! (కనులునులుముకొనుచు లేచి కూరుచుండి మంజువాణి మోముజూచి) హా! మంజువాణి (తటాలునఁ గౌఁగిటఁజేర్చుకొని దుఃఖముతో) సఖీ! మంజువాణీ!

చ. పొడమితి మొక్కచోట: గడుఁబ్రోదిని గాంచితి మొక్క యింటనే
కుడిచితిమిందఱిభోగములఁ గూర్కు చెందితి మొక్కశయ్యపై
నడచితి మొక్కమార్గమున నాకును నీకును భేదమేమింటం
బడితిరొ! మైవనింతకు సుభాషిణి తీరె ఋణంబు నేఁటితో.

చెలీ: మంజువాణీ! నాయీ యవస్థ నేటి కెట్లు పరిణమించినదో చూడుము నేనెంతగా నీతోఁ జెప్పికొందును?

మం—అమ్మా! రాజపుత్రీ! దుఃఖింపకుము. (కొనచెంగున గనుకొలకులఁజారు కన్నీరు తుడుచుచు) నీయుదంతమంతయు హేమలఁతవలన నెఱింగినదాననై ప్రత్యక్షముగా నీయవస్థనంతయుఁ జూచుచున్న నాకు నీవు వేఱుగఁ జెప్పనక్కఱలేదు. ఇంతకు నాభవానిదేవి కృపవలన నిప్పటికి ధన్యులమే యైతిమి.

ఉ. కంతుశరంతతాపమునఁ గ్రాఁగుచు నీవిటులొక్కయన్య సా
మంతుని పుత్రిసొయగముమానసమందుఁ దలంచి యింతగా
జింతిలనేటికమ్మ? సరసీరుహపత్రవిశాలనేత్రి! ధీ
మంతులు రూపవంతులగు క్ష్మావర నుత్తములుండ నెందఱో.

చ. పొలుపగుసూర్యవంశమునఁబుట్టి వివాహముగాని కన్యవై
తలఁపుననొక్కయన్య వసుధాతలనాథుని పుత్రిఁగోరి వ్యా
కులమును జెందనేల? జనకుండిదివిన్నఁ బ్రియూదవాఁడు లో
కులువినఁగాకులోయనఁగఁ గూయరె? పెక్కువిధాలనెంతయున్

క. అన్యముఁ బుణ్యంబెఱుఁగని
కన్యవు మాయమ్మ నీవు గావున నిటు సా
మాన్యులవిధమునఁ గుందెదు
కన్యామణి! యిట్టివిధము గలదే? యెందేన్

రు—మంజువాణీ! కొంచెమూఁగుము. అదిగో? యెవరో వచ్చుచున్నట్లున్నారు.

మం—(కొంచెముస్మృతి నభినయించుచు) ఆ! యెవరోవచ్చుచునే యున్నారు.

(హేమలతయు నహూబలపండితుఁడును బ్రవేశింతురు.)

రు—మం—(లేచి) గురువరా! నమస్కారము,

అ—

చ. జనకజతోడ బంధుజన సంతతితోడ, హితాళితోడఁ బా
వని, రవిపుత్త్రుఁడాదిగల భవ్యకపీంద్రులతోడ, శూరులా
యనుజులతోడ, భృత్యజనులందఱితోడ నయోధ్య నేలు నా
యినకులవార్ధిచంద్రుఁడిడు నిష్టసుఖంబులు నీకుఁ బుత్త్రికా!

మం—ఆర్యా! ఈరత్నపీఠ మధిష్ఠింపుఁడు.

అ—అమ్మా! రాజపుత్త్రీ! నీవీ కనకాసన మధివసింపుము. మంజువాణీ! హేమలతా! మీరును గూర్చుండుఁడు.

(అందఱును గూర్చుందురు. రుక్మిణి ఖిన్నవదనయై తలవంచుకొని కూరుచుండును.)

అ—అమ్మా! రుక్మిణీ! ఇంతమాత్త్రమునకే నీవింత దుఃఖింప నేల? నీయుదంతమంతయు హేమలత నాకెఱింగించెను. అహోబల పండితుఁడు జీవించియుండఁగనే నీవింత యార్తిఁ జెందుటకుఁ గతం బేమి? నన్ను నెఱుఁగవా?

ఉ. తారలు రాలినన్ రవిసుధాకరు లెంతయు మాఱిపోయినన్
ధారుణి క్రుంగినన్ వనధి తల్లడమందిన దిక్కరీంద్రముల్
భీరువులైన నీదిశలు బీటలువాఱిన నాకుఁ బూన్కి నె
వ్వారలు మాన్పగాఁ గలరు? వారిజలోచన! నీ వెఱుఁగవా?

అమ్మా! ఇట్టినన్ను నీ వెఱిఁగియుండియు నింక సంశయించెద వేల? నా కర్తవ్యమేమో సత్వరముగా నెఱింగింపుము.

మం—ఆర్యా! ఇంకఁ దమసన్నిధిని దాఁపఁగల రహస్యమే మున్నది?

హే—(మెల్లఁగా) అయ్యగారసలే చేతులుగాలిన మర్కటమువలెఁ జిందులు ద్రొక్కుచు నాలస్యమున కాఁగఁజాలకున్నారు. చెప్పవలసిన కార్యమేమో సత్వరముగాఁ జెప్పుము.

అ—(కోపముతో) ఓసీ హేమలతా! యేమంతనన్నుఁ జూచిన నీకు హేళనగానున్నదా? నీతలకంత క్రొవ్వెక్కినదా? చిన్న పెద్ద తారతమ్యము లేక నన్నొక మర్కటముతోఁ బోల్చి చెప్పుచుంటివిగా! ఇదిగో! నీతుళ్లిపడఁగునట్లు నిన్ను దేశపించెదఁ జూడుము (ఆసనముపై నుండి లేచును)

మం—(అడ్డమువచ్చి) శాంతింపుఁడు. హేమలత వెకిలిదియను నంశము తామెఱుంగని విషయముగాదు అమోఘవాక్యసిద్ధసంకల్పులగు తామేదేని యన్న నది నిష్కారణముగాఁ బ్రాణంబులు విడిచిపోవును రక్షింపుము.

అ—(కొంచెము శాంతముతో) అమ్మా! రుక్మిణి! ఇంకనూరక కాలహరణము సేయక చెప్పఁదలచిన సంగతియేమో చెప్పుము

రు—అయ్యా! చిత్తగింపుము.

ఉ. ద్వారకకేగి నీవు రిపుదానవమర్దను గృష్ణుగాంచి నా
తీరును సర్వమాతనికిఁ దెల్పి యథోవిధి తోడితెచ్చి నా
కోరికఁ దీర్పుమంచు నినుగోరుచు నుంటిని దీనురాలనై
సారవిశారదా! యెటులసాయము సేతువొ? నాకునిత్తఱిన్

మం—ఆర్యా! తామరుగునప్పుడిదిగో! యీచిత్రపటముగూడ వెంటఁ దీసికొనివెళ్లి యాగోపాలదేవున కొసంగవలయును. (రుక్మిణి చిత్రపట మొసఁగును.)

అ—(అందికొని) బిడ్డా రుక్మిణీ! ఇంతమాత్రమునకే నీవింత దీనముగాఁ జెప్పవలయునా? నాయీజన్మమధ్యమున నేనింతకన్న నెన్నఁగల ఘనకార్యమొండు గలదా? నీసెలవైనచో ద్వారకాపట్టణంబునకుఁ బాదములతోఁ గాక శిరస్సుతో నడచి వెళ్లి కార్యసాఫల్యమొనర్చుకొని రాఁగలను గాన నీవు జాగుసేయక సత్వరముగా నాకనుజ్ఞనొసంగి నన్నుఁ బంపించుము.

హే—అక్కా! మంజువాణీ! మనయయ్యగారు ద్వారకాపట్టణమునకుఁ దలకిందుగా వెళ్లెదనని సెలవిచ్చుచున్నారుగదా! కార్యమును గూడఁ దలకిందుగా నొనర్చుకొని వచ్చెదరేమో? యని సంశయమగుచున్నది.

అ—ఓసీ! హేమలతా! దుర్మార్గురాలా! నీనోటికి హద్దుపద్దులేక మఱల నన్నేమో యనుచుంటివి ఈసారి నీవాగరణఁగ నోటికిఁ దాళము వైచెదఁ జూడుము (పైకిఁ బోఁ బోవును.)

మం—(అడ్డముపోయి) ఆర్యా! దానితో నేమి? వట్టిపనికిమాలినదని నేను మొదటనే తమతో మనవిఁ జేసితినిగదా! ఈవాక్కలహముతోఁ గాలయాపనముఁ జేయక మన యీ కార్య సాఫల్యమగు తెరు వాలోచింపుము.

అ—మంజువాణీ! ఇప్పట్ల నీవుండఁబట్టి యది బ్రతికిపోయినది కాని, లేకున్నచో నది యీపాటి కేమవునో? నీవే కన్నులారఁ జూచియుందువు.

రు—గురువరా! యుక్తాయుక్త పరిజ్ఞాన శూన్యురాలగు హేమలతతోఁ గలహించుచు నిట్లు వృథా కాలయాపనమేల చేసెదరు? వివాహమా మిక్కిలి సమీపమునందున్నది. తమరరుగవలసిన పరదేశమా కడుంగడు దూరము. చేయవలసిన కార్యమా బహు దుర్ఘటము గాన తామిటనిఁక జాగుసేయక సత్వరముగా వెడలి యెటులేనిఁ గార్య సాఫల్యముఁ జేసికొని రావలెను.

అ—అమ్మా! రాజపుత్రీ! మీరిఁక సందేహపడవలదు. నేనిదిగో వెళ్లుచుంటిని నాకుసెలవొసఁగుము (వెళ్లుచుండును.)

మం—అమ్మా! రాజపుత్రీ! యుత్తరమొసంగితివా?

రు—లేదులేదు. మఱచిపోతిని. మఱల నొక్కసారియిటు రమ్మనుము

మం—(నాలుగడుగులునడచి) ఆర్యా! మఱలదా నొక్కసారి యిటకుఁ దయచేసి రావలెను, అమ్మగారి సెలవైనది.

అ—(మండిపడుచు కోపముతో) ఆకువాంఛుని జ్ఞానశూన్యులని పెద్దలు వచించుమాట వట్టిది కాదు నేను దొలుదొల్త శుభమ్మని వెళ్లుచుండ ననుఁ బోనీయక మఱల వెనుకకురమ్మని పిలుచుచు నన్నావుచున్నారిది శుభసూచకమా? (వచ్చును.)

రు—ఆర్యా! మఱచిపోతిని ఇదిగో! ఈలేఖ నామహాత్మున కొసంగి నావాక్యములుగా వానిమ్రోల నిట్లు వచింపుము.

సీ. శరణాగతత్రాణ బిరుదంబు నిలిపికోఁ
జాలిన దగినదీ సమయమనుము
దుష్టులదునుమాడి శిష్టులఁగాపాడ
నెంచిన నద నరుదెంచె ననుము
ధరణిమీఁదను బూర్వ ధర్మముల్ నెలకొల్ప
దలఁచిన నియ్యదే తరుణమనుము
భక్తులముంగొంగు బంగారమనుమాట
సార్థకం బిత్తఱి సలుపుమనుము.
ప్రాణమానంబులెల్ల నీకరము జేయఁ
జిత్తమెంతయు నీపయి హత్తియున్న
దిక్కులేనట్టి నావంటి దీనమతిని
బ్రోచుటెంతయుఁ దనకది పుణ్యమనుము.

అ—అమ్మా! ఇంతేనా? మఱి యింకేమైనఁ గలదా? నీసందేశముమఱల మఱల వెనుకకుఁ బిలఁచిన నేను వచ్చువాఁడనుగాను చెప్పవలసిన దేమైన నున్న నంతయు నొక్కసారిగానే చెప్పుము.

రు—ఆర్యా! ఇంకేమియున్నది? అతఁడు ప్రోవఁదలఁచినచో నాయీదీనమగు సందేశమే చాలును. తామింక దయచేయ వచ్చును.

అ—అమ్మా! అట్లయిన నాకిఁక సెలవొసంగుము వెళ్లివచ్చెద.

రు—మంచిది. (అహోబలపండితుఁడు నిష్క్రమించును)

రు—చెలీ! మంజువాణీ! ఎంత విద్యాసంపన్నుఁడైన వయసెంత గతించినను కుదురింతవఱకును గలుగని మనగురువుగారి నీకార్యమునకు నియోజించితిమి. ఏమి? అకటా వికటము చేసికొనివచ్చునో యని మనంబున శంక వొడముచున్నది.

మం—అంతయు దైవాయత్తము. మనప్రయత్న లోపమేమియు లేకుండఁ జేయవలసిన ప్రయత్నమంతయుఁ జేసితిమి. పైనదైవమున్నాఁడు మన మాతని నేనమ్మియుందము. ఇంక వేఱుచింతలఁ బోనలదు నీకింక భోజనమున కిప్పటికే వేళ చాల యతిక్రమించినది అమ్మగారు కైవేచి యుందురు పద వెళ్లుదము.

(అందఱు నిష్క్రమింతురు)

ఇది ద్వితీయాంకము.

వైదర్భీ పరిణయము.

తృతీయాంకము.

శ్రీకృష్ణుని దర్బారు

[ప్రవేశము బలరాముఁడు సాత్యకి కృతవర్మ అక్రూరుఁడు తక్కుంగల యాదవవాహినీ పతులును]

బ—అక్రూరా! ఈబంధు మిత్ర మంత్రి వాహినీ పతులనెల్ల వారిని నేఁడింత సత్వరముగా రప్పించి శ్రీకృష్ణుఁడిప్పుడీ దర్బారు గావించుటకుఁ గతంబేమై యుండును?

అ—దేవా! ఆవిషయము దేవరవారికే దృగ్గోచరము గాకున్నప్పుడు నావంటి సామాన్యునకు మాత్రమెట్లు తెలియును?

సా—పెద్దన్నగారూ! కారణమునకై తామంత దూరమాలోచింప నేల? యేదియో యని వార్యమగు కారణముండుటం బట్టియే సత్వరముగ నెల్లవారిని దర్బారునకు రావలసినదిగాఁ బట్టణంబునఁ జాటంబనిచెను యేటికో కాని గతదినంబున నుండి చిన్నన్నగారి సహజ మందస్మిత ముఖారవిందమెుకింత చెన్నుదక్కిఁగినట్లు కాన్పించుచున్నది

కృత—సాత్యకీ! తెలియనివారు వోలె నేలవిూరునట్లు దర్బారు సలుపుటకుఁ గారణమరయలేక యూహలపై నూహలఁ జేసెదరు?

శ్రీభక్తవత్సలుని వరపరిభావంబున మఱల నేరాక్షసాధముఁడో పె
చ్చుపెరిఁగి సురపురిపైదండు విడిచెనో? లేక బదరికాశ్రమ వాసులగు
తాపసులను బాధించుచు లోకములనెల్లఁ జీకాకార్చుచుండెనో? వారిర
క్షణార్థమై యాసురాత్ముని వధించుటకుఁగాను మన యెల్లవారితో నా
లోచించుటకే నేఁడీదర్బారుఁ గూర్చెనని తలంచెద.

అ—కృతవర్మా! లెస్సగాఁ బలికితివి. శరణాగతరక్షణ బిరుదాం
కితుండగు నందనందనునకీ చింతి దక్క వేఱొండు విచారమేమి కల
దు? నీవువచించినట్లే రాక్షసాధముఁడో మఱల నీశ్వరవరపరిభావ పే
రితుఁడైన మఱెవఁడో? లోకముల వేధించుచుండ వాని నివా
రణోపాయ మాలోచించుటకే నేఁడీ సభసమకూర్చి యుండనచ్చు.

బ—సాత్యకీ! కృష్ణుఁడింక దర్బారునకు రాక నేఁడింత యాల
సించ టకుఁ గతంబేమి?

[తెరలో]

వయస్యా! చూచితివా?

సీ. సింహ విక్రముఁడైన శ్రీపురూరవుఁడుతా
ధారుణీ భారంబుదాల్చునాఁడు
ధర్మసంస్థాపనాధ్యక్షుండు రాముండు
లీలమైఁ బుడమిఁ బాలించునాఁడు
నిత్యసత్యవ్రత నిరతుఁడౌ నలహరి
శ్చంద్రులు రాజ్యంబు సలుపునాఁడు
విబుధ విధేయుఁడౌ విక్రమాదిత్యుండు
రాజ్యంబుఁజేయు కాలంబునాఁడు
ధర్మదేవతనాల్గు పాదములనడిచె
భరతమాతరో! యిప్పుడీ పాపమేమొ?

ద్వాపరంబునఁ దా నొంటి పాదమునను
నడువకున్నది ధర్మమనారతంబు.

సా—బలదేవా! అదుగో! చిన్నన్నగారేమో కౌశికునితో నీయుగచర్యను గుఱించి సవిచారముగఁ బల్కుచు నరుగు దెంచుచున్నారు.

అ—గోపాలకృష్ణుని సవిచార భాషణములవలన మఱల నమరావతీ పురమునకో? బదరి కాశ్రమమునకో? ముప్పువాటిల్లెనని తోఁచుచున్నది.

[కృష్ణుఁడు కౌశికునితోఁ బ్రవేశించి బలరామునకు
నమస్కరించి కనకాసన మధిష్టించును.]

బ—గోపాలకృష్ణా! ఏమి? నేఁడింత యకస్మాత్తుగా యదువృష్టి భోజ కుకురాంధక వంశోత్తములగు వాహినీపతుల నెల్లర రావించి యీదర్బారు గావించుటకుఁ గలకారణము నేనరయఁ జాలకున్నాను మఱల నే రాక్షసాధముఁడైనఁ జెలరేఁగి లోకముల వేధించుచుండెనా లేక దుష్టులగు చైద్యమాగధు లేకమై మఱల మనకేమైన నొకయుపద్రవము చేయుటకుఁ బ్రయత్నించుచుండిరా?

కృ—(ఆసనముడిగ్గి) అన్నా! బలరామా! సభాసదులారా! మీ మెల్లర నింత యాకస్మికముగ రావించి యీసభ సమకూర్చుటకుఁగల కారణము మఱేమికలదు? మన కాబాల్య శత్రువును గంధగజేంద్ర తుల్య బలగర్వితుండును, మాయోపాయ పారీణుండును దుష్టరాజ శిరోమణియునగు జరాసంధుండు మనతో నకారణవైరమూని పెక్కుసార్లు మనపైదండెత్తి సంగరరంగముల మనలఁ బరాఙ్ముఖులఁ గావించి పెక్కుమంది యదువంశసంజనితులగు రాకుమారుల నెందఱినో హింసించి చివరకు మన పితార్జితమగు మధురాపురమునసైన నిల్వనీయక యటనుండి పాఱఁదోల మనము దైవవిధికొంతయు వగచుచు నీల

వణవారాశి మధ్యమున నీద్వారకాపురిని నిర్మించుకొని తలఁదాచుకొ
నుచున్నారముగదా! అంతటను బోక యాదురాత్ముఁడిప్పుడు నుజల
వంగ, కళింగ, సింధు ఘూర్జర దేశాధీశులఁ దోడుచేసికొని ప్రబ
లసైన్యసమేతుఁడై మనలను హింసించి యీద్వారక నీలవణవారాశి
లోఁ గలిపివేయు నుద్దేశముతో నచిరకాలములో మనపై రానున్నాఁడని
వేగులవారివలనఁ దెలియవచ్చెఁగాన మీరిఁక జాగుసేయక మ దేశ
రక్షణార్థమై,

మ. కరవాలంబులఁబూని హస్తములఁ బ్రఖ్యాతికై సంరంభ సో
దరులారా! రణమందు వైరజన కాంతారాభి వృక్షంబులం
బరమోత్సాహముఁబూని తుత్రించి యదుసామ్రాజ్యమ్ముఁగాపాడిను
స్థిర మౌకీర్తిని గొందురో? రిపులకుఁ దేశంబు నర్పింతురో?

సీ. చేయఁబోదురె? యింకఁ జేతులారఁగ మీరు
మాతృదేశపుసేవ మాన్యులార!
సల్పఁబోదురె? యింక క్ష్మాతలంబున మీరు
ధర్మసంస్థాపన ధన్యులార
నిల్పఁబోదురె? యింక నిజముగా మనయాత్మ
గౌరవమ్మిఁకముందు ధీరులార
చూడఁబోదురె? యింక క్షోణిపై నిటువంటి
ధర్మసంగ్రామ ముద్దండులార
ఎన్ని సదుపాయములఁ జేసికొన్నఁగాని
యస్థిరంబులు దేహంబు లనెడుమాట
నెంచియొక్కింత యశము నార్జించుకొఱకుఁ
గదలిపదరయ్య! మీరెల్లఁ గదనమునకు.

ఉ. పుట్టినలాభమేమి? మగపుట్టుక దేశహితైక కార్యమి
ప్పట్టునఁ జేయకున్న మగువల్ హసియింపరె? మాతృసేవకై

కట్టుఁడు మీవలగ్నములఁగాయము బుద్బుదతుల్యమంచుఁ జేఁ
బట్టుఁడు కీర్తి కాంత కరపద్మము వైరులఁద్రుంచి వేగమే?

సోదరులారా! మ యీదేహంబులస్థిరంబులనియు, నైశ్వర్య మశాశ్వతమని మీఁదనురెల్ల రెఱింగిన విషయమేకదా! కానమీరెల్లరింక మీమీ ప్రాణధనంబుల కాసించి సంగరవిముఖులై కరములాఱమన రాజ్యలక్ష్మిని రిపులకర్పించి యాత్మగౌరవమునుగోల్పోయి దాస్యపాశాబద్ధులై శత వత్సరంబులు జీవించుటకన్న సామ్రాజ్య రక్షణ దీక్షాబద్ధకంకణులై సంగరరంగంబున శాత్రవాళికి మానమునకన్నఁ బ్రాణము నేయర్పించి వీరస్వర్గమలంకరించినఁ గీర్తి దేశీయఫలకమున నాచంద్రతారార్కము స్వర్ణాక్షరములతో లిఖియింపఁబడియుండును.

సా—కవిరాజవిరాజితవృత్తము.

హరిహరధాతృ సుపర్వులు నెల్లరునాహవభూమిని నొక్కగుమిన్
సరగున మాగధుఁ బోరవఁగవచ్చిన సాత్యకియొక్కఁడెచాలఁడె
సంగరము నమాగధుసైన్యమహాటవిఁగాల్పఁగనగ్రజ! తమ్ముని దా
మెఱుఁగరె? ధన్వికమిత్రుఁడ నేనని యేటికొ? యింతగఁ జెప్పనిటుల్

కృ—మ. అవుదీవంతటివాఁడవంచు మదిలో నామాత్రమూహింపనే
భువిపై దుష్టనిశాచరాధముల నిర్మూలంబుగావించి ధ
ర్మవిధిన్ శాంతినినిల్పిలోకముల సంరక్షింప గానుంటినే
నవివేకుండనె? నీసహాయమునఁగాదా? బూనితింగార్యమున్

బ—గోపాలకృష్ణా! ఏటికింతదూరమాలోచించుట

కం. బలరామునికంతములో
ఫలజీవములున్నవఱకు ద్వారకపైనే
బలవంతుఁడెత్తివచ్చును
దలకొనివచ్చినజీవితముఁగైకొనునే

కృ—నందనందనా!

ఉ. మాగధుఁడైన నేమి? వనమాలియు శంభుఁడునైన నేమి? స
ర్వాగమవేత్తయైనజలజాసనుఁడైనను నేమి? ద్వారకా
భోగవతీపురంబుపయిఁ బోరొనరింపఁగవచ్చియున్న చో
ఛాగముగొంతుఁ గోయునటు చయ్యనఁగోయనె? వారిగొంతుకల్

కా—అక్రూరా! మీరెల్లరఖిలశాస్త్ర విద్యావిశారదులగుట చేఁగార్యావసాన మెట్లున్నను బ్రస్తుతమెవరికిఁదోఁచినప్రతివల వారుపట్టుచుండిరి. ఇంకమనగతి యేమి? వివాహమైనయైదేండ్లకొక్కసారి మొన్నమా చెల్లెలినిఁ జూడఁ బోవఁగా మఱియొక పూటయుండి వెళ్లుమని మా చెల్లెలెంతబ్రతిమాలినను వినక నాదంతయునిక్కడఁ బడిపోయినట్లు వెంట నేపరుగెత్తికొని వచ్చితిని. రేపుజరగఁబోవు మహాసంగ్రామములో జయాపజయము లెవరికగునో? యామాటఁదలఁచుకొనిన నాగుండెలు బ్రద్దలగుచున్నవి.

అ—కౌశికా! ఏమింతటి జడమతివగుటచేతనే మీరెల్ల రెప్పుడింతగా నెగతాళిఁ జేయుచుందురు.

చ॥ కనుఁగొనలేదో? కృష్ణుఁడనఁగా నెవరంచుఁ దలంచినావొ? భూ
మిని నవతారముల్ పదియుమేయుబలంబునఁ దాల్చి పెక్కు దు
ర్జననికరమ్ములందునిమి శాంతినిదాంతిని బ్రోచునట్టి వి
ష్ణునియవతారమేగద! యశోదసుతుండగు కృష్ణుఁడెంతయున్

అట్టిలోకైకపూజ్యుని చెంతనుండఁగ నీకింకభయమేల? ఒక్కమాగధుఁడేకాదు త్రింశత్కోటి దేవతాగణ మొక్కపెట్టునఁ దలకొనివచ్చినను నీమహామహిమాత్ముని యనుగ్రహమున్న చో మనద్వారకకెట్టి భయమును లేదు.

కౌ—అక్రూరా! నేనా సృష్టికర్తయగు జలజాసనున కేమంత యుపకార మొనర్చితినని నాకీజడత్వమాపాదించవలెను. అనుదినమును

నసేకమంది తాపసోత్తములు చనుదెంచి సాక్షాద్విష్ణు స్వరూపమని నందనందనుని సందర్శించి స్తోత్రములుచేసి పోవుచుండుట నాకన్నులా ఱఁ గాంచుచు నంతలోనే భగవంతుఁడగు నీకృష్ణునిఁ బ్రాకృతమానవుని గాఁ దలఁచి మెలంగుచుందును.

కం— (ప్రవేశించి) యదుకులసామ్రాజ్యప్రదీపికా! నంద నందనా! జోహార్

కృ—కంచుకీ! ఏమి విశేషము?

కం— దేవా: మగధరాజ్యమఁట! యిరువురు మహామహు లు భవదీయదర్శ నార్థమై ద్వారముదగ్గఱ వేచియున్నారు.

కృ—ఆహాహా! కాలమెంతలో నెంతవింతగ మారినది? అ న్నా! బలభద్రా! యింకఁ జూడనేల? దుర్మదాంధుఁడగు జరాసం ధుఁడు తన ప్రబలసైన్యముతో వచ్చి ద్వారకాపరిసరప్రదేశంబుల దండునునిలిపి ముందు మన యొద్దకుఁబంపిన సందేశమును గొనివచ్చిన రాయబారులై యుండనోపుదురు వీరు.

బ—కృష్ణా! వీరు జరాసంధుఁడు పంపిన రాయబారులను చుంటివి. అతఁడు మనకుఁ బంపు సందేశమేమి?

అ—ఏమని? "అనికివత్తురా? సకుటుంబ సపరివారముగాఁ బురము విడచి పోవుదురా?" అని.

బ—(మహాకోపముతో) ఏమేమీ? అకుంఠిత విక్రమధురీణ పారీణుఁడగు బలరాముని యొద్ద కట్టి సందేశమును మాగధునకే కా దు. వాని యబ్బకైన సాహసముండునా? ఒకవేళఁ బంపసాహసించె నే యనుకొందము. కాని వచ్చిన రాయబారి సప్రాణముగా ద్వార క దాటిపోఁగలఁడా?

మ. నను వారింపకుఁడయ్య! మీరలిఁక నన్యాయంబొ? న్యాయంబొ, దో
ల్తనఁగాలాహినిఁ బోలు సీరమునఁ జెక్కల్ సెక్కలం జేతునే
పున నీవచ్చిన రాయబారుల శిరంబుల్ పిమ్మటన్ మాగధా
వని నాథుం బవరంబునందు నిమిభూభారంబిదే పాపెదన్.

(హుంకరించి లేచి పోవుచుండును.)

కృ—(పట్టుకొని) అగ్రజా! శాంతింపుము. శాంతింపుము. రాయబారు లెప్పుడును వధ్యులుగారు వారలను జంపుట ధర్మవిరుద్ధము.

బ—కృష్ణా! నీయిట్టి శాంతవచనములచేతనే మొదటి నుండియు నరులకు మనమన్ననంత చులకన యైనది. ఇంక శాంతించుటకన్నఁ బగతునకు దాసోహమని సిద్వారకను వారల కర్పించి మనము పుత్రమిత్ర కళత్రామాత్య భృత్యవర్గముతో దాస్యమొనర్చుటయే మేలు.

అ—బలదేవా! కృష్ణుని వాక్యము లెంతయు సమాదరణీయంబులు పూర్వము రామాయణాది కాలముల నాఁటినుండియు దూతల వధ్యులుగాఁ బరిగణింపఁబడుచుండిరి. అదియునుంగాక యీవచ్చిన మహామహు లెవ్వరో? మనము వారల మొగంబైనఁ జూడకయే మనలో మనము వితర్కించుకొనుచు వారిని శత్రుపక్షమందలివారినిగా భావించుచుంటి మేనియుఁ బొరపాటు, తుందుడుకు కానున్న దెట్లునుగాక పోదు: కాన వారల వేగముగా రప్పించి యాయుదంత మేమో? తెలిసికొని యనంతర కర్తవ్యమేమో విచారించుకొందము.

కృ—అగ్రజా! యాగ్రహింపక వచ్చి యీయాసనంబున దయసేయుఁడు మన యక్రూరుని వచనము లెంతయు సమంజసముగా నున్నవి. చూడనైనఁ జూడకయే వారల శత్రుపక్షమందలి వారలనుగా నెట్లు భావింపఁగలము? వారల నీసభా

యావృత్తాంతమేమో కనుగొందము. (బలరాముని చెయిబట్టి యాస నముపైఁ గూర్చుండబెట్టి కంచుకితో) కంచుకీ! నీవేగి యామాగధుల నిటు తోడ్కొనిరమ్ము పొమ్ము.

కం—చిత్తము. (నిష్క్రమించును.)

కృ—సాత్యకీ! కృతవర్మా! నూచితిరా! యుద్ధమెట్లయినను నిశ్చయము. ఈక్షణమో? యుత్తరక్షణమో? శత్రువులు మనపైఁబడనున్నారు గావున బురరక్షణము ముందు మనకవశ్యకర్తవ్యమై యున్నది. ఇంక మనము జాగుసేయఁ దగదు. ఈయుద్ధవార్త పట్టణంబునఁ జాటంబనిచి సకల యాదవబలంబుల సమకూర్చుకొని తగుచోట్లఁ దగుబలంబులనునిచి పురముఖద్వార రక్షణార్థమై బలిష్ఠులగు సైన్యములతో మీరిరువురును నిలిచి యప్రమత్తులై కడుజాగరూకతతో మెలంగ వలయు ఓయాదవ వాహినీపతులారా! మీరును సముద్దేశముతో వలయు పట్లనెల్లఁ దగుజాగరూకతతో మెలంగవలయును. సామ్రాజ్య పరిస్థితులన్నియు మీయభిప్రాయములమీఁద యాధారపడి యున్నవి.

కా—కృష్ణా! నీవు నన్నీ కార్యమున నంతగాఁ బేర్కొనకపోయినను నేను మాత్రము శాత్రవులరాక నిరీక్షించుచు నంతఃపురద్వారముకైనఁగా పాడుచుండనా?

బ—సాత్యకీ! కృతవర్మలారా! మీరు సకలయాదవ సైన్యాధిపత్యము వహించి కృష్ణుఁడు వచించినట్లు సత్వరముగా మీవిధుల మీరు నిర్వర్తింపవలయును.

కృ—సాత్యకీ! శత్రువులొకవేళ నతిక్రమించి కోటలగ్గల పట్టిరేని,

సీ. సలసలంగ్రాగు నూనెల బానలాదిగా
రిపులమీఁదను గుమ్మరింపవలయు

నంతగా మీాఱిన హంతకులనుబట్టి
పొడవు బల్లెంబులఁ బొడువవలయు,
బొడువఁగాఁ బైవచ్చు పోటుకాండ్రి శిరంబు
లరయక కత్తులనఱకవలయు
దానికి మించియుఁ దారిసించినవైరి
జనముల గదలచే జమురవలయు.
సకలవిధముల మనకోట శాత్రివాళి
వశముగాకుండునట్లు గాపాడవలయు,
పోయిరమ్మిఁకఁ దమ్ముఁడా! పూర్ణమైన
జయము నీకగునని నిస్సంశయముగ.

సా—అగ్రజా! యనుజ్ఞ నొసఁగుము. వెళ్లివచ్చెద.

కృ—మంచిది. మీాకు శుభంబగుఁగాక వెళ్లిరండు.

(సాత్యకి కృతవర్మలు నిష్క్రమింతురు. మాగధులు ప్రవేశింతురు.)

ప్ర— సీ. రాగవిద్వేష విరాగులౌమునులను
నరయుచుండెడివాఁడ! శరణు, శరణు,
ద్వి— శ్రీవత్సలాంఛనా శ్రితభక్తమందార!
అరికోటిభీకర! శరణు, శరణు
ప్ర—పౌలస్త్యవంశ సంభవ మూలవిచ్ఛేద
జలజాప్తసిభ తేజ! శరణు, శరణు,
ద్వి—దుష్టశిక్షణ! శిష్టపోషణ! ధృతిపాద
సురయక్ష సంస్తోత్రి! శరణు, శరణు
ప్ర—జలధరచ్ఛాయనిభగాత్రి! శరణు, శరణు,
ద్వి—గరుడవాహన! మాధవా! శరణు, శరణు,
ప్ర—శంఖచక్రగదాపాణి! శరణు, శరణు,
ద్వి—సకలలోకైక సంపూజ్య! శరణుఁ శరణు,

ప్ర— సీ. భువనముల్ పదునాల్గు బొజ్జనిల్పినవాఁడ!
భక్తులఁ దరిఁజేర్చు ప్రీతివాఁడ!
ద్వి—అదితికశ్యపులకు నవతరించినవాఁడ!
బలిదౌష్ట్యమణచిన ప్రజ్ఞవాఁడ!
ప్ర—అవనిభారముమాన్ప నవతరించినవాఁడ!
పాముపైఁ బవళించు గోమువాఁడ!
ద్వి—నీలసన్నిభమైన నెమ్మేనుగలవాఁడ!
డంబైన నెమలిపించంబువాఁడ!
ప్ర—పాదరజమున నొకరాతిఁ బడఁతిఁజేసి
కిన్నరామరనుతులు గైకొన్నవాఁడ!
ద్వి—యదుకులాంభోధిచంద్ర! దయామయుండ!
ప్ర—శరణు, శరణయ్య! ... ...
ద్వి— ... ... మాధవా! శరణు, శరణు,

కృ—(స్వగతము) ఇదియేమి? వీరి స్తోత్రపాఠమును జూడ జరాసంధునిచేఁ బంపఁబడిన దూతలువోలెఁ గాన్పించుటలేదు. వీరివైఖరింగాంచ నాదుర్మార్గునిచేఁ గలుగుబాధలు భరింపఁజాలక మదీయ సహాయమపేక్షించి వచ్చిన తత్పౌరులువోలెఁ గాన్పించుచున్నారు. కానిమ్ము, వీరి యాగమనకారణంబడిగి యరయుదుఁగాక! (ప్రకాశము) ఓయీ! మీ రేదేశనివాసులు! ఎవని యేలుబడిలోని వారలు?

మా—దేవా! మేము మగధదేశనివాసులము. జరాసంధుని యేలుబడిలోని వారము.

కృ—మీరు మాద్వారకాపురమున కెప్పుడే తెంచితిరి?

మా—దేవా! భవదీయ దర్శనార్థమై చిరకాలమునుండి వేచియున్నారము.

కృ—(స్వగతము) అట్లైన జరాసంధుఁడొనర్చు ప్రియత్నము వీరలెఱింగియే యుండరు. వీరిని దద్వృత్తాంతమడిగిన నేమి ప్రయోజనము? (ప్రకాశము) మీనామధేయము లేమి?

మా—మేమీరుపురము మా దేశవాసులచే రామ్. రహీమ్" అని పిలువఁబడుచున్నాము. పెద్దవాఁడనగు నాపేరు రామ్ నాసోదరుఁడగు నితనిపేరు రహీమ్.

కృ—(అచ్చెరుపాటుతో) ఆహా! మాగధ మతాచార విరుద్ధమగు రామశబ్దము నీనామధేయమున నెట్లు మిళితమయ్యె? నీవీ రామనామము ధరించుట కడుంగడు వింతగా నున్నది. ఇదియునుంగాక మీవినయ విధేయతలును, మీభాషా మాధుర్యమును నాకుఁ జూడం జూడ నుత్తమ విద్యగడించి బ్రహ్మజ్ఞానము తెలిసికొనిన బ్రాహ్మణులవోలె గనంబడుచున్న వారు. మిమ్ముఁగాంచినప్పటి నుండి మీయెడల నాహృదయంబున సౌభ్రాతృప్రేమ ముదయించినది. మీరీయెడ నెటువంటి కార్యమునకుఁగాను నాసాయమపేక్షించినను దప్పక మీకష్టములు నాకష్టములుగా భావించి నాసర్వస్వమును మీకై వెచ్చించి తత్కార్య మమోఘముగా నెఱవేర్పఁగలవాఁడను. ఇందుఁ దప్పితినేని గురువుల యాజ్ఞఁ దప్పినదోసంబు జెందినవాఁడనగుదును. కాని; మీమత విరుద్ధమైన రామనామమీ వెట్లుధరించితివో ముందుగాఁ దెలియఁజేయుము.

రామ్—మహాత్మా! దేవకీనందనా! అన్యులమంచు మాయెడల ననాదరణఁజూపక సోదరభావమున మమ్మాదరించి మాకష్టముల గట్టెక్కింపఁ బ్రతినఁగైకొనిన నీ పరమదయాళుత్వమున కేమింతయుఁ గృతజ్ఞులము. ఓశాంతప్రియా! ప్రాచీనసాంప్రదాయసిద్ధమైనట్టియు, గౌరవముగలట్టియు ఘనమగు నొక యుత్తమ మాగధవంశమునకు మేము చెందినవారము. మేము జన్మించిన యులంతి కాలములోనే, మా

దురదృష్టవశముననో యతనియదృష్టవశముననో మాజనకుండు నమ్మెల్లర దుఃఖవార్థినిమగ్నులఁగావించి తానుత్తమలోకమునకేగె. నాఁటఁగోలె మాయమ్మ మాకుఁబోషకురాలగుటయే కాక యించుక లోకవ్యవహారములందుఁ బరిచయముగలిగించుకొని మా యేలికపాలనాపద్ధతిని సక్రమమార్గమున నడిపింప నెన్నటికయిన యనుమాగధమైత్రియే మూలాధారమనియెంచి సర్వమతసమాదరణీయురాలై యీయుభయమతంబులందలి యంతఃకలహంబులఁ బోఁద్రోలి మైక్యమొనరింప సర్వమతస్థాపనాచార్యుఁడగు రాముని నామము నాకును మాగధమతాచార సమ్మతమగు రహీమ్‌నామము మాతమ్మునకును బెట్టి యుభయమతంబులపైఁ దనకున్న యసమానప్రేమ వెల్లడించె. నాఁటినుండియు మేమిరువురము మా దేశవాసులచే నట్లుపిలువఁ బడుచుందుము.

కృ—సర్వజనపూజ్యురాలగు మీతల్లి పైశాచరాజ్యమూలవిచ్ఛేదనాకౌతూహలోపేతమానసులగు మాదృశులకునైత మాదర్శప్రాయురాలు. అట్టి పతివ్రతామతల్లులుండుటఁ బట్టియే సర్వధర్మములు నశించినను నింక నీలోకము వనధిఁగలియక యెట్లో నిలచియున్నది—

ప్ర—మాధవా! మేము మాయమ్మ చెప్పినచొప్పున సర్వధర్మములందును సమానమనస్కులమై యల్లారుముద్దుగాఁ బెరిఁగి ప్రాపంచికధర్మమార్గమున నఖిలశాస్త్రములఁ గొల్లబుచ్చి యుత్తమవిద్యలనారితేఱియుండియు మాజరాసంధుఁడొనర్చు నైజకదుశ్శీలతావిషయమున మాకుఁగల స్వధర్మనిర్వాహకకృత్యములయందింతయుఁ బాలుఁగొన శక్యముగానివారమై తదనుకూలములగు ప్రయత్నములఁ జేసిచేసి విసిగి వేసారి భగ్నమనోరథులమై సకలజగద్రక్షకుండవగు నీవు దుష్టశిక్షణంబొనరించి భూభారంబును బావ యనుకులంబునఁ బొడముట

మొఱంగినవారమై మాబాధలఁ బాపికొన భవదీయశరణము గోరి వచ్చినారము.

ప్ర— సీ. శిక్షించినను నీవె రక్షించినను నీవె
దీనులమగు మమ్ము మాననీయ!
ద్వి— దూషించినను నీవె భూషించినను నీవె
యర్థులమగు మమ్ము నబ్జనేత్ర!
ప్ర— కాయకున్నను నీవె కాయ నెంచిన నీవె
భక్తులమగు మమ్ము బద్మనాభ!
ద్వి— బ్రోవకున్నను నీవె బ్రోవ నెంచిన నీవె
కష్టముల్పడు మమ్ము గరుడగమన!
ప్ర— వచ్చినారము నీదరిఁ జొచ్చినాము
మమ్ము రక్షించు భారము మాన్యచరిత!
నీదె సుమ్మిఁక నేరీతి మాదు బన్న
ములను దీర్పఁగా నెంతువో ? పుణ్యపురుష !

(కృష్ణుని పాదములపయి నొరగుదురు)

కృ— (చేసన్న చే లేవఁదీసి) ఓయీ! మీరింతమాత్రమునకే యింత బెగ్గిల నేల ? కష్టసుఖములు దైవాధీనములు ఒక్కొక్క సమయమం దెంతెంతటివారలకైన విధివశంబునఁ గష్టంబులను భవింపక తప్పదు.

సీ. శ్రీరామచంద్రుండు సీతతో వసియించె
వనములఁ బదునాల్గు వత్సరములు
రాజ్యంబు నొకముని రాజునకిడి హరి
శ్చంద్రుఁడు వనముల శ్రమలు పడెను
నిషధేశుఁ డలకలి మిష చేత సతిఁ బాసి
కుడిచెను బన్నంబు లడవులందుఁ
మేరుగహ్వరముల మెలఁగెను బలు పారు
లరులదాడికి నోడి యమరవిభుఁడు,

అంతదూరముపోనేల ? యనఘ ! మేము
విధివశంబునగాదె ? మామధురవిడిచి
నడిసముద్రంబునందునీ నగరుఁగట్టి
కాలమొకరీతినెట్టులో గడపుకొనుట

రామ్—నందనందనా ! జగన్నాటకసూత్రధారి వగు నీవొక ప్రాకృతమానవుఁడువోలె "విధివశమ్మున నేనుఁగూడ బాధలనుభవింపక తప్పకపోయె" నని చెప్పి మమ్మూరడిలఁ బలుకుటయే న్యాయము? నీ లీలలు గనుఁగొన బ్రహ్మాదులకైన శక్యమా?

సీ. మొసలికోరలఁజిక్కి పసదూలివిలపించు
గజరాజునేలిన ఘనుఁడవీవె
కఠినుఁడైనహిరణ్యకసిపునిఁదెగటార్చి
ప్రహ్లాదుఁబ్రోచిన ప్రభుఁడవీవె
అమరహితంబుగా నదితిగర్భంబునఁ
బొడమినకడుఁ బొట్టివడుగువీవె
వాలినివధియించి వనచరరాజ్యంబు
రవిజునకిడినట్టి రాజువీవె
దేవదానవయుద్ధంబు దీర్పనెంచి
మోహినీస్వరూపంబు బ్రమోదమలర
దాల్చియమృతంబుఁ బంచినధన్యువీవె
కృష్ణుఁడవీవె శ్రీమహావిష్ణువీవె

ఇట్టిమాయామానుషవిగ్రహమగు నీమాయఁగనుంగొన మేమెంతటి వారము. ఈచతుర్దశభువనంబులలో నీవెఱుంగని న్యాయంబును నీకుఁ దెలియని పరమార్థమును నిక జేయమగు కార్యము నొంకుగలదా ? కాన మమ్ముఁ బగతునియేలుబడిలో నివారముగా భావించి కేఁగంటఁజూడక మమ్మురక్షింప మేమిదే ప్రార్థించుచున్నారము.

కృ సీ. కలలోన నైననవ్వులకైన నసృతంబుఁ
బలుకక సత్యంబుఁ బలుకుటొకటి
జాతిభేదము లేక సమరీతి నెల్లర
సోదరప్రేమతోఁ జూచుటొకటి
సకలకష్టంబులు సంభవించినఁగాని
న్యాయమార్గంబున నడచుటొకటి
ఉర్విపయినన్నిట నుత్తమమైన కరి
శంసనీయమగు నహింసయొకటి
భవ్యతరమైన శాంత భావంబదొకటి
కలిగి పంచాంగములతోడ వెలయుచుండఁ
బూర్వకాలంబునుండియుఁ బుణ్యమయిన
మంచిమార్గంబుఁ గాంచిన మించుసుఖము

కంచుకి—(ప్రవేశించి) దేవకీగర్భసంజనిత ముక్తాఫలమా? జోహారు.

కృ—కంచుకీ! విశేషములేమి?

కం—విదర్భభూమినుండి యొకద్విజకులసంభూతుఁడు భవదీయదర్శనార్థమైవచ్చి ద్వారముకడ వేచియున్నవాఁడు

కృ—సత్వరముగా వారినిటకుఁదోడ్కొనిరమ్ము

కం—చిత్తము-(నిష్క్రమించును)

రామ్—దేవా! మాకు సెలవొసంగుము.

కృ—మంచిది,

(మాగధులిరువురు నిష్క్రమింతురు)

బ—గోపాలకృష్ణా! నాకు దేవీపూజవేళయైనది నేను వెళ్ళివచ్చెద.

(బలరాముఁడు అక్రూరునితో నిష్క్రమించును)

బ్రా—(ప్రవేశించి)

సీ. శతకోటిరవి తేజ జితమన్మథాకార !
శతపత్రదళ నేత్ర ! జయము జయము
అరివీరమదమత్త కరిబృందపంచాస్య !
సకలసద్గుణధామ ! జయము జయము
శంఖసన్నిభ నేత్ర ! శార్ఙ్గగదాహస్త !
సకలలోకేశ్వర ! జయము జయము
ఇందిరాహృత్ప్రియా నందసంధాయక !
సర్వపాపవినాశ ! జయము జయము
జానకీనాథ ! శ్రీరామ ! జయము జయము
సంగరప్రమ ఖాద్భుత ! జయము జయము
శ్రావ్య వేణుగానవిలోల ! జయము జయము
శాంతిపోషణ ! మాధవా ! జయము జయము

కృ—ద్విజకులసంభూతా ! నమస్కారము. ఈపీఠమలంకరింపుఁడు

బ్రా—ఆయురారోగ్యైశ్వర్యాభివృద్ధిరస్తు. శీఘ్రమేవవివాహసిద్ధిరస్తు

కృ—ఆర్యా ! తమ దేదేశము? తాముదయచేసిన కార్య మేమి?

బ్రా—నందనందనా !

చ. కలదువిదర్భదేశము జగంబున నన్నిఁటవృద్ధిఁగాంచి భూ
వలయమునందునం దిప్రపుర వైరికిన్నైన నజేయమైహారిం
బలుకుల రాణకున్కియయి పట్టణరాజముకుండినాఖ్యచే
వెలయుచునుండుఁ దత్పురిని వీరుఁడు భీష్మనృపాలుఁడేలెడున్

అట్టివిద్యాధరపురకర సంవాసమైన కుండిన నగరాధీశుఁడగుభీష్మకనృపాలుని యేలుబడిలోనివాఁడను. నేవచ్చిన కార్యమును జెప్పెద సావధానముగాఁ జిత్తగింపుము.

కృ—మంచిదివచింపుము.

బ్రా—క. మాంరాజగర్భమందున
 శూరులుజన్మించినారు సుతులైదుగురు
 వీరవతంసమ! తమపరి
 శ్రీరమణీరూపమొక్క చిన్నదివొడమెన్

అంతనాబాలిక.

గీ. పర్వతేంద్రునిముద్దుల పట్టిలాగు
 బాలవారాశిగారాలబాలలీల
 భీష్మకునియింటనాబాల పెరిగెనయ్య!
 శుక్లపక్షంబునందలి సోముపగిది

ఇట్లుకన్నవారలకల్లారు ముద్దుగా నాబాలికదినదినప్రవర్ధమానయయి గురుకులవాసముంది.

సీ. ఆంధ్రగీర్వాణ ముఖ్యాఖిలభాషల
 ఘనమయినపాండిత్యమును గడించు
 మకరందనిష్యంద మాధురీపరిపాక
 మునమించుమంచికై తనురచించు
 గానకళాశాస్త్ర కౌశలంబందున
 నలరితాఁ గలుగు నట్లుచేయఁ
 గాంచినయంతనే కౌతుకంబుదయింప
 రమణీయమయినచిత్రములువ్రాయు
 సంగరాంగంబునందుఁ బ్రశస్తముగను
 నరులబీచంబులణఁచు వ్యూహములఁబన్ను
 నన్నివిద్యలుఁబూర్తిగా నభ్యసించె
 సకలసాధ్వీమతల్లి సూచంద్రవదన.

ఇట్లా బాలికయఖిల విద్యాపరిపూర్తితోఁ బాటు యుక్తవయఃపరిపూర్ణ రాలై యబ్ధినాథునియొద్ద నాదిలక్ష్మివోలె భీష్మకమహారాజునొద్ద నా బాలికయుండ నొక్కనాఁడు బ్రహ్మమానసపుత్త్రుఁడగు నారదుఁడే తెంచి ప్రస్తావనవశమున సకలజగద్రక్షకుఁడనగు నీవు యదుకులంబు నఁబుట్టి యుండుటయు, నీరూపరేఖాలావణ్యాదులను వర్ణించి యీ చిన్నదానికా గోపాలకృష్ణుఁడే తగినవరుఁడనియు సత్వరముగా నాత నికిచ్చి వివాహముఁ జేయుఁడనియు మారాజుగారితోఁ జెప్పి వెడలిపో యెను.

గీ. అంతనామౌనిపలుకున కాత్మయందు
గలఁగియాఱేఁడు సఖుల, బంధులను మంత్రి
జనము నెల్లర రావించి సంతసమునఁ
జెప్పియావార్త మీమాటఁ జెప్పుడనిన

నీతోడ బాంధవ్యమునకు వారెల్లరత్యంత సంతోషస్వాంతహృదయు లై కర్తవ్యముగా వల్లెయని వారలయభిప్రాయములు వెలిపుచ్చినం తనే మాయేలిక సంతసించి నిజపురోహితుని దమసన్నిధానమునకుఁ బుత్తెంచెదఁ చునంతలో యువరాజగు రుక్మియను మారాజకుమారుఁ డు తమతోడి బాంధవ్యమున కియ్యకొనక తనసోదరిని శిశుపాలున కిచ్చెదనని కఠినముగాఁ బలికి తద్వివాహప్రయత్నముఁ గావించి య చిరకాలముననే లగ్ననిశ్చయముఁ జేసె.

కా—అయ్యో! ఏటికింతగొడవ? మన్మారక విసిగింపక తా ముదయచేసిన కార్యమేమో సెలవిండు.

బ్రా—అయ్యా! తమకీశ్రమకలుగఁజేసినందులకు క్షమియింపుఁడు.

కృ—బ్రాహ్మణోత్తమా! గురుజనసహవాసములేని యీ బ్రహ్మచారిపలుకులతోఁ దమకేమి? మిగిలిన మీకథాభాగమును బూర్తిచేయుఁడు—

బ్రా—సోదరుఁడు శిశుపాలునకుఁ దన్నొసంగెదననుటయు, వివాహలగ్నము నిశ్చయించుటయుఁ జెలికత్తెలవల్ల విన్నదిమొదలింతవరకన్నపానీయముల నైతము వర్జించి శిశుపాలుని యుత్తమాంగముపైఁ దనవామపాదాంగుష్ఠమైన మోపనని దీక్షఁ బూని సంతతభవదీయ పదపద్మధ్యానపరతంత్రయై నన్నుఁ బిలిచి యీయుదంతముఁ దమకెఱింగించి మిమ్ముఁ దోడ్కొనిరమ్మని నన్నుఁ బుత్తెంచెనిప్పట్లఁ దమరు మిక్కిలి శ్రద్ధవహించి చైద్యమాగధుల నిరుపురనాబాల్య స్నేహితుల నన్యోన్యానుకూల దుష్టమూర్తులవంచించి యీబాలికను గరగ్రహణ మొనరింపవేని యీమెయింక జీవించుట కల్ల. మఱియును నేవచ్చున మయమున నీమ్రోలఁ దన పలుకులుగా నిట్లు చెప్పుమనియె.

సీ. శరణాగతత్రాణ బిరుదంబునిలిపికోఁ
జాలినదగినదీ సమయమనుచు
దుష్టులఁ దునుమాడి శిష్టులఁ గాపాడ
నెంచిన సదసరు దెంచెననుచు
ధరణి మీఁదను బూర్వ ధర్మముల్ నెలకొల్పఁ
దలచినసియ్యదే తరుణమనుచు
భక్తులముంగొంగు బంగార మనుమాట
సార్థకంబొనర్చ సలుపుమనుచు.
ప్రాణమానంబులెల్ల నీకరము సేసి
చిత్తమంతయు నీపయి హత్తియున్న
దిక్కులేనట్టినావంటి దీనురాలిఁ
బ్రోచుటేమెక్కువయునట్టి పుణ్యమనుచు.

నందనందనా! ఇట్లువచించి యీలేఖతమకొసంగుమని యిచ్చె. (లేఖ నొసంగును.)

కృ—(పుచ్చుకొని) కౌశికా! దీనిని జదువుము.

కౌ——మంచిది (లేఖఁదీసికొని యిట్లు చదువును.)

మహారాజరాజశ్రీ వీరాధివీర బిరుదాంకితులును, మన్మనఃప్రియులును నగు శ్రీకృష్ణభగవానుల చరణరాజీవముల సన్నిధికి. యస్మదనురాగ ముఖ్యస్థానమగు రుక్మిణివ్రాసి పంపికొన్న విజ్ఞాపనము.

మ. జననంబందిన దాదిగా నెపుడు నీసంసేవయే తెప్ప కో
యనఘాత్మా! కలనైననే నెఱుఁగ నన్యంబుల్, గజేంద్రాది స
జ్జనరక్షాపరతంత్ర! యోవరద! యీశా! ప్రోవవా? నన్ను దు
ర్జనుఁడౌ చైద్యునిబారినుండి కృపతో శాంతిప్రియా! మాధవా!

ఉ. భారమటంచు "నాకరముఁబట్టుటనీ" కనియెంచి యాత్మలో
నూరకయున్నచో నసువులుండవు దేహమునందు. నింక నో
నీరజనాథ! నీకొఱకు నిల్పితిఁ బ్రాణములింతదనుక నే
తీరునఁ జైద్య మాగధు వధించి రణస్థలి నన్నుఁ బ్రోతువో?

సీ. తలఁచినమాత్రాన స్తంభమందుదయించి
ప్రహ్లాదుఁ బ్రోచిన ప్రభుఁడవనియు
శరణన్నమాత్రాన సత్వరంబుగ నేగి
విహగేంద్రు నేలిన విభుఁడవనియు
యాచించినంతనే యోచింపకింతయు
రవిసుతుఁ గాచిన రాజవనియుఁ
బ్రార్థించినంతనే బలిగర్వమణఁచఁగా
బాలుపునదితికిఁ బుట్టితనియు
గురుజనంబులవల్ల నే నెఱిఁగియుంట
శరణు వేఁడితి రక్షింప జలజనయన!
కాచినను గాయకున్నను గాని నాదు
భారమంతయునీది యే పద్మనాభ!

కా—(కొంచెముండి) నందనందనా! పాపమాచిన్నది లిఖించిన జాబులోని యంశములనుబట్టి యెట్టికఠినహృదయునికైనను జాలి కలుగక మానదు.

కృ—కౌశికా! యీచిన్నదానినిగూర్చి నీవు గ్రహించిన సారస్య మిదియా? స్త్రీజనస్వభావసిద్ధమైన జాలికరమగు నంశ మొకింత జాబునందుఁగానవచ్చినను బ్రాహ్మణోత్తముని ముఖతః పంపినభావోద్రేకమగు సందేశమును జూడ నాకచ్చెరువగుచున్నది.

కా—మాధవా! యందేమి యాశ్చర్యమున్నది? దుష్టశిక్షణ శిష్టరక్షణ ప్రధానుఁడవగు నీకుఁ బంపవలసిన సందేశమునే పంపినది,

కృ—ఏమీ! దేశహితైకమార్గమునందించుక మందగమనముతో నేగుచున్న నాకు ద్విగుణీకృతోత్సాహము గలుగఁజేయు లోకకళ్యాణకరమైన సందేశమంపఁగల యీసామర్థ్యమేమని వక్కాణింతును? కానిమ్ము ఆపదలపాలుగానున్న నీవంటికన్యామణిని గాపాడఁగలిగిన నాఁకుగదా! నాయీపురుషజన్మ సార్థకమగుట.

క. సురయక్ష గరుడకిన్నర
నరవాహను లెల్లఁగూడి నన్నుఁదాఁకిననే
దూరమున వారల మరలిచి
కరిగమనా! నేనునిన్నుఁ గైకొందుఁదరుణీ

కౌశికా! ఇంతనీయభిప్రాయ మేమి? ఏమనెదవు?

కా—అఖిలజగద్రక్షకుండవగు నీక జేయుమగు కార్య మెందుగలదా? ఈయమను శత్రువులబారినుండి రక్షించుట నీకొక లెక్కయా?

కృ—బ్రాహ్మణోత్తమా! వివాహమునకింకెన్నిదినములు వ్యవధికలదు?

బ్రా—దేవా! యింకవ్యవధియెక్కడ? ఈశుక్లదశమీ జయవాసరమేకదా?

కౌ.—అయ్యా! నేఁడష్టమిగదా! మధ్యరెండుదినంబులైన వ్యవధి కన్పించుటలేదు.

కృ—కౌశికా! దైవానుగ్రహమున్నచో నీవ్యవధిచాలదా? దమయంతి ద్వితీయస్వయంవరమని తెలిసికొని ఋతుపర్ణునితోఁ గలిసి నలుఁడు అయోధ్యనుండి భీమపురమునకుఁ బ్రయాణము చేసినది యొక్కయిరువదినాలుగుగంటలేకదా!

బ్రా—దేవా! ఇంకనాలస్యమేల? కుండినపురప్రయాణావసరపరికరాలంకరణముల నంది సత్వరముగా బయలుదేఱుఁడు.

కృ—కౌశికా! ఈవివాహసంరంభములో నున్న చైద్యమాగధులింక మనపై దాడివెడలివచ్చుటకల్ల! వారలతో మనకీయెడ జరుగవలసిన దారుణసంగ్రామము రేపుకుండినపురమునందు జరుగును.

కౌ—బ్రాహ్మణోత్తమా! అంతయుబాగుగనే యున్నది. కాని మీరా కొమార్తె రూపరేఖాలావణ్యాదులఁ గూర్చి యేమియుఁ జెప్పవైతివేమి? ఇంతకామె సౌందర్యవతి యేకదా!

బ్రా—అయ్యా! యీచిన్నది, నాయొద్దనే విద్యాభ్యాసముం జేయుటఁబట్టియు నాకుఁ బుత్రికాసమానురాలగుటఁ బట్టియుఁ బతివ్రతా మతల్లుల సౌందర్యాది విశేషము లన్యులువర్ణించుట మహాదోషమగుటంబట్టియు నేనాచిన్నదాని సౌందర్యమునుగూర్చి మీకేమియుఁ జెప్పఁజాలనందుసకు క్షమింపుఁడు; కాని; నేవచ్చువేళ నామెచిత్రపటముమాత్రముఁ గొనివచ్చితిని.

(చిత్రపటమును కృష్ణునిచేతికిచ్చును.)

కృ—కౌశికా! ఇంకనాలస్యమెందుకు? ఈబ్రాహ్మణోత్తముని విడిదికిఁబంపించి యీవార్త బలదేవ సాత్యకీ కృతవర్మలతోడను సక

లయాదవబలంబులతోడను జెప్పి నీవును గుండినపుర ప్రయాణసన్నద్ధుండవై యుండుము.

కా—చిత్తము. (కౌశికుడు బ్రాహ్మణుడు నిష్క్రమింతురు)

కృ—(చిత్రపటమును జేతఁగొని) ఆహా! ఏమీ చిన్నదాని జగన్మోహనాకారము!

ఉ. చూచితి నిర్జరాంగలఁ జూచితి సిద్ధవధూలలామలన్
జూచితి నాగకన్యకలఁ జూచితి యక్షసుసిద్ధభామలన్
జూచితి గోపబాలికలఁ జూచితిఁ గింపురుషాది రామలన్
జూచినవారిలో నెచటఁ జూచితి? నింతటి సుందరాకృతిన్

శా. ఆకర్ణాంతము కన్నుదోయి ముఖమాయబ్జమ్మునుం దాఁటు శ్రీ
శ్రీకారంబులఁ బోలు కర్ణయుగముం జెల్వాఱుమై కాంతి పల్
కాకల్ దీరిన కుందనంపుగరిమన్ ఖండింపఁగాఁ జాలెడున్
గాకోలంబుల తీరుఁ గేరఁదగు నీ కాంతాశిరోజంబులున్

సీ. లవలీదళంబుల నవగుచికన్నను
జెలఁగుచున్న వీదీని చెక్కుఁగొనలు
నీలోత్పలంబుల నిగనిగల్ నిరసించి
భాసిల్లుచున్న వీ భామకనులు
పట్టుదాళిచ్ఛాయ సరకుసేయక నవ్వి
యొప్పుచునున్న వీ యువిదబొమలు
బింబారుణచ్ఛాయపీచంబు దిగఁద్రావి
మెఱుగారుచున్న వీ చిఱుపెదవులు
కుసుమగుచ్ఛంబులను మించు గులుకుగుబ్బ
లహహా! యీయందమీచంద మబ్జభవుఁడు
దీని నెట్టులఁ జేసెనో? తెలియదరమె?
లేదు దీనిని బోలెడు లేమయుందు.

కంచుకి—(ప్రవేశించి) భక్తజనపరాయణా! నందనందనా! జోహారు.


కృ—కంచుకీ! విశేషములేమి?

కం—దేవా! కృతవర్మయు నక్రూరుడును బలదేవుడును సకలయాదవవాహినీపతులును. ప్రయాణోత్సాహులై యున్నవారు తమదే యాలస్యము.

కృ—ఓహో! ఇదియేమి? నేను లేనిపోని చింతలపాలై ప్రస్తుతకర్తవ్యమును మఱచితి. నేనింక జాగుసేయతగదు. కంచుకీ! రమ్ము వారలం జేరుదము.

కం—చిత్తము. (ఇరువురు నిష్క్రమింతురు)

ఇది తృతీయాంకము.



వైదర్భీపరిణయము.

చతుర్థాంకము.

(సౌధోపరిభాగంబున రుక్మిణి, హేమలతలు ప్రవేశము)

రు — హేమలతా! ఏటికి! నీకింక నీయడియాసలు? నాకర్మగతికి మీరేమి సేయఁగలరు? బలవన్మరణము నొందుమని విధాత నానొసట వ్రాసియుండఁగా దద్వ్యతిరేక మెట్లుజరుగును?

హే — అమ్మా! రాజపుత్రీ! నీవు కాదన్న నేనేమియుఁ జెప్పఁజాలను గాని భక్తజనపరాయణుఁడగు నారాయణుఁడు నిన్నన్యాయ్యమెన్నఁటికిని జేయఁడు తప్పక నిన్నతఁడు రక్షించియే తీరును.

రు — వెఱ్ఱిదానా! ఇఁకనిన్నా యాశాపిశాచము విడువకున్నది నేనేయదృష్టవంతురాలనైనచో నీకథయింత దూరమేల వచ్చును? నాప్రాణమొకవేళ నాగోవిందుఁడు రక్షింపలేక పోయినను నామానమును మాత్ర మిదిగో ఈనాముద్దుటుంగరములోని వజ్రము గాపాడఁగలదు. నాకింక నీప్రపంచముతో సంబంధము దీఱిపోయినది. చెలీ! నాయందలి వాత్సల్యముచే నాకృత్యమునకు మాత్రము నీవడ్డురాఁబోకుము. నీదారిని నీవుపొమ్ము. ఇంక నాకర్తవ్యమేమో నేనిదే నెఱవేర్చుకొనియెద.

హే—అయ్యయ్యో! తల్లీ! నీవంత సాహసమునకుఁ గడంగెదవా? నీవొక వేళ బలరభంగి యేమైన మేమింకెచటికేగి యెవరి మోముఁ జూడఁగలము

చ. తనువున జీవముల్ గలుగఁ దల్లిరో! నేనినుఁ బాసి యే విధిం
జనఁగలదాన నీదు పదసన్నిధిఁ బ్రాణములం ద్యజింతు నా
మనవిని బ్రోవుమమ్మ! యనుమానము వీడఁగదమ్మ! దేవకీ
తనయుఁడు వచ్చునమ్మ! నినుఁ దప్పక ప్రోచుఁగదమ్మ యుత్తమా

రు—హేమలతా! నాయందలి యనురాగాతిశయముచే నన్నారడిలఁ బలుకుటకు నీవిట్లు చుంటివి; కాని యిందలి యథార్థము నీవు మాత్రమెఱుంగఁజాలకుంటివా?

ఉ. వచ్చెను బంధుజాలము వివాహ నిమిత్తము మిత్రులెందఱో?
వచ్చిరి చైద్య మాగధులు వచ్చిరి కెందఱో? పార్థివోత్తముల్
వచ్చెనె, దేవకీసుతుఁడు వారిజలోచన! యింక నెప్పుడో
వచ్చునటంచుఁ బల్కెదవవశ్యముగా నిన వేటి మాటలే?

చ. జరిగిన దానికిన్ వగవ సారసగంధి! మదీయ జన్మ నీ
వరుస నిరర్థకంబనుచు బ్రహ్మ లిఖించె నుమ్మింతుగాని యి
త్తఱిఁ దగు సాటి రాకొలము దద్దయు మెచ్చికొనంగ నిప్పుడే
జరిపెదఁ దద్విధానము విచారము నొందక నీవు నేగుమా

హే—అమ్మా! సాటి రాకొలము మెచ్చికొనునట్లు నేనేదో యొక దారుణ కార్యమునకుఁ గడంగెదననుచుంటివి. అది సాహసమని పించుకొనునుగాని సౌమ్యమార్గమని పించుకొనదు. ఇదియే యుత్తమపతివ్రతాలక్షణము?

రు—ఓసీ! హేమలతా! నీ వెంత వెఱ్ఱిదానవే! నేను జేయు కార్య మెన్నటికిని సాహసమనిపించుకొనదు. ఇదియే యుత్తమ పతివ్రతాలక్షణము.

హే—ఆగుమాగుమెవరో? వచ్చుచున్నట్లున్నారు.

(మంజువాణి ప్రవేశించును)

హే—అమ్మా! రుక్మిణి! మనమంజువాణి తప్పక శుభవార్తయే తెచ్చినది.

రు—వెఱ్ఱిదానా! మంజువాణి ముఖవైఖరింగాంచ శుభవార్తలుగొని వచ్చినట్లేయున్నది.

హే—మంజువాణీ! యేమే! యట్లే యూరకున్నావు? గురువుగారి జాడ యేమైనఁదెలిసినదా?

మం—హేమలతా! ఊరకొనక నేనేమిచెప్పను? గురువుగారి యింటికి వెళ్ళి "యాయనవచ్చినారా?యని యడుగఁగా రా లేదనిరి.

హే—గురువుగారి యింటికి వెళ్లి వచ్చుటకే యింతయాలస్యమైనదా? ఇంక నీవెట్టిశుభవార్తలు తెచ్చెదవో యనిమేము నీకొఱకె దురుచూచుచుంటిమి.

మం—అచ్చట నొక్కచోటనే యుంటిననుకొంటివా? నేఁటివివాహమునకుఁ దండోపతండములుగ నెడ తెగక యేతెంచుచున్న బంధుమిత్రసామంత రాష్ట్రాధిపతులచేఁ బట్టణమంతయు బహుజనాకీర్ణమై యుండుటచే రాజమార్గముల నేగుట బహుకష్టతరముగా నున్నదు మెల్లఁగనట్లేయేగి బలరామకృష్ణులే తెంచిన జాడయేమైనఁ దెలియునేమోయని పట్టణమంతయు వెదకితిని.

హే—మంచిపనిజేసితివి; కాని వారి జాడ యేమైనఁ దెలిసినదా!

మం—లేదే! వారిజాడ యేమియుఁ దెలియలేదు. వారింతవఱకు వచ్చినట్లే తోఁచదు.

రు—హేమలతా! నీవెంతయమాయకురాలవే? ఇంకను వారు వచ్చునని నేడునాళ నిన్నువదలకున్నది.

మం—అమ్మా! నీవట్లు తలంచవలదు వారురాని పక్షమున మన గురువుగారైనవచ్చియుందురు దీనిఁబట్టి వారు తప్పక వచ్చితీరుదు రనియెంతలంచెద.

హే—మంజువాణీ! ఇంతవఱకేయే దేశాధీశులేతెంచిరి?

మం—

మ. కురునాథుండును, సింధుభూపతియు, నాగుజాద్రిక్ష్మాహీశుండు, శ్రీ
వరుఁడావంగనృపాలశేఖరుఁడు, మల్హారావనీనాథుఁడున్
సరసాగ్రేసరులాంధ్రకన్నడనృపుల్ క్ష్మాపాలురానింకనెం
దఱో? రాజుల్ సనుదెంచిరిప్పటికి మోదంబొప్పఁగా నెచ్చెలీ!

రు—మంజువాణీ! కురునాథుఁడంటివే? యెవరు? దుర్యోధనుఁ డేనా?

మం—ఔను కర్ణ, గాంగేయ, కృప, ద్రోణాశ్వత్థామ పరివృతుఁడై ప్రబలసైన్యముతో దుర్యోధనుఁడరుదెంచె.

రు—అయ్యో! ఈవచ్చిన వారిలో మూఁడువంతులవారు చైద్యమాగధపక్షములోనివారే యొకవేళ గోపాలదేవుఁడేగుదెంచినను బల్లిదులగు నీశాత్రవాళిమధ్యనన్నెట్లురక్షింపఁగలఁడు?

హే—పాండవేయులలో నెవ్వరైనవచ్చియున్నవారలా?

మం—ఇంతవఱకు వారలెవ్వరు వచ్చినట్లు కాన్పించదు. ఒకవేళ భీమార్జునులేతెంచిన శ్రీకృష్ణసహాయులై యాతని తోడనే వత్తురు.

హే—

తే. గీ అర్జునుండనగృష్ణుని ప్రాణమంచుఁ
జెప్పికొందురు లోకులీక్షితిని జాల
నట్టి గాండీవితో జగజెట్టియైన
వాసుదేవుండు తప్పక వచ్చునమ్మ.

అట్టికృష్ణార్జున పరిపాలితంబగు యాదవబలంబును జయింప హరిహరాదులకైన శక్యముగాదు. అట్టియెడ నీదుర్యోధనాదులును, జైద్యమాగధులును వారలకొక లెక్కయా? కాదు. ఈసకలరాజసమక్షమున నాదేవకీతనయుఁడు నిన్నుఁదప్పకరక్షించితీరును. నీవిఁక వేరుచింతలకుఁ బాలుగాక యమ్మహాత్ముని పదపద్మములను ధ్యానించుకొనుచుండుము.

(భారతి ప్రవేశించును)

మం— భారతీ! ఏమి విశేషములు?

భా— నీ వెఱుఁగని విశేషము లేమున్నవి?

రు— భారతీ! అమ్మగారేమి చేయుచుండిరి?

భా— అమ్మా! మనయింటియిలవేల్పగు నగజాతసన్నిధికి నేఁడునీవేగి పూజ యొనర్చి రావలెనఁట. అందుకుఁగాను గావలసినఫలములు, అటుకులు, నారికేళములు, సుగంధద్రవ్యములు ముత్తైదువలచేఁ బళ్లెరంబుల సర్దింపుచుండిరి.

హే— భారతీ! నీవువచ్చిన కార్యమేమి?

భా— నేవచ్చిన కార్యమేమున్నది. ? మనరాజపుత్రి యిప్పుడు నగజాతాలయమునకేఁగవలసియుండుటచే నీవృత్తాంతమెఱింగించి మిమ్మెల్లర దోడ్కొనిరమ్మని అమ్మగారిసెలవగుటచే వచ్చితిని.

(రుక్మిణి ఖిన్నవదనయై తలవంచికొనును)

మం—(రుక్మిణిగడ్డముఁ బట్టుకొని) అమ్మా!

ఉ. చింతిలఁబోకుమమ్మ! నృపశేఖరుఁడావసుదేవపుత్రుఁడి
ష్టాంతము నందుఁజల్పి నగజాతకు మ్రొక్కిన నిష్టసిద్ధియ
త్యంతరయంబునంగలుగు నాయమభక్తుల పాలవెల్లి, ని
న్నెంతయుఁబ్రోచి తీరును మహేశ్వరదప్పకనమ్ము మోసఖీ:

తల్లీ! మనమింక జాగుసేయఁదగదు, అమ్మగారు చూచుచుందురు. మనము సత్వరముగా నేగవలయు.

(అందఱు నిష్క్రమింతురు)

రంగము - దేవాలయము.

(ప్రవేశము రుక్మిణి హేమలత మంజువాణి ముత్తైదువలు)

మం.—అమ్మా ! ఇదిగో యీమె యే మనయిష్టదైవమగు నగజాదేవి. ఈమెను మనసారం సేవించిన వారలకు తీరని కల్యాణపరంపరల నొందితీరుదురు. కాన నీ వీకు ధూపదీపనైవేద్యాదులు స్వయముగా నొసఁగి నిశ్చలభక్తితో నమస్కరింపుము.

రు.—(తద్విధానమంతయు సక్రమంబుగా నిర్వహించి కరమ్ములు ముకుళించి) తల్లీ !

మ. భవదీయామల పాదపద్మములు మత్ఫాలప్రదేశంబునన్
స్తవనీయంబుగ సోక మ్రొక్కెదను మాతల్లీ! జగన్మోహినీ!
నవలావణ్య జితాబ్జచంద్రవదనా! నాళీకపత్రాక్షి! భా
ర్గవి! బింబాధర! శ్రీమరాళగమనా! కల్యాణముల్ గూర్పుమా?

సీ. పతిమేనసాబాలు పంచికొన్న వెలంది!
గజరాజవదనునిగన్నతల్లి!
ఫాలాక్షు ముద్దుల పట్టంపుదొరసాని!
యచలేంద్రు గర్భభాగ్యంపుఁబంట!
పునుగుజవ్వాజిమై పూఁతఁబూను మతల్లి!
సంయమీశ్వర సేవ్యచరణకమల!
రజతాద్రిపైఁగాపురము సేయుజగదంబ!
వరపూజ్య గంగాభవానిసవతి!
వాంఛితార్థంబులిడును మా వనిత ! నీకుఁ
గరముఁ జేసెదనే నమస్కారశతము
నాయభీష్టముఁదీర్పుమ నన్నుఁగన్న
తల్లి ! లోకైకసంపూజ్య! ధన్యచరిత!

కం. మాకులదేవతవనుచను
నీకడకే తెంచియిట్లు నిరుపమభక్తిం
గైకొని మ్రొక్కెదఁ దల్లీ!
నాకోరికఁ దీర్పు మమ్మ! నళినదళాక్షీ!

చం. అనుదినముం ద్వదీయచరణాబ్జములన్ హృదయాంతరాళమం
దునఁదగుభక్తిమైనిలిపి తోయజనేత్రి! యొనర్తునీకుఁబూ
జనుమనసారఁ గోరికలొసంగెడు తల్లి వెయంచు నెంచి, కా
వునఁదయఁ జూపుమి త్తఱిఁబ్రపూర్తిగ నాయెడ నోమహేశ్వరీ!

(నమస్కరించుచు)

పూజారి—మంజువాణీ! ఇదిగో! ఫలహారపుఁ బళ్లెరము. అమ్మా! రాజపుత్రీ! ఇదిగో! ఈనగజాదేవికి మిక్కిలి ప్రియతమమైన విభూతిఫలము దీనిని నీవుస్వీకరించి, ఈమన్మాత్రిము నీఫాలతలంబున నలంకరింపఁజేయుము దాన నీవాంఛితంబు లీడేరి శుభంబులొనఁగూడును.

మం—అమ్మా! రాజపుత్రీ! ఇంక మన మేగవచ్చును.

హే—గంధగజేంద్రసైంధవ బలపరివృతులై బలసియున్న యీరాజన్యులెల్లు మనవైపుఁజూచుచున్నారో చూడుము.

రు—మంజువాణీ! మనవంకనఱ్ఱులెత్తి చూచుచున్న యీరాజన్యచూడామణులేయే దేశాధీశులో వచింపుము.

మం—అమ్మా!

సీ. మరకత మాణిక్య మణిమయోపేతమై
వరలు తేరులవాఁడు కురువిభుండు
సురదంతిదంత భాసురవరరుచి మీఱు
ధవళధ్వజమువాఁడు యవనవిభుఁడు

ఇంద్రనీలపుఁగాంతు లిరుగడల్ ప్రసరించు
నాతపత్రములవాఁడాంధ్ర విభుఁడు
బాలసూర్యప్రభా పటల సంకాశమౌ
వరకిరీటమువాఁడు వంగ విభుఁడు
కొండలట్లున్న వేదండ తండములను
జాలనొప్పెడువాఁడు ఘూర్జర విభుండు
సొరుబంగారు జిలుగు వస్త్రములవాఁడు
సింధుభూమికి నాథుండు చెలియ! వినుము

రు— చ. గరితరో! యెందఱో నృపులు గానగవచ్చిరి; గానిమన్మనో
హరుఁడగు దేవకీతనయుఁడారయ నెచ్చటఁ గానరాఁడు శ్రీ
హరి వరసత్కృపామహిమ మబ్బినభాగ్యముగల్గి యున్నచో
జరుగునె? యిట్టిచిత్రములు? చాలును సున్న మదీప్సితంబికన్.

(తెరలో)

ఉ. భీతిలనేల? యెల్ల పృథివీతలనాయకులడ్డువచ్చి వి
ఖ్యాతిగఁబోరినన్ సమరమందున వారలఁ దూలనేసి ని
ర్భీతిగనిన్నుఁ జేకొనఁగ వేడుకమై జనుదెంచుచుండెనో
భీతమృగాక్షి! సంశయము వీడుము, వేడుము శ్రీహరిన్ మదిన్.

మం— అమ్మా! అఁడుగో! నీమనోహరుఁడగు నందనందనుఁడే తెంచుచున్నాఁడు ఇంకనిన్నెట్లైనను గొనిపోవకమానఁడు ఈవార్తరాజదంపతులకుఁ దెలియఁజేయకున్న మాకుముప్పువాటిల్లు నింక మేమిచ్చట దడయరాదుమాకుసెలవొసంగుము (నిష్క్రమించును.)

కృ— (ప్రవేశించి)

మ. సరసీజానన! చూడుమా! రిపులమచ్చక్రాహతిం గూల్తుని
ర్భర దోర్వీర్య పటుప్రతాపజనితో గ్రప్రక్రియన్ వంగ, ఘూ

ర్జర, సింధ్వాంధ్రి, కళింగ, కన్నడ, నృపుల్ శాబాసనర్ భీష్మఁడ
చ్చెరు వందర్ నినుఁగొందు భీతిలకు మక్షీనైక దోశ్శక్తిమై.

రు— సీ. జానకినిడువేళ జనకుండు సంభ్రమ
భరితుఁడై కడిగనేపాదయుగము
సురమౌని సంసేవ్య శోభాయమానమై
భాసిల్లుచుండునే పాదయుగము
ఆశ్రితావళికెల్ల నాలవాలమ్మయి
పావనమైనదే పాదయుగము
సకలదిగ్గేశాధి సార్వభౌముల ఫాల
భాగముల్ దాఁకునే పాదయుగము
అట్టిభవదీయపాదద్వయంబు నేఁడు
నంటి భజియించు సౌభాగ్య మబ్బెనాకు
నాదునోములు ఫలియించె మోదమయ్యె
సార్థకంబయ్యె నాజన్మ చక్రిహస్త!
(కృష్ణుని పాదములకు మ్రొక్కును)

కృ— సీ. పడఁతి! నీమృదుహస్త పల్లవంబులు నాదు
కఠినాంఘ్రిలనుదాఁకి కందెనేమొ?
కలికి! నీనిడుసోగ కన్నులు మత్పాద
రజముసోకి యొకింత బ్రిమసెనేమొ?
కాంత! నీగళసీమఁగల హారవల్లికల్
తొలఁగి యీతానేల నలిగెనేమొ?
కుటిలకుంతల! నీదుకొమరారు జడలోని
చేమంతి విరులెల్లఁ జెదరనేమొ?
నిండుచందురుబోలు నీనెమ్మొగంబు
స్వేదకణములతో నిండి చెన్నుఁదఱఁగి

జలధరాన్వితబింబంబు వలెనె తోఁచు
చున్నదిఁక లెమ్ము బాలికా! సన్నుతాంగి!

(రుక్మిణిని లేవఁదీయును)

రు—(లేచి) స్వామీ! శ్రీకృష్ణమూర్తీ!

సీ. శతహయమేధముల్ సల్పుపూజ్యులకైన
దొరకునే? భవదీయ చరణసేవ
బవరానరిపులచేఁ బడిన శూరులకైన
దొరకునే? భవదీయ చరణసేవ
అఖిలతీర్థమ్ముల నరయు పూజ్యులకైన
దొరకునే? భవదీయ చరణసేవ
చెలఁగి బ్రాహ్మణపూజఁ జేయువారలకైన
దొరకునే? భవదీయ చరణసేవ
ఏమినోమునోచితినో? మఱేమివ్రతము
జరపియుంటినో? నేఁ బూర్వజన్మమందు
దొరకె నేఁడిట నాకు నీ చరణసేవ
పావనంబయ్యె నాజన్మ పార్థివేంద్ర!

(మఱల నమస్కరించును.)

కృ—ప్రేయసీ! మనమింక నిచ్చోటఁ దడయరాదు. సకలరాజ సమక్షంబున నిన్నుఁగైకొనుటఁగాంచి సహింపఁజాలక.

చ. కురువిభుఁడాదిగాఁగల యకుంఠితవిక్రమశాలురల్లదే
సరగునఁజైద్యనాథునకు సాయముచేయఁగ నడ్డువచ్చి సుం
దరి! విడిపింపనిన్నుఁ బటుదర్పమునన్ ననుఁదాఁకఁజూచుచుం
డిరి కనుగొమ్ము నీ వటువడిన్ మనసేనలఁ జేరఁ బోవలెన్.

[తెరలో]

చ. నిలునిలుమోరికృష్ణ! యవనీతలనాథులు మద్భుజార్భటిన్
బలమును నెన్నఁగాని శితబాణముతోడ ద్వదీయశీర్షమీ

యిలపపయిడొల్లఁజేతు గుణహీనుఁడ! నాదగు భారినుండిపోఁ
గలవె? తలంపుమీ! చరమకాలముచేకురె నంచునీచుఁడా!

కృ—చెలీ! మదీయ నిందాభూయిష్టమగు వాక్కులతో నిటు
వై పునకు వచ్చుచున్న యాశూరమ్మన్యుఁడెవరో? నీకుఁ దెలియునా?

రు—దేవా! యాతఁడే మదీయాగ్రసోదరుఁడగు రుక్మి
యను వాఁడు.

కృ—చెలీ! ఈతఁడేగదా! శిశుపాలునియెడలఁ బాక్షికముగల
వాఁడై నిన్నాదురాత్మునకుఁ గట్టిపెట్టనెంచుచున్నది? రానిమ్ము వానికిఁ
ద్రిభువనయోధాగ్రేసరానివార్యమగు మదీయ చక్రానలజ్వాల
యొక్క పరితాపమించుక యెఱుంగఁజేసెద.

రు—(ప్రవేశించి)

ఉ. మాసరివాఁడవో యి? యసమానకులోద్భవ! బాలికామణిన్
మోసముఁజేసి కైకొని ప్రమోదము నొందఁగ వచ్చినావె? రా
కాసులమెక్కనీతనువుఁగండలుసేతు విశాలమైన మా
వాసికివన్నెదెచ్చుటకునచ్చితి నిల్వుమొకింత యాజిలోన్.

చీ-చీ-నీచా! కృష్ణా!

సీ. ఇల్లిల్లుఁదిరిగి వ్రేపల్లెలో వెన్న మీఁ
గడమ్రింగుటేయని కడఁగినావా?
కోలఁగేలనుబూని గోబృందములవెంటఁ
దిరుగుటయేయని తివిరినావా?
పసచెడికడు జరాభారంబుతోఁగుందు
నట్టికంసుండని యదరినావా?
మగువలువిడచిన మైలకోకలుదెచ్చి
దాఁచుటయనిమదిఁ దలఁచినావా?

ఓఁ నీచుఁడ! యిదికదనోర్వ్యగాని
పల్లవాధరులున్న స్వపథముగాదు
బవరమును జేయవచ్చిన వాఁడురుక్మి
గాని పూతనయనెతు రా కాసిగాదు.

కృ—ఓరీ! యాత్మశ్లాఘపరాయణా! మూఢా!

క. నోటికివచ్చినయట్టుల
వాటంబనిపేరిలెదీవు వహ్వా! ...

రు— ... ... నేనీ
నోటికిఁజెప్పెదబుద్ధిని
నూటిగవినుమోఁరిమూర్ఖ! సుజనులుమెచ్చన్.

కృ—నీవా? నాకు సుద్దులునేర్పునది?

రు—వావివరుసలు లేని నీనోటికి నేనుగాదు ప్రాకృతమానవుం డును బుద్ధిచెప్పసర్హుఁడు.

కృ—కావుననే, తండ్రిని, తల్లిని, బెద్దలను సరకుగొనక చెలియలి ముద్దునైనఁ జెల్లింపక, "తానుజెడినకోఁతి వనమెల్లఁ జెఱచిన" దనుసామెతవిధమున నాశిశుపాలుని వానికి జతగాఁడగుమాగధుని ఘనులనినమ్మి నీవుచెడుటయేకాక నీచెల్లెలినిఁగూడ మోసముజేయఁదలంచితివి కాదా?

రు—ఓరీ! వాచాలా! నీప్రిలదము మితిమీఱుచున్నది. నా చెల్లెలిని నేనుజెఱుచువాఁడను నీవుబాగుసేయువాఁడవునా? నీబ్రతుకుఁ దెఱవు నీకుఁదెలిసిన నిట్లునిట్టిపడెదవా?

గీ! మాజరాసంధుఁడెన్నియో మార్లునిన్ను
యుద్ధమందున నోడించియుంటకాక
పురము వెడలింపఁడే? నీకుబుద్ధిలేదె?
ఏల? పగ్గెలుగొట్టెద వేమిబ్రతుకు?

కృ—ఆ! వె! అతుకుబ్రతుకువాని యాడంబరం బేల?
మెతుకుబ్రతుకువాని మిసిమి యేల?
అన్నియున్న నీకు నల్లరిదనమేల?
పిల్లదములుమాని బ్రతుకు మోరి!

రు—దొంగతనముగా మొదటినుండియు బ్రతికిన దేకాక యిప్పుడు వివాహము సైతము దొంగతనముగాఁ జేసికొనఁదలంచితివా?

కృ—దొంగతనమో? దొరతనమో? తెలిసికొందువుగాని, యదుగో, చూచితివా? జరాసంధాదులు పరాభవింపంబడి యేమగుచున్నవారలో?

రు— సీ. బావమఱదిగదా! శిశుపాలుఁడోర!
యేమి? సిగ్గింత లేదయ్యె? మోమునకును
వాఁడు వలచినదీని జేపట్టనగునె?
గొల్లచేష్టలుమాన్పింతు గొంతుగోసి.

కృ—నీవెల్లయునను బంధువుడవేకదా! యని యూరకుండుటచే నీ నీతులు విస్తారములయ్యె నింక సహింపను.

ఉ బంధువటంచు బల్లిదపు వాక్యము లెన్నియొ పేలిన్ దయా
సింధుమతిన్ సహించితిని చీ! యిదె! కోసెత్వదీయజిహ్వ, వా
గ్బంధము జేతునిన్ను, సరివారలుగన్గొని మేలనంగఁ గ
ర్వాంధుఁడ! పారిపోకుమిఁక నాహవభూమిని నిల్వుమిత్తఱిన్.

(వాలు బెరికి పైకురకఁబోవ రుక్మిణిఅడ్డమువచ్చి కరములుముకుళించి)

మత్తకోకిల.

రు—అల్లుడయ్యె ముకుందుఁడంచునుహర్షమందుచునుందుమీ
తల్లిదండ్రులునింతలోపల దానవాంతక! వారికిన్

జెల్లునే? యిటుపుత్రిశోకము జేతులారగ బెట్ట, మి
మ్మెల్లవారలు నిందసేయరె? యిట్టిసేతకు శ్రీహరీ!

(పాదములను బట్టికొనును.)

కృ—(చిఱునగవుతో) ప్రేయసీ! నీముద్దు జెల్లించితి, (రుక్మినిబట్టికట్టి) బావా! నీవు నీచెలియలిదెస గాఠిన్యము నేవహించినను నీయందు బ్రబలానురాగంబు గల్గియుంటచే నీరుక్మిణి నీకు జీవనదాన మొసంగినది. ఇప్పటికైన నస్మన్మహిమాతిరేకం బించుక తెలియునైనదా?

చ. తెలియక నన్ను నీవు గుణదీనుఁడ! కాఱులుకూసినావు నీ
చెలియలు రుక్మిణీరమణి, చెచ్చెర నడ్డము వచ్చియుండకుటన్
నిలిచెఁ ద్వదీయ జీవము, మనీషులదూఱిన పాతకంబిదే
తొలఁగఁగ మూఁతిమీసములతో దలకుఱ్ఱఁ క్షురకర్మఁ జేసెదన్

(గడ్డము, మీసము దలయు గొఱుగును.)

కృ—కౌశికా!

కౌ—చిత్తము.

కృ—ఇక్కడ మనమీరుక్మితోనే సంగరకాలక్షేపము జేసినారము. ఈస్థితియిట్టులుండ మనబలరామాదులు శత్రుపక్షమువారిదాఁకికి సైచిరో? లేక మఱియేమి వ్యతిరేకము సంభవించెనో యని మనము తహతహనొందుచున్నది.

కౌ—స్వామీ! తామటులఁదలంపఁజనదు. మనసాత్యకియొక్కఁడు గడుంగడుసువాఁడు పరుల బలమ్మునకింతయుఁదీసిపోవుమానిసిగాఁడు. కృతవర్మ మాత్రము సామాన్యుఁడా? మీయన్నయ్యగారి కాగ్రహమే వచ్చిన నాఁగలికొనకుసరిపోవువారందెవరున్నారు?

కృ—ఎవరో వచ్చుచున్నట్లుది.

కంచుకి—(ప్రవేశించి) దీనజనసంరక్షణ పరాయణా! నందనందనా! జోహార్

కృ—విశేషము లేమి?

కం—దేవా! బలరాముఁడు గంధగజేంద్ర తుల్యబలదర్పితులగు చైద్యపక్షానుచరుల నెల్లర నోడించి సైన్యముల మఱలించి ప్రయాణోన్ముఖులై తమరాక కెదురు చూచుచున్నారు.

కృ—చెలీ! మనమింక నిచ్చోటఁ దడయరాదు. సత్వరముగ నేగి బలరామాదులఁ గలసికొనవలయును. రమ్ము పోదము.

రుక్మిణి—మనోహరా! నాయీచిన్న మనవి మన్నింపఁ బ్రార్థింపుచున్నదాన.

కృ—కళ్యాణీ! నాసర్వస్వమును ప్రాణమును నీయదియ! నీకుఁగల వాంఛితం బేమో సత్వరముగాఁ దెలియంజేయుము.

రుక్మిణి—

గీ. పరిభవానలజ్వాల సంభ్రమముతోడ
నంతరించెను మాయన్న ననఘ! నీదు
సాదరామృతధారలఁ జక్కఁజేసి
బంధము నువీడఁజేయ నా ప్రార్థనంబు

కృ—అట్లయినఁ జెలీ! నీనిమిత్తమున మఱలఁ బ్రాణబంధంబుల నుండి వీడుకోలుఁ గైకొనిన నీయన్న సుఖంబుండుఁగాక! (రుక్మివైపునకుం దిరిగి) ఓరీ! నేఁటికి నీసోదరికతమున బ్రతికితివి. ఇంకనైన దుశ్చింతలపాలుఁగాక సుజ్ఞానముతో బుధజనవిధేయుఁడవై బ్రతుకుము (బంధవిముక్తుని జేయును)

రుక్మిణి—దేవా! భవదీయ పరమదయాళుత్వమున కెంతయో కృతజ్ఞురాలను.

కృ—కౌశికా!

కౌ—చిత్తము.

కృ.—నీవేగి పరిణయసమాగమమునకై భీష్మకమహారాజగారిని సపుత్త్రమిత్త్రకళత్త్రాదులతోఁ బురికొల్పుము.

కా—నేను సబాంధవముగా సత్వరము వచ్చుచున్నాను సెలవిండు.

కృ--సత్వరముగా రమ్ము పొమ్ము.

కా—చిత్తము. (నిష్క్రమించును)

కృ.—అన్నలమిన్నా! మనమింక నిచ్చోటఁ దడయఁబనిలేదు. మనకొఱకై బలరామాదులచ్చట వేచియుందురు సత్వరముగా నేగుదము రమ్ము.

(నిష్క్రమింతురు)

ఇది చతుర్థాంకము.

వైదర్భీ పరిణయము

పంచమాంకము

రంగము - ద్వారకాపురరాజవీథి

(ప్రవేశము: చిత్రసేనుఁడను గంధర్వుఁడు)

ఔరా! ఏమి? యష్టయిశ్వర్యముల కాలవాలమగు నాయమరావతీపురంబు నేగాక, భక్తజనసులభుండగు పరమేశ్వరుని కైలాసంబును, రెండవయమరావతి యనందగు కుబేరునియలకాపట్టణంబును నన్నింట మిన్నయనందగు శ్రీరమామనోహరుని వైకుంఠపట్టణంబును నిరంతరము గాంచుచున్న నావంటివానికన్నులకే యీద్వారక యిట్లు మిరుమిట్లుగొల్పుచుండ సహస్రాక్షునకైన నీపట్టణంబునుగనుంగొని వర్ణించుటకు శక్యమా?

సీ. కైలాసగిరిబోలు ఘనసౌధములతోడ
రమణీయమగుగోపురములతోడ
నాకాశమునుదాఁకు ప్రాకారములతోడ
భాసురమగుమండపములతోడఁ
జంద్రకాంతోపల సోపానములతోడ
స్ఫటికంపుస్తంభాల ప్రభలతోడ
నతిమనోహరములౌ నారామములతోడ
రత్నఘటితపుద్వారములతోడ

భళిరకర్పూరదీపధూపములతోడ
జందనాగరుపరిమళ సహితముగను
నొప్పుచున్నదిరతనాల కుప్పవోలె
నరయువారలకన్నుల కద్భుతముగ.

ఆహా! సహజశోభాయమానమై తనరారు నీపట్టణరాజము శతకోటి సూర్యసంకాశమై యొప్పు సీవిద్యుల్లతాదీపసహస్రమ్ములతోడను దిక్కులుపిక్కటిల్లు మంగళవాద్య తూర్యనినదంబులతోడను నంచిత నవరత్నమయ రంగవల్లీవిరాజితప్రతిగృహాంగణంబులతోడను ఘనసార కస్తూరీ గంధజలబంధురసిక్త రాజమార్గంబులతోడను గరిఘటాశ్వభట ఘీంకారహేతిజణంజణారవ బంధురమ్ముగ విరాజమానంబులగు సుప్రాణముత్యంబుల తోరణమ్ముల హేమద్వారజాలంబులతోడను నిత్యకల్యాణమై పచ్చతోరణంబగుచు శృంగారదేవతానివాసస్థానమో యన్నట్లు చూపఱకుం దోచుచున్నది. ఆహా! ఏమి? ఈపట్టణవాసులజన్మసాఫల్యము. సంసారమహాసాగరంబులం దరించి నిరశనులై ముక్కుమూసికొని పెక్కువేలసంవత్సరంబులరణ్యంబులంబడి తపమాచరించు దాపసాళికైన లభ్యముగాని శ్రీహరిపాదసేవ వీరలవలీలగననుదినంబు నుజేయుచు ధన్యతనొందుచుండిరి. వీరలజన్మలే సార్థకములు వీరలేధన్యులు నేడు మాయమగేంద్రునిదయవల్ల నాకు శ్రీహరిపాదకమలములు సందర్శించుభాగ్యములభించె. నాజన్మమధ్యమున నేనింక నిట్టి సుదినంబునుగాంచజాలను.

(సుబ్బావధానియను వృద్ధబ్రాహ్మణుఁడు ప్రవేశించును)

సు—సహజశోభాయమానమై వెలుంగు నీపట్టణరాజమేలొకో? యేదో యొకనూతనశోభతో నలరారుచున్నది. ఆ! తెలిసినది.

(కన్నులకుఁ జేయియడ్డముపెట్టుకొనిచూచుచు)

ఎవరయ్యా! వారా వెళ్ళునది? మఱే, యెక్కడిమాట! యీ ద్వాపరయుగంబున నంతటిమహోపకారమా? అదియంతయుఁ గృతత్రేతాయుగంబులతోడనే నశించినది. నాయీవృద్ధత్వమును నంగవైకల్యమును జూచి నవ్వువారలే కాని యుదయమునుండియు నామాట వినిపించుకొనువారొక్కరును గనుపించరు చీ!

చి—అయ్యో! నేనుబలుకుచున్నను నీవృద్ధుఁడు వినిపించుకొనక యేమో కోపగించుకొనుచున్నాఁడు పాపమీయనకు బధిరత్వము పూర్తిగానున్నట్లున్నది.

సు—ఏమయ్యా! పలుకరించినను బలుకకుండుటపాతకమా?

చి—కాదు కాదు నాతోఁగలకార్యమేదో తెలుపుమని నే మిమ్ములఁగోరుచునేయుంటిని. తాము వృద్ధులగుటచే బధిరతాదోషమువలన వినఁబడమింజేసి తామట్లుభావింపుచుంటిరి.

సు—ఏమనుచున్నావు? (కోపముతో) నాయీజరాభారము గాంచి నవ్వుచున్నావా? నీవుమాత్రమట్లేయెల్లకాలమును బఘుచువాడవుగా నుందువా?

చి—(కొంచెముబిగ్గఱగా) మిమ్ముల నేనెగతాళిచేయుటలేదు నేసత్వరముగా నేగవలసియున్నది. నాతోఁగలకార్యమేమో సత్వరముగా సెలవిండు.

సు—మంచిది. ఆలాగా? నాయనా! నీవెవరవు?

చి—నేను చిత్రసేనుఁడను గంధర్వకుమారుఁడను. దేవదూతను.

సు—ఓహో! అట్లయిన సంతోషము సంతోషము. నీవిపుడెచటినుండివచ్చుచుంటివి? ఎచటికేగుచుంటివి?

చి—అయ్యా! నేఁడు జరుగఁబోవు శ్రీకృష్ణునికల్యాణమును దిలకించుటకుఁగాను దేవేంద్రుఁడు సకుటుంబసపరివారముగా నేతెం

చుచుండె నీవార్త ముందుగా శ్రీకృష్ణభగవానుల కెఱింగించుటకు దేవేంద్రుఁడు పంపఁగా నేగుచుంటిని.

సు:—సంతోషము సంతోషము. నేఁడు నాకెంతచల్లనివార్త చెప్పితివి. నీవాయురారోగ్యములుగలిగి యాచంద్రతారార్కము వర్ధిల్లుము; కానిగంధర్వకుమారా! పెద్దవాఁడనగు నాకొక్క సాయముమాత్రము చేసిపెట్టుము. శ్రీకృష్ణునివివాహమునకు గొప్పసంభావనలిత్తురనియాశచే నిచ్చటికెంతదూరమునుండియో శ్రమయనకవచ్చితిని; గాని గజాశ్వభటసంభరితమైయున్న నీరాజమార్గంబులుగడచి కోటలోని కేగుట దుర్ఘటమనితలంచి, గుంపులుగుంపులుగాఁ గోటలోనికేగుచున్నవారల నందఱ నుదయమునుండియు నేనెంతబ్రతిమాలినను నొక్కరయిన బలుకరైరి బీదబ్రాహ్మణుఁడనగు నన్నుఁ గోటలోనికి నీవెంటగొంపోయి పుణ్యముగట్టుకొమ్ము.

చి—మంచిది ద్విజోత్తమా! నావెంటదయచేయుఁడు.

సు—నీకడుపుచల్లఁగా నెంతపుణ్యాత్ముఁడవయ్యా?

(మెల్లఁగాఁగుంటుకొనుచుఁ జిత్రసేనుని వెంటనిష్క్రమించును)

రంగము శ్రీకృష్ణునిమందిరము.

(ప్రవేశము బలరాముఁడు, శ్రీకృష్ణుఁడు, సాత్యకి, కౌశికాదులు)

బ—సాత్యకీ! వ్రేపల్లెనుండి నందయశోదాదులతో నేతెంచిన గోపగోపికాజనంబులనెల్ల వారలకును దగిన విడిదియల నేర్పాటుఁ గావించితివా?

సా—అన్నా! బలరామా! సాధ్యమయినంతవఱ కెట్టిలోపములును గలుగకయుండునట్లు తత్కార్యమునకు మనయక్రూరుని నియమించితిని.

కృ—బలదేవా ! యింతవఱకుఁ బాండవేయులలో. నొక్కర యిన రాకయుండుటకుఁగతం బేమి ? మఱిల వారేమయినదుర్భరముల గు కష్టములపాలుగారుగదా !

బ—మఱిలవారల కేమయినఁ గష్టములు గలిగిన మనకృతవర్మ యయిన రాకయుండునా ?

కౌ—అన్నికష్టములకన్న ధర్మరాజు జపతపోహోమాదుల నిర్వహించి భోజనమునకు లేచుటయే పెద్దకష్టము. అట్టిపూర్వాచారపరాయణునితోఁ బ్రియాణ మొనర్చుట తక్కిన పాండవులకు మఱింతకష్టము.

బ—కృష్ణా ! ఈకౌశికునిమాటలతో నేమిగాని మొన్న పాపమారుక్మి నెంతనీచముగాఁ బరిభవించితివి? అదిగాంచి ధర్మస్వరూపుఁడగు భీష్మకమహారాజెంతచింతించెనోకదా ?

కృ—అన్నా ? బలరామా !

గీ. ఎంత పాపంబుఁ జేసిన నంతశిక్ష
జీవులనుభవించుటయె స్వాభావికమ్ము
గాన దానికిఁ బరులేల కర్తలౌదు
రయ్య ! చెప్పుమి ? యదివాని యఘముగాదే ?

బ—అయ్యో ! యందు వాఁడుచేసిన బాపమున్మాత్రమేమిగలదు ?

కృ—పరదూషణముకన్న నింక వేఱొకపాపమున్నదా ?

కౌ—వారలనందఱ నంతగాననంబని లేదు. రుక్మిణీబంధుజనమంతయు మహానందముతో మన వీడు దయసేసియుండిరి.

కంచుకి—(ప్రవేశించి)యదుకులసామ్రాజ్యప్రదీపకులారా. జోహారు.

బ—కంచుకీ! విశేషములేమి?

కం—దేవా! భవదీయదర్శనార్థము దేవదూతయగు చిత్రసేనుఁడను గంధర్వకుమారుఁడు వేచియున్నవాఁడు.

కృ—చిత్రసేనుఁడేతెంచెనా?

బ—సత్వరముగాఁ దోడ్కొనిరమ్ము.

కం—చిత్తము. (నిష్క్రమించును)

కృ—అన్నా! బలరామా! చిత్రసేనుని వజ్రపాణి మనకడకేల పుత్తెంచియుండును?

కా—ఇక్కడ దమరొకరున్నారుగదా! మాటమాటకుఁబరుగెత్తి యమరావతిచుట్టును పారాయిచ్చుటకు మఱలనేరాక్షసునితోడనో? గిల్లికజ్జా తెచ్చిపెట్టికొని తనచేతగామి నీసన్నిధానమునకు జిత్రసేను నిబంపించెననితోఁచెడిని.

కృ—ఓయీ! యజ్ఞాసీ! ముల్లోకములకధిపతియగు దేవేంద్రునంతవాని సయితము నోటికివచ్చినట్లు హద్దుపద్దులేక యెగతాళిచేయుచుంటివా?

చి—(ప్రవేశించి) యదువంశపయఃపారావారసంజనిత సుధాకరులగు బలరామకృష్ణులారా! జయము జయము

బ—చిత్రసేనా! అభివాదము రమ్ము. ఈకనకాసనమున దయసేయుము

కృ—మహాశయా! చిత్రసేనా!

సీ. క్షేమమే కద! మన చిన్నారి పొన్నారి
శ్రీజయంతకుమారశేఖరునకు
క్షేమమే కద! కడు శృంగారవతులైన
కలవాణులౌ వేల్పుఁగన్నియలకు

క్షేమమేకద! పెక్కు శ్రీలచేవిలసిల్లు
పౌలోమిరాజ్ఞికిఁ బ్రథితమతికి
క్షేమమే కాదె! యాశేముషీవిభవాభి
శోభితుఁడౌబల సూదనునకు
క్షేమమేకద దిక్పాలసిద్ధులకును
క్షేమమేకద! సురలప్రసిద్ధగురువు
క్షేమమేకద! యదితికి సిరులకెలమి
క్షేమమేకద! గోవుచింతామణియును.

చి—కృష్ణా! అఖిలజగద్రక్షకుఁడవగు నీవుగంటికి ఱెప్పవలెఁబరిరక్షించుచుండ నమరావతికిని నమరసంతతికిని నెట్టి లోపముగలదు? భవదీయకృపావిశేషమున నెల్లరకు క్షేమమే!

కృ—దేవేంద్రుని శుభవార్త లెఱిఁగించి మమ్మానందింపఁజేసినందుకు మేము నీకెంతయుఁ గృతజ్ఞులము; కాని యిప్పుడు నీరాక మనకారణమేమో నెఱింగింప వేఁడుచుంటి.

చి—శ్రీకృష్ణస్వామీ! సీరపాణిసాయమున నీవు కుండినపురమునకేగి గంధగజేంద్రతుల్య బలగర్వితులగు బహుళపరిపంధి రాజనికరమ్ములఁ దూలించి భీష్మకసుతను ద్వారకకుఁ గొనివచ్చినవాదిగాఁగలసమస్తవృత్తాంతమేగాక నేఁడుజరుగఁబోవు కల్యాణమహోత్సవ వృత్తాంతమును నారదమౌనీంద్రుఁడు మాకెంతయో కర్ణపేయముగా వచియింపనంత మా దేవేంద్రుఁడు కందళితహృదయారవిందుండై త్వదీయకల్యాణమహోత్సవము దిలకింప:-

సీ. ఐరావతముతోడ, నప్సరసలతోడ,
దేవేరియగుశచీ దేవితోడ
నీరజాసనుతోడ నిజపురోహితుతోడఁ
జెలఁగి సేవించు జేజేలతోడ

వైవస్వతునితోడ వైశ్రవణునితోడ
శ్రీజయంతకుమార సేనతోడ
వేల్పుకన్నెలతోడ, విబుధాగ్రణులతోడ
నమరజననియైన యదితితోడఁ
గామితార్థంబులొసఁగెడు కల్పవృక్ష
ఫలచయమ్ములతో, సురపారిజాత
పుష్పములతోడఁగూడి ప్రమోదమలర
వచ్చుచున్నాఁడు మాధవా! వజ్రిపాణి!

కాన నీవార్త మీకెఱింగింపుమనుగా నన్నుఁబుత్తెంచె.

కృ—చిత్రసేనా! యేమిమాభాగ్యము మాపైఁగల యవ్యాజానురాగమే, యతనియీప్రయాణమునకుఁగల కారణముగాని వేఱుకాదు.

బ—కృష్ణా! అట్లయిన మనమింకనిచ్చోఁ దడయరాదు. త్రింశత్కోటిదేవతా పరివృతుండై వేంచేయుచున్న యమరేంద్రునకు స్వాగతము లొసరింపవలయును.

కృ—అన్నా! బలదేవా! సకలయాదవబల పరివృతుండవై నీవు వారలకెదురేగి స్వాగతమొసంగి తోడ్కొనిరమ్ము నేనియ్యెడ సర్వము సిద్ధముజేయఁజెద.

(అందఱు నిష్క్రమింతురు.)

రంగము—వివాహమంటపము.

[రుక్మిణీ శ్రీకృష్ణులు వేదికపైఁగూర్చొనియుండ, ఇంద్రుఁడు, శ దేవి, దేవకీ వసుదేవులు, భీష్మక సుగుణమతులు, సాత్యకీ బల మాది యఖిలబంధుకోటియు, బ్రహ్మ. అష్టదిక్పాలకులు, బృహ , నారదుఁడు మొదలగు వారిరుపార్శ్వములమూఁగియుండ మంగ ద్యములు మ్రోఁగుచుండును]

దే—గురువరా! ఇంకనాలస్యమేల? సూత్రధారణము సత్వరముగాఁ జేయింపుఁడు, సుముహూర్తము సమీపించినది.

బృ—దేవేంద్రా! పురాణదంపతులగు నీవధూవరులవివాహము జేయించఁగల భాగ్యము నాకిది రెండవసారి యేకదా!

శ్లో॥ జానక్యాః కమలామలాంజలిపుటే యాః పద్మరాగాయితాః
న్యస్తా రాఘవ మస్తకేచవిలసత్కుంద ప్రసూనాయితాః స్ర
స్తాశ్యామలకాయ కాంతికలితా యాఇంద్రనీలాయితాః
ముక్తాస్తాశ్శుభదా భవంతు భవతాం శ్రీరామవైవాహికాః॥

బ—గురువరా! సత్వరముగాఁగానిండు ఇప్పటికే చాలనాలస్యమైనది.

బృ—బలదేవా! యింక నాశీర్వచనము దక్షిణ దక్షిణ వివాహకార్యమంతయు యథావిధిగ జరిగినది. ఇవిగో! అక్షితలు (అందరికిచ్చును.)

వసు—సీ ఆయురారోగ్యాధికైశ్వర్యముల్ గల్గి
యింపుగాఁబుడమిఁ బాలించుచుండుఁ

దేవ—పుత్రపౌత్రప్రజా భూరిసంతానంబు
చల్లగాఁగల్గి వర్ధిల్లుచుండు

బ్రహ్మ—గురుధర్మకామార్థ కోవిదులైబహు
యజ్ఞముల్ చేయుచు నలరుచుండు

దేవేంద్రుఁడు—ప్రాచీనకుల ధర్మపాలనానిరతులై
సజ్జనాళికిమేలొసంగుచుండు

అష్టదిక్పాలురు—జాతిభేదము లేక యీతమ్మితలమునఁ
గలజనంబుల నెల్లరఁ గరుణతోడ
స్వజనము విధానఁ గాంచి యాచంద్రతార
కముగఁ బెంచుచు యశమును గాంచుచుండ్రి.
(అందఱు అక్షతలు జల్లుదురు.)

నా—కృష్ణా! అఖిలజగద్రక్షకుడవగు నీవెఱుఁగని ధర్మములు లేకపోయినను ధర్మోపన్యాసకులమగు మాధర్మమును మేము నిర్వహించుకొనుట మావిధానకర్తవ్యముగదా! కావున నావాక్యములు శ్రద్ధాళుఁడవై చిత్తగింపుము.

సీ. తల్లిదండ్రులకును దైవంబునకు సేవఁ
జెలఁగి యేప్రొద్దును జేయవలయు
గోబ్రాహ్మణుల పూజఁ గోరి యేవేళను
శ్రద్ధమై విడువక సలుపవలయు
శరణన్నఁ బగతుని సైతము విడువక
చేచేతఁ బూని రక్షింపవలయు
ధర్మమ్ముఁ దొలఁగినఁ దగు బాంధవుని నైనఁ
దెంపుతో వాని దండింపవలయు
నర్ధిజనముల కష్టంబులరయవలయు
శిష్టులగు భక్తవరుల రక్షింపవలయు
జెలఁగు విద్యల నెప్డు: బోషింపవలయు
నాపదలనైన ధర్మమే యరయవలయు.

రుక్మిణీ! రమాంశచే వెలయు నీకుఁ జెప్పవలసిన దేదియు లేదు. అయినను బ్రాకృతధర్మమునఁ జెప్పుటకియ్యకొనితి నాదగు పల్కు లాలింపుము.

సీ. పతిభావమెట్టిదో? పరికించి యేప్రొద్దుఁ
దగురీతి వానితోఁ దనరుమమ్మ
యత్తమామలయాజ్ఞ కావంతజనదాఁట
కెప్పుడు మన్నింప నెంచుమమ్మ
యాఁడుబిడ్డలఁ దోడికోడండ్ర నెప్పుడుఁ
గలసి ప్రేమించియే మెలఁగుమమ్మ
పరివారిఁ బెరవారి సమముగాఁ జూచుచు
నిష్పక్షపాతమ్ము నెఱపుమమ్మ
మంచిగుణములు బోధింప నెంచుమమ్మ
సాత్వికంబునఁ బ్రజలను సాకుమమ్మ
ఆశ్రితార్థుల యర్థంబు లరయుమమ్మ
ప్రోచుచుండుము విద్యలరుక్మిణమ్మ.

భరత వాక్యము.

చ. ధరణిఫలించుఁగాత! నవధాన్యములం బరిపూర్తిగాను, భూ
వరులు ప్రజాహితంబుగ స్వపాలనఁ జేయఁ దలంతురుగాత! భూ
సురులు స్వధర్మకర్మలఁ ద్రిశుద్ధిగఁ జేయుచు నుందురుగాత! ధీ
వరులు ప్రశాంత మార్గమున భారతమాత సుఖించుగాపుత్ర

ఇది పంచమాంకము.

ఓమ్ తత్సత్.

ఆంధ్ర ప్రబోధినీ గ్రంథనిలయము.

పండితాభిప్రాయములు.

ఈగ్రంథమాలనుండి వెలువడిన పుస్తకములలోఁ గొన్ని నాకడకు ప్రచారకులద్వారమున వచ్చియున్నవి. చదివిచూచినాను. సర్వవిధములఁ బ్రచారకులు శ్రద్ధగలిగి భాషాపోషణమునకు నిక్కలిగాఁ బాటుపడుచున్నారు. ఈప్రచారకులకు భగవంతుఁడు తగుసాయమొసఁగి వీరిపూనిక నభివృద్ధినందించుఁగాక.

చెళ్లపిళ్ల వేంకటశాస్త్రి.
శతావధాని.

సీ. క్రొన్ననమన్ననల్ నన్నయభట్టుచేఁ
గన్నకంటెనుగడువన్నె కెక్కి-
చొక్కంపుఁదోవలఁదిక్కనచేఁగాంచి
పలుచాయలందిన కలలుదాల్చి
చూచిచెప్పఁగరాని సొంపులుసోముచేఁ
బొందివెంపొందిన పొలుపునొంది
చిన్నవన్నెలఁదాల్పఁ జేసినపెద్దన్న
బాటలుక్రొమ్మెఱు బయలువెట్టి
కాంచుమాంధ్రప్రబోధనీ గ్రంథమాల
వలనఁ దొల్లింటిగరిమను. వాణి, భమిడి
పాటి యయ్యప్ప శాస్త్రివిద్వచ్ఛతావ
ధానివెలయింపుచుండ నిద్దంపువాణి!

తొలుదొల్తఁ గొన్నాళ్లు కలలూని తిరిగెను
చాళుక్యరాజుల కేలువట్టి
పదపడికొన్నాళ్లు పలుకుతొయ్యలనుదిగ్గె
రెడ్డిరాజులయొద్ద బిడ్డవోలె
తరువాతఁ గొన్నాళ్లు నిరుపమకాంతిచే
వెలమలచేపట్టి వెలిఁగెఁ దాను
పిమ్మటఁ గొన్నాళ్లు పెంపొందెఁ బేర్మిమైఁ
గమ్మవారలయొద్ద నెమ్మదిగను
తుదితురుష్కులవలనఁ దాఁ దూలఁగలిం చెఁ
గాని వైశ్యులచే వృద్ధిఁగాంచలేదు
అనెడు కొఱఁతను బాపి కొమ్మద్దెపల్లి
సత్యనారాయణునిచేత సరసవాణి!

తమాలిక. తండ్రిచనిపోయి నెలనాళ్లు దాఁటకుండఁ
గార్యభారత్వమెట్టిదో గానితాను
వెంటవెంట నెపొత్తముల్ వెలయఁ జేసి
„నిశ్చితార్థంబు విడుతురె నిపుణమతులు"
అనెడువాక్యము తనయందు నన్వయింప
సత్యనారాయణార్యుఁడు నిత్యమిటులె
పేరుగాంచుత నాచంద్రతారకముగ
గంధనిలయము పీఠిక క్రమము నెఱపి
నాటకంబుల వెలయించి నావ్రగొన్ని
తడయఁకిప్పుడు సత్ప్రబంధములుగూడ
నచ్చునొత్తించి స్థిరకీర్తినందుమయ్య!
సత్యనారాయణా! యింకఁ బ్రత్యహంబు.

పెనుమెత్స సత్యనారాయణరాజు,
తెలుగు పండితుఁడు.

శా. శ్రీవిద్యా మహనీయమై విబుధనిత్యోపానుకూలాంగమై
భావాశేషవిశేషవాసమయి, విద్వాంసయ్యపార్యాభిమా
నావాలంబయి యాంధ్రబోధిని సదాయాచంద్రతారార్కమై
సేవింపంబడుఁగాత, నాంధ్రులయశశ్శ్రీయస్కరాధారమై

సీ. స్థాపకుండన్న నద్దేపల్లి వంశీయ
రమణీయ సత్యనారాయణుండు
అభిమానివిద్వాంశతావధాన్యసమాని
యగు భమ్మిడిపాటియయ్యప్పశాస్త్రి
గారిమమా? నవ్యనాగరికులకలతల్లి
మండనవల్లి యామండవల్లి
ప్రకటించుటా? యాంధ్రభారతసాంఘికో
త్తమకృతగ్రంథరాజము[illegible]గములు
మనకుభగవానుఁడొసఁగుసమ్యగ్వివేక
దత్తపరికరములలోమహోత్తమంబు
ఘనతరాంధ్రప్రబోధినీగ్రంథమాల
యంచునూహించిచేరుఁడో, యాంధ్రులార!

సీ. రాజరాజనరేంద్రరాజ్యకాలమునాఁటి
సింహాసనంబెక్కుచేవదాఁటి
కలరెడ్లసంస్థానకవిసార్వభౌముఁడా
శ్రీనాథునాఁటిసుశ్రీనిమాని
ఆంధ్రభోజాంశుఁడైయవతరించినకృష్ణ
రాయకాలమునాటిరాణఁదక్కి
తక్కుంగలట్టియాంధ్రమహాప్రభులనాఁటి
కవితోత్సవంబులఁగట్టిపెట్టి
ఆర్యవైశ్యమహాశయనాదరమునన।మలవిద్వాంశతావధాన్యయ్యపార్య
గ్రంథసంపాదకత్వప్రకాశమగుచునేఁటికాంధ్రప్రబోధినీని-

బోర్డుహైస్కూలు — ఇట్లు,
గుడివాడ. — వేమూరు వేం...
ప్రధా...

ఆంధ్ర ప్రబోధినీ గ్రం[illegible]యము

మండవల్లి

లింగాలపోస్టు.—కృష్ణాజిల్లా,

సంపాదకుఁడు. విద్వాన్ భమిడిపాటి అయ్యప్పశాస్త్రి, శతావధాని	ప్రకాశకుఁడు అద్దేపల్లిసత్యనారాయణ.

నవరసభరితములగు నవలలు —మనోరంజకములగునాటకములు మృదుమధురశైలిప్రబంధములు.—గ్లేజుకాగితములతో, మల్లెమొగలవంటి యక్షరములతో, ముచ్చటయైనబొమ్మలతో, ముద్దులొలుకు బైండులతో, మూఁడుమాసముల కొక్కటి వంతున మత, సాంఘిక. నైతిక, ఆర్థిక, చారిత్రిక, వ్యవసాయిక, రాజకీయవిషయములను జర్చించు గ్రంథములు వెలువడుచుండును.

మాగ్రంథమండలి యభివృద్ధియంతయు మాతృభాషాభిమానులగు మాసోదరుల యాదరాభిమానములపై నాధారపడియున్నది

1. మా చేయు దేశసేవకు రాజపోషకులుగనుండువారు 232-0-0లున్న
2 ప్రధానపోషకులుగనుండువారు 116-0-0లున్న
3 గౌరవపోషకులుగనుండువారు 58-0-0లున్న

ఒక్కే పర్యాయ మొసంగవలయును.

4. సంత్సరపోషకులుగనుండువారు సంవత్సరమునకురు10 0-0వంతున బ్రతిసంవత్సరము నిచ్చుచుండవలయును.

ఇట్టివారి పవిత్రనామములను బ్రతిగ్రంథమునందును వేఱువేఱుగా ముద్రింపఁబడును చందాదారులగువారు ప్రవేశరుసుము 0_8_0ముందుగాఁ జెల్లింపవలయును. ఇందు మూఁడుమాసముల కొక్కటివంతున వెలువడు ప్రతిగ్రంథమునుజందాదారులకు వీ.పి గాఁ బంపుచుందుము.

గ్రంథములఁబంపుటకగు పోస్టేజిమొదలగువ్యయము లన్నియుఁ జందాదారులే భరింపవలయును.

ఇందు వెలువడు అ[illegible]బంధగ్రంథముల నిష్టమున్న చందాదారులకు స్వల్పవెలకుఁ బంప[illegible]బడును. ఇందు వెలువడుగ్రంథములపై నప్పుడప్పుడు గొప్పబహుమాన పరీక్ష లేర్పరుపఁబడుచుండును.

ఇందీవఱకు వెలువడినగ్రంథములు,

మ॥రా॥శ్రీ. బాలకవి, ఇక్కుర్తి తిరుపతిరాయఁడు

గారిచే విరచితమైనవి

		చందాదారులకు
1 ఊర్వీసుత్రోద్వాహము:(రసవంతమైననాటకము)	రు1-0-0	0-12-0
2 అరిందమవిజయము.— (రెండుగొప్పబహుమానపరీక్షలకుఁ బఠనీయముగా నియమింపఁబడిన నిరూపక నాటకము చాలాఅద్భుతమైనది	రు 1-0-0	0-12-0
3 వైదర్భీపరిణయము.(నవరసభావాలంకృతము	1-0-0	0-12-0

గ్రంథకర్త

శ్రీ. రాజా కమదన వేంకటరావు బహద్దరుజమీందారువారు.

అనుబంధగ్రంథములు.

మహారాజశ్రీ పండిత పెనుమెత్స సత్యనారాయణ రాజుగారివిరచితమగు.

1. చంపకమాలినీ పరిణయము. — అచ్చతెలుఁగు ప్రబంధము శైలిద్రాక్షాపాకము. వెల రు 0-6-0 చందాదారులకు రు 0-4-0

ఇతరగ్రంథములు.

ఆనందచంద్రిక. రామకోటి. సంపాదకులగు శ్రీ విద్యానిధి కారుపల్లి శివరామదాసుగారిచే విరచితములు.

1. జీవకారుణ్యము. ముూఁడవకూర్పు. జీవహింస మద్యపాన మాంసభక్షణాది దురాచారఖండన లీగ్రంథమున వేనోళ్ల నక్కాణింపఁబడియున్నవి. వెల రు 0-12-0 లు చందాదారులకు రు 0-6-0లు.

2. శ్రీసుజ్ఞాన చంద్రోదయము. వెల రు 2-0-0 లు చందాదారులకు రు 1-8-0 లు

సుజ్ఞానచంద్రోదయము.

గ్రంథకర్త. విద్యానిధి, కాకుపల్లి. శివరామదాసుగారు,
ఇందు లేనివిషయ మెందును లేదని చెప్ప సాహసింపవచ్చును.

ఈగ్రంథము బ్రహ్మశ్రీ మహామహోపాధ్యాయ కొక్కొండ వేంకటరత్నము పంతులుగారు, శ్రీ వావిలికొలను సుబ్బారావుగారు, కడప తత్త్వజ్ఞానసభ శ్రీనంజుడప్ప బి. ఏ. బి. యల్. గారు మున్నగువారిచేతను, ఆంధ్రపత్రిక, దివ్యజ్ఞానదీపిక, సువర్ణలేఖ, శశిరేఖ మున్నగు పత్రికలయందును పొగడ్తఁగాంచినది.

వెల రు 2-0-0, చందాదారులకు రు 1-8-0.

ఉర్వీసుత్రోద్వాహము.

గ్రంథకర్త.

ఇక్కుర్తి. తిరుపతిరాయఁడుగారు, (బాలకవి.)

ఇందలి శైలి యత్యద్భుతమని ప్రశస్తనీయులగు పండితపుంగవులచేతను, ఆంధ్రపత్రిక, రంగూన్ తెలుఁగుపత్రిక మున్నగు పత్రికలయందును పొగడ్తఁగాంచినది.

వెల రు 1-0-0, చందాదారులకు రు 0-12-0.

అరిందమవిజయము

గ్రంథకర్త.

శ్రీకొక్కుర్తి. తిరుపతిరాయఁడుగారు (బాలకవి.)

ఇది రెండు గొప్ప బహుమాన పరీక్షలకుఁ బఠనీయముగా నియమింపఁబడిన అద్భుతరహస్యాపరాధపరిశోధక (డిటెక్టివు) నాటకము. నాటకమే కాదు?

నవరసంబుల తేట	నవభావసుమమయ, తోఁట
నవనాగరికులకు బాట	నవచోరజనమృగ వేఁట
నవరత్నముల పేట	నవ్వులమూట

ఇందలి కథాభాగము జూలియా, ఫూల్ సాహేబులను క్రూరాగ్రేసరుల వింత వింత దుశ్చేష్టలతో, అరిందముని యద్భుతపరిశోధనా ప్రవీణనిరూపణ నిర్బంధనలతో నిండి నిబిడీకృతమై పాఠకుల మానసంబుల నలరింపఁజేయును. శైలి మృదుమధురము. భావములు వర్ణనాతీతములు. కథాభాగమంతయు మిక్కిలి విచిత్రము.

వెల రు 1-0-0, చందాదారులకు రు 0-12-0.

మేనేజరు,

ఎ. పి. జి. నిలయము,

మండపల్లి.

లింగాలపోస్టు, కృష్ణాజిల్లా.